కిస్తీ కట్టలేదని దళిత మహిళ ఇంటికి తాళం

- ఇంట్లోని కుటుంబసభ్యుల గెంటివేత
- ఫైనాన్స్ సిబ్బంది దౌర్జన్యం
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాధితురాలు

3

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక :136 | విజయవాడ, బుధవారం 18 డిసెంబర్ 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 18 December 2024 | Rs



ఫాలో ఆన్ గండం గట్టెక్కింది 8

కెఎల్ రాహుల్, జడేజా అర్ధసెంచరీలు ● ఇండియా 252/9

జమిలిపై ఫైర్

లోక్‌సభలో బిల్లు - తీవ్రంగా వ్యతిరేకించిన ప్రతిపక్షాలు

జెపిసికి నివేదించిన ప్రభుత్వం

అప్రజాస్వామిక బిల్లుకు వంతపాడిన టిడిపి, జనసేన, వైసిపి - జెడియు మౌనం

రాష్ట్రాల హక్కులను ఎలా లాక్కొంటారు? : సూటిగా ప్రశ్నించిన అమ్రారామ్



లోక్‌సభలో జమిలీ బిల్లుపై చర్చిస్తున్న సభ్యులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఫెడరలిజంతో సహా రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని దెబ్బతీసే 'ఒకే దేశం, ఒకే ఎన్నికలు' లక్ష్యంగా రూపొందించిన వివాదాస్పద రాజ్యాంగ సవరణ బిల్లును ప్రతిపక్ష పార్టీలు ముక్తకంఠంతో వ్యతిరేకించాయి. ఈ బిల్లు రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఉందని, ప్రజాస్వామ్య స్వరూపంపైన, సమాఖ్యవాదంపైన దాడిగా దీనిని అభివర్ణించాయి. రాష్ట్ర అసెంబ్లీ పదవీకాలాన్ని కేంద్ర పదవీకాలంలోకి ఎలా మార్చుతారని ప్రశ్నించాయి. అలా మార్చడం రాజ్యాంగానికి ద్రోహం చేయడమేనని విమర్శించాయి. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను ఒకేసారి నిర్వహించేందుకు ఉద్దేశించిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లు, అలాగే లోక్‌సభ ఎన్నికలతో పాటు కేంద్ర పాలిత ప్రాంతాలకు కూడా ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర పాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లును కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు ప్రవేశపెట్టడాన్ని ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ప్రవేశపెట్ట డాన్ని వ్యతిరేకిస్తూ ఓటింగ్ కోరాయి. ఈ ఓటింగ్‌లో 269 మంది సభ్యులు రాజ్యాంగ సవరణ బిల్లును సమర్పించడానికి మద్దతు ఇచ్చారు. దీనికి మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం. 198 మంది సభ్యులు బిల్లును ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకించారు. ప్రజెంటేషన్ దశలోనే తీవ్ర వ్యతిరేకత రావడంతో, వివాదాస్పద బిల్లులను సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జెపిసి)కి పంపనున్నట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. నిబంధనల మేరకు తీర్మానం తీసుకురానున్నట్లు మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ మిగతా 7లో



ఎయిమ్స్-మంగళగిరి మొదటి బ్యాచ్ వైద్య విద్యార్థులతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు

గ్రామీణ ప్రాంతాల్లో సేవలందించండి

యువ వైద్యులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని యువ వైద్యులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు. మంగళగిరిలోని ఎయిమ్స్ తొలి స్నాతకోత్సవం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ద్రౌపది ముర్ము ఇక్కడ మొదటి బ్యాచ్‌గా వైద్య విద్యను పూర్తి చేసుకున్న 49 మంది ఎంబిబిఎస్ విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలోమాట్లాడుతూ ఎయిమ్స్‌లో పట్టాలు పొందుతున్న వైద్యులలో అధిక సంఖ్యలో మహిళలు ఉండటం పట్ల హర్షం వ్యక్తం చేశారు భారతీయ వైద్యులు తమ ప్రతిభ, కృషితో ప్రపంచంలోనే అగ్రగామిగా నిలుస్తున్నారని తెలిపారు. దేశంలో అందుబాటులో ఉన్న వైద్య సేవలు, సదుపాయాలను పొందేందుకు విదేశీయులు కూడా వస్తున్నట్లు చెప్పారు. మెడికల్ టూరిజానికి ప్రధాన కేంద్రంగా దేశం అభివృద్ధి చెందుతోందని తెలిపారు. నూతనంగా పట్టాలు పొందిన వైద్యులు సేవా, అభ్యాసం, పరిశోధన ఈ మూడు అంశాలపై దృష్టి సారిస్తేనే భవిష్యత్తులో విజయం సాధించగలుగుతారని చెప్పారు. ఎయిమ్స్‌లో వైద్య నిపుణులకు అందరికీ సంపూర్ణ ఆరోగ్య సంరక్షణ అందించడమే మార్గదర్శక సూత్రంగా ఉండాలని సూచించారు. ఈ సంస్థ భవిష్యత్తులో మరింతమంది నిపుణులైన వైద్యులను తీర్చిదిద్దాలన్న ఆకాంక్షను రాష్ట్రపతి వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ...మెడికల్ టెక్నాలజీని వినియోగించడంతో వైద్య రంగంలో అద్భుతాలు సాధించవచ్చన్నారు. మెడికల్ సైన్స్ ఇప్పుడు మెడ్ టెక్ సైన్స్ అయ్యిందని చెప్పారు. రోగులు తప్పని సరైతే తప్ప ఆసుపత్రులకు రాకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని తీర్చిదిద్దాలని సూచించారు. ఒడిశాలో ఒక మారుమూల గ్రామంలోని గిరిజన కుటుంబం నుంచి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వచ్చారని, ఉపాధ్యాయురాలిగా ప్రస్థానాన్ని ప్రారంభించి అంచెలంచెలుగా రాష్ట్రపతి స్థాయికి ఎదిగారని పట్టుదల కృషి ఉంటే ఉన్నత స్థానానికి చేరుకోవచ్చని నిరూపించి, అందరికీ ఆదర్శప్రాయంగా నిలిచారన్నారు. ఎయిమ్స్‌కు 183 ఎకరాలు కేటాయించామని, భవిష్యత్ మిగతా 7లో

రైతులపై కేంద్రం తీరుకు వ్యతిరేకంగా

23న రాష్ట్రవ్యాప్త నిరసన

- రైతు సంఘాల సమన్వయ సమితి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రైతులపై కేంద్రం తీరుకు వ్యతిరేకంగా ఈ నెల 23న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసనలు తెలపనున్నట్లు రైతు సంఘాల సమన్వయ సమతి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు తెలిపారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడారు. నూతన మార్కెట్ చట్టం జిరాక్స్ కాపీలను దగ్ధం చేయాలని, జిల్లా కేంద్రాల్లో నిరసనలు తెలపాలని కోరారు. ఢిల్లీ సరిహద్దులో రైతు ఉద్యమ నాయకులపై కేంద్ర ప్రభుత్వ పాశవిక దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. సంయుక్త కిసాన్ మోర్చా ఉద్యమ నాయకులు జగజ్జీత్‌సింగ్ దల్లేవాల్‌కు ఏమైనా హాని జరిగితే కేంద్రమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. రైతు సంఘం సీనియర్ నాయకులు కేశవరావు మాట్లాడుతూ.. రైతు వ్యతిరేక బిల్లులు తీసుకురాబోమని మోడీ ప్రభుత్వం రాత పూర్వకంగా హామీ ఇచ్చిందని, కానీ వేర్వేరు మార్గాల్లో వాటిని మరలా తీసుకొస్తోందని తెలిపారు. ఐసిఎఆర్ ద్వారా కార్పొరేట్ కంపెనీలతో ఒప్పటికే ఒప్పందాలు చేసుకుంటున్నారని, దీనివల్ల చిన్న రైతులు నష్టపోతారని పేర్కొన్నారు. రైతు సంఘం (దాసరిభవన్) రాష్ట్ర కార్యదర్శి కెవివి ప్రసాద్ మాట్లాడుతూ.. మోడీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజా వ్యతిరేక విధానాలు తీవ్రంగా అమలు చేస్తున్నారని విమర్శించారు. నల్లమడ రైతు సంఘం నాయకులు కొల్లా రాజమోహన్, ఎఐకెఎం నాయకులు హరినాథ్ కూడా మాట్లాడారు. ఈ సమావేశంలో ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య, నాయకులు పి ఆంజనేయులు, జొన్నా శివశంకరరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, నాయకులు మర్రెడ్డి వెంకటరెడ్డి, ఎం ప్రసాద్‌బాబు, యు గనిరాజు, ఎం రామకృష్ణ, ఎం యలమందరావు, కాసాని గణేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులను నట్టేటముంచితే సహించం

- జూన్‌కు పోలవరం నిర్వాసితులందరికీ పూర్తి స్థాయి పునరావాసం, పరిహారం కల్పించాల్సిందే
- లేనిపక్షంలో పోరాటం ఉధృతం
- రంపచోడవరం కేంద్రంగా ప్రత్యేక జిల్లా ప్రకటించాలి : వి శ్రీనివాసరావు



ప్రజాశక్తి- రంపచోడవరం

గిరిజనులను నట్టేట ముంచి పోలవరం ప్రాజెక్టు నిర్మిస్తే సహించేది లేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హెచ్చరించారు. 2025 జూన్ నాటికి నిర్వాసితులందరికీ పూర్తి స్థాయి పునరావాసం, పరిహారం కల్పించాలని డిమాండ్ చేశారు. అందుకోసం ఉద్యమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. రంపచోడవరంలో జరుగుతున్న సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రథమ మహాసభకు విచ్చేసిన ఆయన మహాసభ ప్రాంగణంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రంప చోడవరం నియోజక వర్గంలోని అత్యధిక మండలాలు పోలవరం ముంపులో ఉన్నాయని, ఇక్కడ నివసిస్తున్న గిరిజనులను నట్టేట ముంచి ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసేందుకు ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయన్నారు. నిర్వాసితులకు సిపిఎం అండగా ఉంటుందని, వారికి అన్యాయం జరిగితే ఊరుకునేది లేదని తెలిపారు. సోమవారం పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను పరిశీలించడానికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాజెక్టు నిర్మాణ పనులను మాత్రమే సమీక్షించారని, డయాఫ్రం వాల్, స్పిల్‌వే... ఇలా ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన వాటిపైనే సమీక్ష చేశారని, నిర్వాసితులను విస్మరించారని తెలిపారు. ప్రాజెక్టు వల్ల భూములు, ఇళ్లు సర్వస్వం కోల్పోయిన వారికి ఇవ్వాల్సిన పునరావాసం, పరిహారంపై పెదవి విప్పలేదన్నారు. ముఖ్యమంత్రి పోలవరం ముంపు గ్రామాల్లో పర్యటించి, అక్కడి గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించే విధంగా సమీక్షిస్తే బాగుండేదని పేర్కొన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి కేటాయించిన రూ.55 వేల కోట్లలో రూ.33 వేల కోట్లను నిర్వాసితులకు పునరావాసం కల్పించేందుకే కేటాయించాల్సి ఉందని, నిర్వాసితుల సమస్యలను విస్మరించి ప్రాజెక్టు నిర్మాణంపైనే ప్రభుత్వాలు దృష్టి సారిస్తున్నాయని తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణమైతే అంతా అయిపోయినట్టేనని వారు భావిస్తున్నారన్నారు. నిర్వాసితులను జల సమాధి చేసి ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేస్తామంటే కుదరదని, వారికి పూర్తి స్థాయిలో అన్ని దశల్లో ఒకేసారి పునరావాసం, పరిహార ప్రక్రియను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. తాము అధికారంలోకొస్తే నిర్వాసితుల సమస్యలను పూర్తిగా పరిష్కరిస్తామని టిడిపి కూటమి నేతలు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని, గద్దెనెక్కాక నిర్వాసితులను పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు.

రంపచోడవరం కేంద్రంగా ప్రత్యేక జిల్లాను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు జిల్లాల విభజన సమయంలో రంపచోడవరం నియోజకవర్గాన్ని పాడేరులో కలిపి అల్లూరి జిల్లాను ఏర్పాటు చేశారని, అక్కడి నుంచి అల్లూరి జిల్లా కేంద్రమైన పాడేరుకు వెళ్లాలంటే సుమారు 400 కిలోమీటర్ల మేర ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ప్రజల ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి పోరాడుతున్న సిఆర్‌టిలకు తమ పార్టీ పూర్తి మద్దతు తెలుపుతోందన్నారు. విలేకర్ల సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి బి.కిరణ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.నాగేశ్వరరావు పాల్గొన్నారు.



గోడు వెళ్లబోసుకుంటున్న బాధితులు

షికారీలపై 'మత'ముద్ర

- షాపులు కూల్చివేత
- వీధినపడ్డ 500 కుటుంబాలు
- మతోన్మాదుల కుట్ర
- టిటిడి, ఫారెస్టు అధికారుల వేధింపులు

6

పింఛన్‌దారులపై పిడుగు

భారీగా కోతకు కసరత్తు

సుమారు 3 లక్షలు రద్దయ్యే అవకాశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా సామాజిక పింఛన్లలో (ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు) భారీ ఎత్తున కోత పెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమౌతోంది. ఖజానాపై భారాన్ని తగ్గించుకోవడమే లక్ష్యంగా ఈ దిశలో కసరత్తు చేస్తోంది. అనర్హులను గుర్తించే పేరిట ఇప్పటికే ఈ ప్రక్రియ ప్రారంభమైంది. ఈనెల 9,10 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాకు ఒక సచివాలయాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. ఈ తనిఖీల్లో 26 సచివాలయాల పరిధిల్లో 563 మంది అనర్హులకు



పింఛన్లు అందినట్లు గుర్తించారు. వీరికి నోటీసులు జారీ చేయాలని, సరైన సమాధానం చెప్పకపోతే ఆయా లబ్ధిదారుల పింఛన్‌ను 'హోల్డ్'లో పెట్టాలంటూ ఈనెల 17న సెర్ప్ సిఇఓ నుండి జిల్లాల అధికారులకు , మునిసిపల్ కమిషనర్లకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఏలూరు జిల్లాలో ఒక సచివాలయం పరిధిలో 12 క్లస్టర్లలో 420 మంది పెన్షన్‌దారులు ఉండగా 400 మందిని తనిఖీ చేసినట్లు తెలిసింది. వీరిలో 13 మంది అందుబాటులో లేరు. 15 మంది అనర్హులుగా తేలినట్లు సమాచారం. మరో నాలుగైదు సచివాలయాల పరిధిలో కూడా దాదాపుగా ఇదే స్థాయిలో ఫలితాలు వచ్చినట్లు చెబుతున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన 13 ప్రశ్నల ఆధారంగా ఈ కసరత్తు సాగింది. దీనినే ప్రాతిపదికగా తీసుకుంటే రాష్ట్ర వ్యాప్తంగాఉన్న 15,004 సచివాలయాల పరిధిలో 3 నుండి 3.50 లక్షల మంది పింఛన్లపై వేటు పడే అవకాశం ఉందని అంచనా! ఎలక్ట్రిసిటీ బిల్లు, నాలుగు చక్రాల వాహనాలు, ఒకే ఇంట్లో రెండు పెన్షన్లు, భూముల విస్తీర్ణం తదితర అంశాలను ప్రశ్నలలో ప్రభుత్వం చేర్చింది.

రిక్రూట్‌మెంట్ పరీక్షలు ఇక ఎన్‌టిఎ నిర్వహించదు

న్యూఢిల్లీ : కొత్త సంవత్సరం నుండి ఇక ఎటువంటి రిక్రూట్‌మెంట్ పరీక్షలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) నిర్వహించబోదని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రకటించారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఉన్నత విద్యకు సంబంధించిన ప్రవేశ పరీక్షలపై మాత్రమే దృష్టి కేంద్రీకరిస్తుందని స్పష్టం చేశారు. మెడికల్ ఎంట్రెన్స్ నీట్ పరీక్షా పత్రం లీక్, అలాగే మరి కొన్ని ప్రశ్నాపత్రాల లీక్‌లతో పలు పరీక్షలు రద్దయిన వైనం పెద్దయెత్తున విమర్శలకు దారి తీసింది. దీంతో ఈ ఏడాది ప్రారంభంలో ఏర్పాటుచేసిన ఉన్నత స్థాయి కమిటీ సిఫార్సుల మేరకు పరీక్షల సంస్కరణలు తీసుకొచ్చామని మంత్రి తెలిపారు. సాంప్రదాయపద్ధతిలో పెన్ను, పేపర్‌తో నిర్వహించాలా? లేక కంప్యూటర్‌తో పరీక్ష నిర్వహించాలా? అనే విషయమై ఆరోగ్య మంత్రిత్వశాఖతో విద్యా శాఖ చర్చలు జరుపుతోంది. కామన్ యూనివర్శిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సియుఇటి) - యుజి ని ఏడాదికి ఒకసారి మాత్రమే నిర్వహిస్తామని మంత్రి వెల్లడించారు. సమీప భవిష్యత్తులో కంప్యూటర్ సహాయంతో, సాంకేతిక ఆధారిత ప్రవేశపరీక్షలకు మారాలని ప్రభుత్వం యోచిస్తోందని చెప్పారు. కొత్త సంవత్సరంలో ఎన్‌టిఎను పునర్ వ్యవస్థీకరించనున్నట్లు మంత్రి తెలిపారు.

మతోన్మాదం, ఉదారవాద ఆర్థిక విధానాలపై
ప్రజా పోరాటాలు

సిపిఎం కృష్ణా జిల్లా మహాసభలో వై వెంకటేశ్వరరావు, సిహెచ్ బాబూరావు

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

నయా ఉదారవాద ఆర్థిక విధానాల్ని, మతోన్మాదాన్ని కేంద్ర ప్రభుత్వం మిళితం చేసి దేశాన్ని అధోగతిపాలు చేస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, వై.వెంకటేశ్వరరావు విమర్శించారు. కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని టిడిపి కూటమి పాలకులు అనుసరిస్తోన్న ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ దోపిడీ విధానాలపై క్షేత్రస్థాయిలో ఉద్యమాలను ఉధృతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మూడురోజులపాటు చల్లపల్లిలో జరిగిన సిపిఎం కృష్ణా జిల్లా 25వ మహాసభ మంగళవారం ముగిసింది. బాబూరావు, వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని మూడు ప్రాంతీయ పార్టీలు పూర్తిగా బిజెపికి లొంగిపోయాయన్నారు. ఈ పార్టీలు రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణలోను, మతోన్మాదాన్ని నిలువరించడంలోనూ విఫలమయ్యాయని విమర్శించారు. ఇటువంటి పరిస్థితుల్లో వామపక్షాలు, అభ్యుదయ శక్తుల ప్రాధాన్యత పెరిగిందన్నారు. ప్రభుత్వం మోపిన విద్యుత్ భారాలపైన ప్రజలను సమీకరించి పోరాడాలన్నారు. టిడిపి కూటమి పెద్దలకు చిత్తశుద్ధి ఉంటే అదాని, సెకీలతో జగన్ కుదుర్చుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని ఆపాలన్నారు. 2047 వికసిత్ భారత్ అని కేంద్రంలోని బిజెపి, స్వర్ణాంధ్రప్రదేశ్ అని రాష్ట్రంలోని టిడిపి కూటమి నేతలు



మహాసభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు

ప్రజలను మభ్యపెడుతున్నాయని విమర్శించారు. ఐదేళ్లకాలంలో ఏమి చేస్తారో చెప్పకుండా దీర్ఘకాలిక ప్రణాళికల పేరుతో ప్రజలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను మోసం చేస్తున్నాయని విమర్శించారు. పబ్లిక్, ప్రయివేటు, పీపుల్స్ భాగస్వామ్యం (పిపిపిపి) పేరుతో టిడిపి కూటమి ప్రభుత్వం రాష్ట్ర రహదారులను కార్పొరేట్లకు కట్టబెట్టి టోల్ వసూలు చేయడానికి, తద్వారా ప్రజలపై భారాలు మోపడానికి పూనుకుంటోందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా రాష్ట్రాభివృద్ధిని కోరే ప్రజాస్వామ్యశక్తులు, వామపక్షాలు, ప్రజాతంత్ర శక్తులు సాగించే ఐక్య పోరాటాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ పుణ్యవతి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

నూతన కార్యదర్శిగా వై.నరసింహారావు

సిపిఎం కృష్ణా జిల్లా నూతన కార్యదర్శిగా వై.నరసింహారావు, 21 మందితో జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా కళ్లం వెంకటేశ్వరరావు, మాదాల వెంకటేశ్వరరావు, వి.జ్యోతి, కె.శివనాగేంద్ర, టి.వి.లక్ష్మణస్వామి, శీలం నారాయణరావు ఎన్నికయ్యారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం

- డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రథమ మహాసభలో కె సుబ్బరావమ్మ

ప్రజాశక్తి- అమలాపురం (డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తోన్న ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ పిలుపునిచ్చారు. అమలాపురం ప్రెస్‌క్లబ్‌లోని పచ్చిమాల వసంతకుమార్ నగర్‌లో రెండు రోజులపాటు జరిగే సిపిఎం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రథమ మహాసభ మంగళవారం ప్రారంభమైంది. మహాసభకు అధ్యక్ష వర్గంగా ఎన్.బలరామ్, కె.కృష్ణవేణి, బివి.రాఘవులు వ్యవహరించారు. తొలుత అరుణపతాకాన్ని సిపిఎం సీనియర్ నాయకులు పీతల రామచంద్రరావు ఆవిష్కరించారు. సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, జిల్లా కన్వీనింగ్ కమిటీ సభ్యులు పచ్చిమాల వసంతకుమార్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అనంతరం సుబ్బరావమ్మ ప్రారంభోపన్యాసం చేస్తూ.. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసగిస్తోందన్నారు. వ్యవసాయం, పరిశ్రమలు, గనులు, విద్యుత్, అటవీ సంపద, రవాణా, బ్యాంకులు, ఎల్ఐసి తదితర సంస్థలను అదాని, అంబాని వంటి కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తోందని వివరించారు. మహిళలకు రక్షణ కల్పించడంలో, నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయడంలో పూర్తిగా విఫలమైందని



మహాసభలో మాట్లాడుతున్న కె సుబ్బరావమ్మ

తెలిపారు. దళితులు, గిరిజనులు, మైనారిటీల సంక్షేమానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని విమర్శించారు. విద్యుత్ ఛార్జీల పేరుతో సామాన్యుడి నడ్డి విరిచారని, ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారని తెలిపారు. ఒకే దేశం ఒకే ఎన్నిక అంటూ జమిలి ఎన్నికలను కేంద్ర ప్రభుత్వం ముందుకు తీసుకువచ్చిందన్నారు. దేశంలో జమిలి ఎన్నికలు జరిగితే ప్రజాసామ్యానికి ముప్పు ఏర్పడుతుందని తెలిపారు. విద్యుత్ చట్ట సవరణ బిల్లులకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. బిజెపి పాలనలో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని తెలిపారు. విభజన హామీలనూ విస్మరించిందన్నారు. ప్రత్యేక హోదాను పక్కన పెట్టిందని, వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ఇవ్వాల్సిన ప్రత్యేక ప్యాకేజీ అమలు చేయడంలేదని తెలిపారు. కడప ఉక్కు ఫ్యాక్టరీ ఇవ్వకపోగా తెలుగు ప్రజలు పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని అమ్మకానికి పెట్టిందని వివరించారు. రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్రలు పన్నుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మతోన్మాదాన్ని పెంచి పోషిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వైసిపి ఓడిపోయి టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడినా విధానాల్లో మార్పు రాలేదన్నారు. మహాసభలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

27న సోషల్ మీడియా పోస్టులపై కేసుల విచారణ

ప్రజాశక్తి-అమరావతి

సోషల్ మీడియా పోస్టులపై పోలీసులు నమోదు చేసిన కేసులో వైసిపి సోషల్ మీడియా మాజీ ఇన్‌ఛార్జి సజ్జల భార్గవ్‌రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవద్దన్న గత ఉత్తర్వులను హైకోర్టు మంగళవారం మరోసారి పొడిగించింది. ఈ నెల 27న జరిగే తదుపరి విచారణ వరకు పిటిషనర్‌పై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోరాదని పోలీసులను ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ విఆర్‌కె కృపాసాగర్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. 27న సోషల్ మీడియా పోస్టులపై నమోదైన కేసులపై దాఖలైన పిటిషన్లను కలిపి విచారణ జరుపుతామని ప్రకటించారు. సోషల్ మీడియా పోస్టుల వ్యవహారంలో పలువురు దాఖలు చేసిన పిటిషన్లపై కూడా అదే రోజు విచారణ జరుపుతామన్నారు.

కేసు కొట్టేయండి

- శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే పిటిషన్

ప్రజాశక్తి-అమరావతి

శ్రీకాళహస్తి వన్ టౌన్ పోలీసులు పెట్టిన కేసును కొట్టేయాలంటూ వైసిపి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ వేశారు. తుది తీర్పు వెలువడేలోగా కేసు విచారణను నిలిపివేయాలని, ఏడేళ్లలోపు శిక్ష పడే కేసు కాబట్టి అరెస్టు చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. శ్రీకాళహస్తి మున్సిపల్ పరిధిలో స్వర్ణముఖి నది ఒడ్డున వైసిపి నేత 2017లో రివర్ వ్యూ పేరిట రిసార్ట్ నిర్మించడంతో అధికారులు కూల్చివేత చర్యలు చేపడుతుంటే మధుసూదన్‌రెడ్డి వచ్చి మున్సిపల్ అధికారులను నిలదీశారు. రెడ్డి తమ విధులకు ఆటంకం కలిగించారంటూ టౌన్ ప్లానింగ్ అధికారి శారద ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఈ నెల 14న కేసు నమోదు చేశారు. బిఎన్ఎస్ సెక్షన్ 35 కింద నోటీసులు ఇవ్వాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. ఈ వ్యాజ్యంపై హైకోర్టు విచారణ జరపనుంది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

మార్చి నాటికి పంచాయతీలకు భారత్ నెట్

- ఫైబర్ నెట్ ఎమ్‌డి దినేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీలకు బ్రాడ్ బ్యాండ్ సేవలను 2025 మార్చి నాటికి కల్పిస్తామని ఎపి ఫైబర్ నెట్ ఎమ్‌డి కె దినేష్ కుమార్ తెలిపారు. డిజిటల్ భారత్ నిధిలో భాగంగా భారత్ నెట్-2 ప్రాజెక్టు పనుల ప్రగతిపై సమీక్షా సమావేశం విజయవాడలోని బిఎస్ఎన్ఎల్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా దినేష్ కుమార్ మాట్లాడుతూ.. అన్ని గ్రామ పంచాయతీలకు భారత్ నెట్ సదుపాయన్ని కల్పించాలనే లక్ష్యంతో పనులు వేగవంతంగా చేస్తున్నామన్నారు. మరోవైపు ఈ కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే 15 వేల మందికి ఫైబర్‌నెట్ ద్వారా బ్రాడ్ బ్యాండ్ కనెక్టివిటీ కల్పించామని తెలిపారు. కార్యక్రమంలో డిజిటల్ భారత్ నిధి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సంజయ్ కుమార్, డైరెక్టర్ హరికృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

జివిఏలో విశాఖ టాప్

- సర్వీస్, ఇండస్ట్రీ రంగాల్లో నంబర్-1
- వ్యవసాయంలో ఏలూరు టాప్
- 2022-23 ప్రణాళికశాఖ ర్యాంకింగ్స్ విడుదల

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఆర్థికాభివృద్ధిలో కీలకంగా ఉండే జివిఏ (స్థూల విలువ)లో విశాఖపట్నం అగ్రస్థానంలో కొనసాగుతోంది. మూడు రంగాల్లో తయారుచేసిన నివేదికలో విశాఖ ఏకంగా రెండు రంగాల్లో నంబర్ వన్‌గా నిలిచింది. మరొక రంగంలో ఏలూరు జిల్లా అగ్రస్థానంలో కొనసాగుతోంది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రణాళిక శాఖ తయారుచేసిన నివేదికలో వ్యవసాయం, పరిశ్రమలు, సర్వీస్ సెక్టార్లలో పలు జిల్లాలు సాధించిన ప్రగతిని వివరించారు.

పరిశ్రమల రంగంలో 59,264 కోట్ల స్థూల విలువతో విశాఖ తొలి స్థానంలో నిలిచింది. ఇది మొత్తం విలువలో 18.82 శాతంగా ఉంది. ఇక రెండో స్థానంలో తిరుపతి జిల్లా 24,505 కోట్ల స్థూల విలువతో కొనసాగుతుండగా, అనకాపల్లి జిల్లా 22,092 కోట్లతో మూడో స్థానంలో ఉంది. తరువాత స్థానాల్లో ప్రకాశం, ఎన్టీఆర్, కాకినాడ, గుంటూరు జిల్లాలు ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా చివరి స్థానంలో ఉండడం గమనార్హం. ఇక సర్వీస్ సెక్టార్‌లో కూడా 49,131 కోట్ల స్థూల విలువతో విశాఖే తొలి స్థానంలో నిలిచింది. మొత్తం విలువలో 10.22 శాతం విశాఖ సమకూరుస్తోంది. ఈ రంగంలో ఎన్టీఆర్ జిల్లా 45,419 కోట్లతో రెండో స్థానంలో, గుంటూరు 31,591 కోట్లతో మూడో స్థానంలో కొనసాగుతున్నాయి. తరువాత స్థానాల్లో తిరుపతి, కృష్ణా, నెల్లూరు, అనంతపురం జిల్లాలు ఉన్నాయి. ఈ రంగంలో కూడా అల్లూరి సీతారామరాజు జిల్లా చివరి స్థానంలోనే ఉండడం గమనార్హం.

జివిఏలో తొలి 5 ర్యాంకులు సాధించిన జిల్లాలు (రూ. కోట్లలో)

వ్యవసాయం			పరిశ్రమలు			సర్వీస్		
జిల్లా	జివిఏ	ర్యాంక్	జిల్లా	జివిఏ	ర్యాంక్	జిల్లా	జివిఏ	ర్యాంక్
ఏలూరు	42,249	1	విశాఖ	59,264	1	విశాఖ	49,131	1
కృష్ణా	32,372	2	తిరుపతి	24,505	2	ఎన్టీఆర్	45,419	2
అనంత	24,858	3	అనకాపల్లి	22,092	3	గుంటూరు	31,591	3
ప.గో	22,770	4	ప్రకాశం	15,218	4	తిరుపతి	25,966	4
నెల్లూరు	22,505	5	ఎన్టీఆర్	14,228	5	కృష్ణా	24,115	5

వ్యవసాయంలో ఏలూరు టాప్

ఇక కీలకమైన వ్యవసాయ రంగంలో 42,249 కోట్ల రూపాయల స్థూల విలువతో ఏలూరు జిల్లా అగ్రస్థానంలో ఉంది. ఇది మొత్తం విలువలో 9.87 శాతంగా ఉన్నట్లు తేల్చారు. ఈ రంగంలో రెండో స్థానంలో కృష్ణా జిల్లా 32,372 కోట్ల విలువతో కొనసాగగా, అనంతపురం జిల్లా 24,858 కోట్లతో మూడో స్థానంలో ఉన్నట్లు తేల్చారు. వ్యవసాయానికి కీలకంగా ఉండే తూర్పు గోదావరి జిల్లా ఏడో స్థానంలో, కోనసీమ జిల్లా 16వ స్థానంలో ఉండడం గమనార్హం. అనంతపురం తరువాత పశ్చిమగోదావరి జిల్లా, నెల్లూరు, బాపట్ల జిల్లాలు ఉన్నాయి. ఇక మొత్తం స్థూల విలువలో తొలి మూడు స్థానాల్లో నిలిచిన జిల్లాల్లో కూడా విశాఖే అగ్రస్థానంలో ఉండడం గమనార్హం. అలాగే రెండో స్థానంలో ఎన్టీఆర్ జిల్లా, మూడో స్థానంలో కృష్ణా జిల్లాలు ఉన్నాయి.

జమిలీని వ్యతిరేకిస్తున్నాం

- సిపిఐ ప్రధాన కార్యదర్శి డి రాజా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



జమిలీ ఎన్నికలకు సిపిఐ వ్యతిరేకమని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి డి రాజా తెలిపారు. ఈ మేరకు లా కమిషన్‌కు, రామ్‌నాథ్ కోవింద్ కమిటీకి తమ అభ్యంతరాలపై నివేదిక సమర్పించినట్లు పేర్కొన్నారు. విజయవాడలోని దాసరి భవన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వాస్తవానికి దేశంలో జమిలీ ఎన్నికలు ఆచరణ సాధ్యం కాదన్నారు. ఎన్నికల సంఘం స్వతంత్రంగా, స్వేచ్ఛగా, పారదర్శకంగా పని చేయాల్సి ఉందన్నారు. ఒకే దేశం ఒకే ఎన్నిక అనేది సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తోందన్నారు. రాజ్యాంగం ఏర్పడి 75 ఏళ్లయిన సందర్భంగా పార్లమెంట్‌లో ప్రత్యేక చర్చ జరుగుతోందన్నారు. అన్ని తరగతుల ప్రజలు కలిసి జీవించాలంటే దేశంలో లౌకిక, ప్రజాస్వామ్య విధానం ఉండాలంటూ బిఆర్ అంబేద్కర్ ఆలోచన చేసిన రాజ్యాంగాన్ని అందించారని చెప్పారు. రాజ్యాంగానికి బిజెపి, ఆర్ఎస్ఎస్ తూట్లు పొడుస్తున్నాయని విమర్శించారు. విద్యుత్ కొనుగోలు ఒప్పందాలపై స్పందిస్తూ.. అదానిని అరెస్టు చేస్తేనే నిజాలు బయటకు వస్తాయని చెప్పారు.

కేంద్రం ఆశ్రిత పెట్టుబడిదారీ విధానంతో సంపన్నులకు మరింత మేలు చేస్తోందన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ.. పోలవరం నిర్వాసితుల గురించి ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రాజెక్టు ఎత్తు 41.1 మీటర్లు వరకూ మాత్రమే పరిహారం ఇస్తామని మోడీ చెప్పినట్లు వస్తున్న వార్తలపై సిఎం చంద్రబాబు వాస్తవ సమాచారాన్ని బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆ పార్టీ సహాయ కార్యదర్శులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జెవి సత్యనారాయణమూర్తి, కార్యదర్శివర్గ సభ్యులు రావుల వెంకయ్య, అక్కినేని వనజ పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తలు క్షమించాలి

- మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణ కార్యక్రమంలో తెలుగుదేశం కార్యకర్తలు బాధపడే సంఘటన జరిగిందని, ఈ విషయంలో పార్టీ కార్యకర్తలు తనను క్షమించాలని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి కోరారు. టిడిపి కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నూజివీడులో గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణ కార్యక్రమానికి వైసిపి నాయకుడు జోగి రమేష్ హాజరవడంపై పత్రికల్లో వేర్వేరు కథనాలు వచ్చాయని పేర్కొన్నారు. ఉద్దేశపూర్వకంగా తెలిసి ఆ కార్యక్రమంలో తాను పాల్గొన్నట్లు రాశారని తెలిపారు. చంద్రబాబు, లోకేష్ తనకు ఇచ్చిన గౌరవాన్ని తాను జీవితంలో మర్చిపోలేనని తెలిపారు. తాను ఆ కార్యక్రమానికి హాజరు కావడం వల్ల కార్యకర్తల మనోభావాలు దెబ్బతిన్నందుకు మరోసారి క్షమించాలని కోరుతున్నట్లు తెలిపారు. అక్కడ గౌడ సంఘీయులు ఏర్పాటు చేసిన విగ్రహావిష్కరణ కార్యక్రమంలో టిడిపికి ఎటువంటి ప్రమేయమూ లేదని, దీన్ని గౌడ కలస్తులు మాత్రమే ఏర్పాటు చేశారని చెప్పారు. డిసెంబర్ 8, 9 తేదీల్లో తన వద్దకు వచ్చిన సమయంలో 15న ఆ కార్యక్రమం చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. తరువాత ఆహ్వానం పంపించారని, దాన్ని పూర్తిగా చదవలేదని తెలిపారు. 15వ తేదీ శాఖపరమైన సమావేశం ఉందని, నిర్ణీత సమయాన్ని తన కోసం మార్చారని చెప్పారు. అక్కడ జోగి రమేష్ ఉండటంతో కొంత ఇబ్బంది పడ్డానని చెప్పారు. కుల సంఘ కార్యక్రమం కావడంతో వారికి సలహా ఇవ్వలేదని చెప్పారు. దానికి కూడా కార్యకర్తలకు క్షమాపణ చెబుతున్నానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులు అందరూ టిడిపి నాయకులేనని వివరించారు. జోగి రమేష్‌కు తనకూ వ్యక్తి గత సంబంధాలు లేవని, గతంలో తనను ఇబ్బంది పెట్టాడని అన్నారు.

ర్యాలీలోనూ తన గెలుపు కోసం కష్టపడినవారు ఉన్నారని అన్నారు. తనపై చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దని, టిడిపిని నమ్మి పనిచేస్తున్నానని చెప్పారు. ఎన్నికలకు ఐదు నెలల ముందు పార్టీలో చేరినా తనను ఆదరించారని, అటువంటి వారిని బలోపేతం చేయడం కోసం కృషి చేస్తున్నానని అన్నారు. ఆహ్వానపత్రికను పూర్తిగా చూడకపోవడం వల్లే ఈ పొరపాటు జరిగిందని, మరోసారి జగరకుండా చూసుకుంటానని మంత్రి వివరించారు.

ఉత్తరకోస్తాలో జల్లులు

ప్రజాశక్తి - యంత్రాంగం

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశం మేఘావృతమై మబ్బులు పట్టింది. ఉత్తర కోస్తాలో పలు చోట్ల మోస్తరు వర్షం పడింది. శ్రీకాకుళం జిల్లాలో ఉదయం నుంచే పలుచోట్ల తేలికపాటి జల్లులు పడ్డాయి. లావేరు, జలుమూరులలో 1.5 మిల్లీమీటర్ల చొప్పున వర్షం నమోదైంది. శ్రీకాకుళంలో 0.75, టెక్కలి మండలం రావివలస, లావేరు మండలం తామాడలో 0.5మి.మీ వర్షం కురిసింది. అధికారుల హెచ్చరికల నేపథ్యంలో పంటను కాపాడుకునే పనిలో అన్నదాతలు నిమగ్నమయ్యారు. పొలాల్లో ఉంచిన ధాన్యాన్ని ఇళ్లకు తరలిస్తున్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో వాతావరణం మారిపోవడంతో చలిగాలులు వీస్తున్నాయి. దీంతో ప్రజలు బయటకు రావడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలోని పలు ప్రాంతాల్లో సాయంత్రం నుండి చిరు జల్లులు పడ్డాయి. దీంతో రోడ్లపై జన సంచారం తగ్గింది. వాతావరణ మార్పులతో ఆక్వారైతులు సైతం తల్లడిల్లుతున్నారు. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు వర్షం కురిసింది. చల్లని గాలులు వీచాయి. చలి తీవ్రత పెరిగింది.

నేడు, రేపు ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు

రానున్న 38 గంటల్లో ఉత్తరాంధ్రలో అక్కడక్కడా భారీ నుంచి అతి భారీ వర్షాలు పడనున్నాయి. ఈ మేరకు విపత్తుల నివారణ సంస్థ మంగళవారం విడుదల చేసిన ప్రకటన ప్రకారం విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడనున్నాయి. రాష్ట్రంలోని పలు ఇతర జిల్లాల్లో (శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, నెల్లూరు, వైఎస్ఆర్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి) తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉంది. ఈ నెల 19న శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉంది.

పోలీసులపై దాడి కేసులో 13 మంది అరెస్టు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

పోలీసుల అదుపులో ఉన్న దొంగనోట్ల ముఠా నాయకుని సినీ ఫక్కీలో వెంబడించి విడిపించుకుని తీసుకెళ్లిన ఘటనలో 13 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు వివరాలను తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సెంట్రల్ జోన్ డిఎస్‌పి కె.రమేష్‌బాబు మంగళవారం మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. దొంగనోట్లు, ఇతర కేసుల్లో నిందితుడిగా ఉన్న భీమవరానికి చెందిన రాపాక ప్రభాకర్‌ను ఈ నెల 12న శ్రీకాకుళం పోలీసులు భీమవరంలో అరెస్టు చేశారు. ఇదే కేసులో మరో నిందితుడు కృష్ణమూర్తి ఫోన్ లొకేషన్ తెలుసుకునేందుకు పోలీసు వాహనంలో రాజమహేంద్రవరం తీసుకొచ్చారు. అనంతరం శ్రీకాకుళానికి తరలిస్తున్న క్రమంలో వాహనం రాజమహేంద్రరం ఆర్‌టిసి కాంప్లెక్స్ రోడ్డుకు వచ్చేసరికి గుర్తుతెలియని కొంతమంది రెండు కార్లు, బైకులపై వచ్చి వాహనాన్ని అడ్డగించారు. పోలీసులపై దాడి చేసి నిందితుడు ప్రభాకర్‌ను విడిపించుకుని తీసుకెళ్లారు. దీనిపై రాజమహేంద్రవరం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వాహనాల నెంబర్ల ఆధారంగా 13 మంది నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్‌పి తెలిపారు. భీమవరానికి చెందిన నల్లి శశికాంత్, పోతుల యేపేతు, తాళ్ల జాన్సన్‌రాజు, పెద్దపాటి మహంకాళి, నేతిపూడి క్రాంతికుమార్, గండుపల్లి కుమార్‌రాజు, రాజమహేంద్రవరానికి చెందిన గెద్దాడ శ్రీనాథ్, తురుబిల్లి రామసతీష్, బుంగా తేజ, ఇడిసిమల్ల సతీష్, కాకి గోవింద్, పాతాళ చిరంజీవి, నక్కా వెంకటదుర్గశ్రీ అఖిల్‌లను అరెస్టు చేసినట్లు చెప్పారు.

పైప్డ్‌గ్యాస్ రాజధానిగా అమరావతి

- గుజరాత్ గిఫ్ట్ సిటీ తరహాలో చేపడతాం
- ప్రతిపాదనలు సమర్పించిన ఐఒసి అధికారులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దేశంలో మొత్తం పైప్డ్ గ్యాస్ వినియోగించే రాజధానిగా అమరావతిని మారుస్తామని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ అధికారులు ప్రతిపాదనలతో ముందుకొచ్చారు. పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ రెగ్యులేటరీ బోర్డు సభ్యులు ఎఎ రమణకుమార్ నేతృత్వంలో ప్రతినిధుల బృందం మంగళవారం సెక్రటేరియట్లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రంలో చేపడుతున్న గ్యాస్ పైపులైన్లపై చర్చించారు. అమరావతిని దేశంలో మొట్టమొదటి పూర్తి పైప్డ్ గ్యాస్ నగరంగా చేయాలని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ప్రతిపాదించిన విషయాన్ని ప్రభుత్వం ముందుంచారు. గుజరాత్ గాంధీనగర్ జిల్లాలోని గుజరాత్ ఇంటర్నేషనల్ ఫిన్ టెక్ సిటీ(గిఫ్ట్) నగరంలో గ్యాస్ మొదలు, విద్యుత్, టెలికాం కేబుళ్ల వరకూ అన్నీ భూగర్భంలోనే ఉంటాయని తెలిపారు.

అక్కడ ఆవాసాలకు వ్యాపార సముదాయాల, సంస్థలన్నిటికీ పూర్తి పైప్డ్ గ్యాస్ అందించబడుతోందని పేర్కొన్నారు. అదే తరహాలో అమరావతి రాజధాని నగరంలోనూ పూర్తి పైప్డ్ గ్యాస్ అందిస్తామని తెలిపారు. దీనికి సిఎస్ సమ్మతించారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు.

80 లక్షల కనెక్షన్లు లక్ష్యం

రాబోయే రోజుల్లో 80 లక్షల మందికి పైప్డ్ గ్యాస్ కనెక్షన్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆంధ్రప్రదేశ్ గ్యాస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కె దినేష్‌కుమార్ తెలిపారు. సిఎస్‌తో భేటీ అనంతరం పిఎన్‌జిఆర్‌బి ప్రతినిధుల బృందం ఆర్‌టిజిఎస్‌ను సందర్శించి అక్కడ ఎపి గ్యాస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులతోనూ సంప్రదింపులు జరిపారు. నేచురల్ గ్యాస్ పైపులైన్ల నిర్మాణం ప్రగతి, గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ పనుల గురించి చర్చించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో 80 లక్షల ఆవాసాలకు పైపుల ద్వారా గ్యాస్ సరఫరా అందించాలనేది లక్ష్యమని పేర్కొన్నారు.

స్టెల్లా ఎల్ నౌకలో పిడిఎస్ బియ్యం

- 1,320 టన్నులు ఉన్నట్లు నిర్ధారణ : కాకినాడ కలెక్టర్

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

కాకినాడ యాంకరేజి పోర్టులోని స్టెల్లా ఎల్ నౌకలో 1,320 టన్నుల పిడిఎస్ బియ్యం ఉన్నట్టుగా మల్టీ డిసిప్లినరీ బృందం తనిఖీల్లో నిర్ధారణ అయ్యిందని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి తెలిపారు. మంగళవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాల్లో ఎస్‌పి విక్రాంత్ పాటిల్, జెసి రాహుల్ మీనాలతో కలిసి ఆయన ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత నెల 29న యాంకరేజి పోర్టులో ఎగుమతి కోసం లోడ్ చేసిన స్టెల్లా ఎల్ నౌకలో తాను జరిపిన తనిఖీల్లో 640 టన్నుల రేషన్ బియ్యాన్ని గుర్తించానన్నారు. అనంతరం డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ తనిఖీలు నిర్వహించారని తెలిపారు. ఈ నేపథ్యంలో మొత్తం బియ్యాన్ని తనిఖీ చేసేందుకు ఐదు శాఖల అధికారులతో కూడిన మల్టీ డిసిప్లినరీ టీమ్‌ను నియమించామని చెప్పారు. ఈ టీమ్ స్టెల్లా ఎల్ నౌకలోని మొత్తం నాలుగు వేల టన్నుల బియ్యాన్ని 12 గంటల పాటు తనిఖీ చేసి నమూనాలు సేకరించిందని తెలిపారు. నౌకలోని మూడవ కంపార్టుమెంట్‌లో ముందు గుర్తించిన 640 పిడిఎస్ బియ్యంతో పాటు మరో 680 టన్నులు పిడిఎస్ బియ్యం ఉన్నట్లు ల్యాబ్‌లో నిర్ధారణ అయ్యిందన్నారు. ఈ బియ్యం సత్యం బాలాజీ రైస్ ఎక్స్ పోర్ట్ ఇండస్ట్రీస్ సంస్థకు చెందినవిగా గుర్తించామని తెలిపారు. ఈ బియ్యాన్ని సంస్థ ఎక్కడ నుంచి సేకరించిందనే దానిపై విచారణ జరుగుతుందని తెలిపారు. స్టెల్లా ఎల్ నౌకలో గుర్తించిన 1320 టన్నుల పిడిఎస్ బియ్యాన్ని నౌక నుంచి అన్‌లోడ్ చేయించి సీజ్ చేస్తామన్నారు. పోర్టులో ఇంకా 12 వేల టన్నుల బియ్యం లోడింగ్ కోసం ఉన్నాయని చెప్పారు. స్టెల్లా ఎల్ నౌకను రిలీజ్ చేసే అంశంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. ఎస్‌పి విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ.. జూన్, జులై నుంచి బియ్యం అక్రమ రవాణాకు సంబంధించి 13 కేసులు నమోదు చేశామని తెలిపారు. ఇందుకు సంబంధించి మొత్తం 137 రైసు మిల్లులపై కేసులు నమోదు చేశామని, వీటిలో 89 మిల్లులు మన రాష్ట్రంలోనూ మిగిలినవి తెలంగాణ, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోనూ ఉన్నాయని చెప్పారు. ఇప్పటి వరకూ 75 మిల్లులను విజిట్ చేసి వాటి రిజిస్టర్లను పరిశీలించామని తెలిపారు.

కాగా బియ్యాన్ని నౌకలో లోడ్ చేయకుండా అడ్డుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందో లేదో చెప్పాలని హైకోర్టు కోరింది. ఏ అధికారం కింద నౌకలోకి బియ్యాన్ని లోడ్ చేయకుండా అధికారులు అడ్డుకున్నారో వివరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

53 బార్లకు రీ నోటిఫికేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో 53 బార్లకు లైసెన్స్‌ల కోసం మరోసారి ఇ-వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్‌శాఖ కమిషనర్ నిషాంత్ కుమార్ తెలిపారు. ఈ లైసెన్స్‌లకు కాలపరిమితి ఈ ఏడాది డిసెంబరు ఒకటి నుంచి 2025 ఆగస్టు 31 వరకూ మాత్రమే ఉంటుందని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. గత వేలంలో లైసెన్స్ ఫీజు, నాన్ రిఫండబుల్ రిజిస్ట్రేషన్ ఛార్జీలు, బిడ్ అమౌంట్‌ను చెల్లించడంలో కొందరు విఫలమయ్యారని, దీంతో ఆ బార్లను ఎవరికీ కేటాయించలేదన్నారు. ఇ-వేలం, లాటరీ విధానంలో ఆ బార్లను కేటాయించేందుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు చెప్పారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు ఈ నెల 16 నుంచి 22 వరకూ అవకాశం కల్పించామన్నారు. 50 వేల వరకూ జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.5 లక్షలు, 50 వేల నుంచి 5 లక్షల లోపు జనాభా ప్రాంతాల్లో రూ.7.50 లక్షలు, 5 లక్షలకుపైన జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.10 లక్షలు తిరిగి ఇవ్వబడని దరఖాస్తు రుసుము ఈ నెల 23వ తేదీలోగా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. 23న దరఖాస్తులను పరిశీలించి..24న ఇ-వేలం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇ-వేలంలో ఎక్కువ మొత్తంతో పాడుకున్న అభ్యర్థులకు బార్లను కేటాయిస్తామన్నారు. మరింత సమాచారం కోసం ఫోన్ : 8074396416 లేదా http://apcpe.aptonline.in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

ఏజెన్సీలో గెలిచి
గిరిజనులపై పెత్తనం చెలాయించడం దారుణం

- అధికార ప్రధాన ప్రతిపక్ష నాయకుల తీరుపై వి శ్రీనివాసరావు
- ముగిసిన సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా మహాసభ


మహాసభలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి- రంపచోడవరం, రాజమహేంద్రవరం విలేకరులు

అధికార, ప్రధాన ప్రతిపక్ష నాయకులు, ప్రజాప్రతినిధులు ఇక్కడి నుంచి గెలిచి, ఏజెన్సీ వనరులు దోచుకుంటున్నారని, అమాయకులపై పెత్తనం చెలాయిస్తున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ప్రశ్నించిన వారిపై దౌర్జన్యం చేస్తున్నారని, ఈ దుర్మార్గపు చర్య ఎంతమాత్రమూ తగదని తెలిపారు. రంపచోడవరంలో పూనెం సత్యనారాయణ నగర్, సీతారాం ఏచూరి ప్రాంగణంలో రెండు రోజులపాటు జరిగిన సిపిఎం ఎఎస్ఆర్.రంపచోడవరం జిల్లా ప్రథమ మహాసభ మంగళవారంతో ముగిసింది. ప్రతినిధుల సభలో వి.శ్రీనివాసరావు ముగింపు ఉపన్యాసం చేశారు. ఉద్యోగులను వేధించడం, వారిని ఉద్యోగం నుంచి తొలగించడం, ఎదిరించిన వారిని అరెస్టు చేయించడం, బెదిరింపులకు పాల్పడడం వంటి చర్యలు ప్రజాస్వామ్యంలో చెల్లవని, అటువంటి చర్యలకు పాల్పడే వారికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం నిర్లక్ష్యానికి గురైందని, నిర్వాసితుల సమస్యలను గాలికొదిలేశారని తెలిపారు. నిర్వాసితులకు పూర్తి స్థాయి పునరావాసం, పరిహార ప్రక్రియను జూన్ నాటికి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. గురుకులాల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులను రెగ్యులరైజేషన్ చేయాలని, పనికి తగిన వేతనం ఇవ్వాలని, జిఒ నెంబర్ 3ని పునరుద్ధరించాలని, అటవీ హక్కుల చట్టాన్ని, ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహాసభలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు ప్రారంభోపన్యాసం చేశారు. కార్పొరేట్లు నుంచి ఏజెన్సీని రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. అడవులను అంబానీ, అదానీ నుంచి రక్షించుకోవాల్సి ఉందని, అందుకు ఉద్యమ పోరాటాలు నిర్వహించాలని తెలిపారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ ఆదివాసీల ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీలో సరైన వైద్యం అందుబాటులో లేకపోవడంతో ఆదివాసీలు మృతి చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి బి.కిరణ్ తదితరులు ప్రసంగించారు. రెండు రోజులపాటు జరిగిన ఈ మహాసభలో పలు తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించారు.

జిల్లా కార్యదర్శిగా బి కిరణ్



సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కమిటీ 19 మందితో ఎన్నికైంది. జిల్లా కార్యదర్శిగా బొప్పెన కిరణ్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా లోతా రామారావు, మట్ల వాణిశ్రీ, మర్లపాటి నాగేశ్వరరావు, వల్లల వెంకట్, సున్నం రాజులును ఎన్నుకున్నారు.

వసతుల్లేక అవస్థలు పడుతున్నాం

- ఉపాధిలేక ఖాళీగా ఉంటున్నాం
- ముదిత్‌కుమార్ సింగ్ ఎదుట పోలవరం ప్రాజెక్టు పునరావాస కాలనీ వాసుల ఆవేదన


కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న ముదిత్ కుమార్ సింగ్

ప్రజాశక్తి - జీలుగుమిల్లి (ఏలూరు జిల్లా)

పోలవరం ప్రాజెక్టు పునరావాస కాలనీల్లో సరైన వసతుల్లేక అవస్థలు పడుతున్నామని ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం టేకూరు పునరావాస కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లు నిర్మించి ఇచ్చారని, వర్షాకాలం వస్తే స్లాబ్ నీరు కారుతోందని, డ్రెయినేజీ వ్యవస్థ లేదని వాపోయారు. జీలుగుమిల్లి మండలం టేకూరు పునరావాస కాలనీలో జాతీయ పునరావాస ప్యాకేజీ మానిటరింగ్ కమిటీ సలహాదారు ఎస్.ముదిత్‌కుమార్ మంగళవారం పోలవరం ప్రాజెక్టు అథారిటీ బృందంతో కలిసి పర్యటించారు. కాలనీలో ఇళ్లు, అంగన్‌వాడీ, హెల్త్ సెంటర్లు, ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. కాలనీలో వసతులు సక్రమంగా లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు పలకరించగా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కొన్ని కుటుంబాలకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ పూర్తిగా ఇవ్వలేదని, వివాదాలు ఉన్న భూములను కేటాయించడంతో స్థానికులతో తగాదా పడుతున్నామని వాపోయారు. ఉపాధిలేక ఖాళీగా ఉంటున్నామని తెలిపారు. దీనిపై ముదిత్‌కుమార్‌సింగ్ స్పందిస్తూ పునరావాస కాలనీల్లోని సమస్యలను పరిష్కరించి, మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వసతుల కల్పనపై కేంద్రానికి నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలవరం ప్రాజెక్టు అథారిటీ చీఫ్ ఇంజనీర్ రాజేష్‌కుమార్, డిప్యూటీ డైరెక్టర్ ఎం.రవి, డిప్యూటీ కలెక్టర్ వెంకట రమణనాయక్, ఆర్‌డిఒ ఎంవి.రమణ, తహశీల్దార్ స్లీవ్‌జోజి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కస్టడీకి వర్రా !

- 19, 20వ తేదీల్లో విచారణకు అనుమతి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

వైసిపి సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీందర్‌రెడ్డిని కడప నాలుగవ జిల్లా అదనపు న్యాయస్థానం పోలీస్ కస్టడీకి అనుమతించింది. పోలీసుల కస్టడీ పిటీషన్‌పై కోర్టు విచారించింది. ఈ నెల 19, 20 తేదీల్లో పోలీసుల విచారణకు ఆదేశాలు జారీ చేసింది. వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు న్యాయవాదుల సమక్షంలో విచారణ తీరుతెన్నుల్ని వీడియో చిత్రీకరణ చేయాలని కోర్టు ఆదేశించింది. ప్రస్తుతం విశాఖ జైలు వర్రా ఉన్నారు. ఈ మేరకు జైలు అధికారులకు కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

ఆక్వా రైతులందరికీ విద్యుత్ రాయితీ

- పశుసంవర్ధక శాఖలో ఖాళీల భర్తీకి చర్యలు
- మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆక్వా జోన్‌లతో సంబంధం లేకుండా ఆక్వా రైతులందరికీ విద్యుత్ రాయితీ అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. మత్స్యశాఖ, పశు సంవర్ధకశాఖల ఉన్నతాధికారులతో సచివాలయంలో మంత్రి మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. చేప పిల్లల పంపిణీకి తక్షణమే చర్యలు చేపట్టాలని, జనవరి నెలాఖరులోపు రాష్ట్ర వ్యాప్తంగా ఆయా జిల్లాల్లో చేప పిల్లల పంపిణీ పూర్తి చేసేందుకు చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. జిల్లాల్లోని జాయింట్ కలెక్టర్ల ఆధ్వర్యాన ఈ ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. మత్స్యకారులకు ఇంధన రాయితీలో ఇబ్బందులు తలెత్తడంతో తక్షణమే రూ.6.67 కోట్ల నిధులు మంజూరు చేశామన్నారు. ఇక నుంచి ప్రతియేటా మత్స్యకారుల బోట్లకు ఇంధన రాయితీకి అవసరమైన నిధులు ముందుగానే మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మత్స్యకారులకు మరింత మేలు చేకూర్చేలా ఇంధనం ధర లీటరుకు సుమారు రూ.10 ఆదా చేసేందుకు మెరైన్ ఇంధనం అందుబాటులోకి తెస్తున్నామన్నారు. ప్రభుత్వ పరిధిలోని 54 ఫిష్ సీడ్ పాండ్స్ అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. శ్రీకాకుళం, పశ్చిమ గోదావరి జిల్లాల్లో నిలిచిపోయిన మత్స్యసహకార సంఘాల ఎన్నికలు వెంటనే నిర్వహించాలన్నారు.

తీర ప్రాంతాల్లో మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు కేరళ తరహాలో కేరళ ప్రభుత్వ సహకారంతో కృత్రిమ రీఫ్‌లను ఏర్పాటు చేసి తీర ప్రాంతాల్లో మత్స్యసంపద వృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. పశు సంవర్ధకశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా పశువుల ఆస్పత్రుల భవన నిర్మాణాలు, మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. రాష్ట్రంలో ఎంబ్రియో ట్రాన్స్‌ఫర్ టెక్నాలజీ అభివృద్ధి చేసి మేలైన జాతులు, వ్యాధి నిరోధక శక్తి కలిగిన జాతులను వృద్ధి చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. జనవరిలో రాష్ట్రంలో ఉన్న పశువులు, గొర్రెలు, మేకలన్నింటికీ టీకాలు, డీ వార్మింగ్ మందులు అందించాలని, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకంలో అనుసంధానమైన గోకులం పశువుల షెడ్ల నిర్మాణాలు, గడ్డి జాడు పెంపకం మరింత ఎక్కువ మంది లబ్ధిదారులకు అందించేందుకు నివేదిక సిద్ధం చేయాలన్నారు. పశు పోషకులు, కోళ్ల పెంపకందారులకు రెండు లక్షల వరకు హామీలేని రుణం అందించి 3 శాతం వడ్డీ రాయితీ కల్పిస్తున్నామన్నారు. ఈ సమీక్షా సమావేశంలో పశు సంవర్ధకశాఖ ముఖ్యకార్యదర్శి ఎమ్ఎమ్ దామోదరనాయుడు, మత్స్యశాఖ కమిషనరు డోలా శంకర్ పాల్గొన్నారు.

ముగ్గురు అంతర్రాష్ట్ర స్మగ్లర్ల అరెస్టు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ఎర్రచందనం దుంగల అక్రమ రవాణాకు సంబంధించి కీలక వ్యవహరిస్తున్న ముగ్గురు అంతర్రాష్ట్ర స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు గుజరాత్‌లో అరెస్టు చేశారు. వీరు నిల్వ చేసిన దాదాపు రూ.3.5 కోట్ల విలువైన ఎర్రచందనం దుంగలను, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ తాత్కాలిక ఇన్‌ఛార్జి సుబ్బరాయుడు తెలిపారు. తిరుపతి నగర పరిధిలోని కపిల తీర్థం వద్ద గల టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్‌పి శ్రీనివాస్ (టాస్క్‌ఫోర్స్)తో కలిసి ఆయన మాట్లాడారు. అన్నమయ్య జిల్లాలో ఇటీవల పట్టుబడిన స్మగ్లర్లు రాంప్రసాద్, రవిశంకర్‌ను విచారించగా..గుజరాత్ స్మగ్లర్ల వివరాలు తెలిశాయని ఆయన చెప్పారు.

ప్రత్యేక బృందాలు గుజరాత్‌లోని పఠాన్ జిల్లాకు వెళ్లి నిల్వ చేసిన ఎర్ర చందనం దుంగలను, ఒక కారును స్వాధీనం చేసుకున్నామని, ఇదే కేసులో గుజరాత్ దీసా పట్టణానికి చెందిన ఉత్తమ్‌కుమార్ నందకిషోర్ సోని, అతని స్నేహితులు జోషి హాన్స్ రాజ్ విర్జాయ్, పఠాన్ పట్టణానికి చెందిన పరేష్ జీ కాంతీజీ ఠాకూర్‌లను అరెస్టు చేసినట్లు సుబ్బరాయుడు తెలిపారు. నిందితులను స్థానిక కోర్టులో ప్రవేశపెట్టి ట్రాన్సిట్ వారెంట్‌పై తిరుపతికి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ ఆపరేషన్ విజయవంతంగా చేపట్టిన సిబ్బందికి నగదు రివార్డులను అందించారు.


వినతులు స్వీకరిస్తున్న రాజీవ్ రంజన్ మిశ్రా

ఎస్‌సి వర్గీకరణపై ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి-విజయనగరం

షెడ్యూల్ కులాల వర్గీకరణపై ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా మంగళవారం విజయనగరం కలెక్టరేట్ ఆడిటోరియంలో వినతులు స్వీకరించారు. ఎస్‌సిల్లోని ఉపకులాలకు చెందిన 101 సంఘాల నుండి వినతులు అందాయి. ప్రధానంగా కొన్ని ఉపకులాలు వర్గీకరణ వద్దని, మరికొన్ని ఉపకులాలు వర్గీకరణ అవసరం అని వినతులు సమర్పించాయి. ఉపకులాల గణన జరపాలని, ఏ కులం వారు ఎంత మంది ఉన్నారు, వారి సామాజిక పరిస్థితులను అధ్యయనం చేయాలని, ఆ తర్వాతే వర్గీకరణ జరపాలని కోరారు. ఎస్‌సి కుల ధ్రువీకరణ పత్రాలను ఏటా పొందడం కష్టంగా ఉందని, ఐదేళ్లకు ఒకసారి తీసుకోడానికి అవకాశం కల్పించాలని కోరారు.

ఉపకులాల స్థితిగతులపై కమిషన్ ఆరా

షెడ్యూల్డ్ కులాల వర్గీకరణపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రా వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. షెడ్యూల్డ్ కులాల వారీగా వారి సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా స్థితిగతులపై ఆరా తీశారు. ఎస్‌సిల్లో ఉన్న 59 ఉప కులాల స్థితిగతులను అధ్యయనం చేయనున్నట్లు కమిషన్ తెలిపారు. సమావేశంలో డిఆర్ఒ ఎస్ శ్రీనివాసమూర్తి, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి సుధారాణి, సోషల్ వెల్ఫేర్ డిడి బి రామానందం, మన్యం జిల్లా డిడి గయారుద్దీన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణ కమిషన్‌పై కేసులో
మాదిగ సంఘం ఇంప్లీడ్

ప్రజాశక్తి-అమరావతి

ఎస్‌సి వర్గీకరణ చేసేందుకు రాష్ట్రాలకు అధికారం ఉందంటూ సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఎస్‌సిలలో ఉప కులాల వెనుకబాటుతనాన్ని గుర్తింపునకు ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్‌ను సవాలు చేసిన కేసులో మాదిగ సంఘాన్ని ప్రతివాదిగా చేర్చేందుకు హైకోర్టు అనుమతినిచ్చింది. రిటైర్డు అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా ఆధ్వర్యంలో ఏకసభ్య కమిషన్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ నియామకాన్ని మాల మహాసభ వ్యవస్థాపక అధ్యక్షులు మల్లెల వెంకటరావు సవాల్ చేసిన కేసులో మాదిగ సంఘంతో పాటు పలువురు దాఖలు చేసిన ఇంప్లీడ్ పిటిషన్లను జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు అనుమతినిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కౌంటర్లు దాఖలు చేయాలని వారిని ఆదేశించారు. విచారణను రెండు వారాలకు వాయిదా వేశారు. పిటిషన్‌ను అత్యవసరంగా విచారణ చేయాలని సీనియర్ అడ్వకేట్ ఎ సత్యప్రసాద్ కోరారు. ఇంప్లీడ్ పిటిషనర్ల తరపున న్యాయవాదులు డొక్కా దివ్య, మట్టా జయకర్ ఇతరులు కల్పించుకుని ఇంప్లీడ్ పిటిషన్లను అనుమతించాలని కోరారు.

ఎపిజిబిని కడపలోనే కొనసాగించాలి

- మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

ప్రజాశక్తి-కడప అర్బన్

రైతులకు, మధ్య తరగతికి, వ్యాపార వర్గాలకు ఎంతో ఉపయుక్తంగా ఉన్న ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు (ఎపిజిబి) ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎం గేయానంద్ కోరారు. స్థానిక యుటిఎఫ్ భవనలో సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ కన్వీనర్ రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గేయానంద్ మాట్లాడుతూ ఎపిజిబి ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కరవు పీడిత, వెనుకబడిన ప్రాంతమైన కడపలో బ్యాంకు ఉనికి ప్రాంతీయ అభివృద్ధికి కీలకంగా మారిందన్నారు. దేశంలో ఉన్న 43 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులలో అగ్ర స్థానంలో ఎపిజిబి ఉందని, 552 శాఖలతో రూ.50 వేల కోట్ల టర్నోవర్‌తో రూ.802 కోట్ల లాభాలతో రూ.4591 కోట్ల రిజర్వ్‌తో వ్యాపారాభివృద్ధిలో మిగతా గ్రామీణ బ్యాంకులకన్నా అగ్రభాగాన ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న నాలుగు గ్రామీణ బ్యాంకులను విలీనం చేస్తోందని, ఈ నాలుగు గ్రామీణ బ్యాంకులలో కడపకు సంబంధించిన ఎపిజిబి అన్ని రంగాలలో వ్యాపార పరంగా అగ్రస్థానంలో ఉందని తెలిపారు. ఇప్పటికే రాయలసీమ ప్రాంతంలో ఉన్న హైకోర్టు, లా యూనివర్సిటీ, ఎంఎస్ఎంఇ కేంద్రం, గతంలో అనంతపురానికి రావాల్సిన ఎయిమ్స్‌ను, తదితర వాటిని ఇతర ప్రాంతాలకు తరలించి రాయలసీమ ప్రాంతాలకు అన్యాయం చేశారని, ఈ ఒరవడిని ఇలా కొనసాగించవద్దని డిమాండ్ చేశారు.

రాయలసీమ అభివృద్ధి వేదిక కన్వీనర్ డాక్టర్ సి ఓబుల్‌రెడ్డి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యులు జానమద్ది విజయ భాస్కర్, ఎపిజిబి పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డి, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్ బాబు మాట్లాడుతూ వ్యాపారం, టెక్నాలజీ, ఆర్‌బిఐ అనుమతించిన ప్రత్యేకమైన కరెన్సీ చెస్ట్ సౌకర్యం, సొంతభవనాలు ఎపిజిబికే మాత్రమే ఉన్నాయని తెలిపారు. దీనిని కడపలోనే కొనసాగించడం సముచితమన్నారు. సదస్సులో రాజశేఖర్ రాహుల్ (జెవివి), అవధానం శ్రీనివాస్ (ఇన్సూరెన్స్), సుబ్బారెడ్డి (పోస్టల్), సుధాకర్ (టెలికం), శివశంకర్ (విద్యుత్), రామకృష్ణారెడ్డి (పెన్షనర్స్), ఎపిజిబి యూనియన్ నాయకులు హనుమంతరెడ్డి, మహమ్మద్, శ్రీనివాసరెడ్డి, సురేష్ పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న గేయానంద్


పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న అంబటి

పోలీసులది పక్షపాత ధోరణి : అంబటి


ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో పోలీసులు పక్షపాత ధోరణితో పనిచేస్తున్నారని మాజీ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. తాము ఇచ్చిన ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం ఆయన తన అనుచరులతో కలిసి గుంటూరు పట్టాభిపురం పోలీసు స్టేషన్ ఎదురుగా బైఠాయించి నిరసన తెలిపారు. తనపైనా, మాజీ సిఎం జగన్‌పైనా సోషల్ మీడియాలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అనుచితంగా పోస్టింగ్‌లు పెడితే చర్యలు తీసుకోవడంలేదన్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా ఇంతవరకు కేసులు కూడా నమోదు చేయలేదని చెప్పారు. వైసిపి వారిపై టిడిపి నేతలు ఎక్కడి నుంచో ఫిర్యాదులు చేస్తే తమ పార్టీ నేతలను అక్రమంగా అరెస్టులు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలతో అక్రమ అరెస్టులు చేస్తున్న పోలీసులు వైసిపి నేతల ఫిర్యాదులను పట్టించుకోవడం లేదన్నారు. తమపై సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెట్టిన వారిపై చర్యలు తీసుకునేంత వరకూ పోరాటం ఆగదని తెలిపారు. అంబటి వద్దకు పోలీసులు వచ్చి ఈ నెల 21లోగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో ఆయన ఆందోళన విరమించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వనమా బాల వజ్రబాబు (డైమండ్ బాబు), గుంటూరు తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా, గుంటూరు మిర్చి యార్డ్ మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజు నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కిస్తీ కట్టలేదని దళిత మహిళ ఇంటికి తాళం

- ఇంట్లోని కుటుంబసభ్యుల గెంటివేత
- ఫైనాన్స్ సిబ్బంది దౌర్జన్యం
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాధితురాలు

ప్రజాశక్తి-పంగులూరు (బాపట్ల జిల్లా)


ఇంటికి ఫైనాన్స్ సిబ్బంది వేసిన తాళం

ఓ ప్రయివేట్ ఫైనాన్స్ ప్రతినిధులు దౌర్జన్యానికి పాల్పడ్డారు. కిస్తీ కట్టలేదని దళిత మహిళను ఇంటి నుంచి బయటకు గెంటివేశారు. ఇంటికి తాళం వేసి సీల్ వేశారు. కాల్‌మనీ వ్యాపారుల మాదిరి దౌర్జన్యం చేశారు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు... బాపట్ల జిల్లా పంగులూరు మండలంలోని బైటమంజులూరు గ్రామ దళితవాడకు చెందిన దంపతులు ఆలూరి సామ్యేలు (లేట్), ఆయన భార్య సుజాత తమ ఇంటిని తాకట్టు పెట్టి.. అద్దంకిలోని ఐఐఎఫ్ఎల్ ప్రయివేట్ ఫైనాన్స్ సంస్థ నుంచి 2023 అక్టోబర్‌లో రూ.5.50 లక్షలు రుణం తీసుకున్నారు. ఇందుకుగానూ నెలకు 13,165 రూపాయలు చొప్పున 84 నెలల (7 సంవత్సరాలు) వాయిదాలు చెల్లించాల్సి ఉంది. ఇటీవల పది నెలల కిస్తీలు క్రమం తప్పకుండా చెల్లిస్తూ వచ్చారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఐదు నెలల కిస్తీ చెల్లించలేకపోయారు. వారం రోజుల క్రితం రెండు నెలల కిస్తీ చెల్లించారు. అయితే ఫైనాన్స్ సంస్థకు చెందిన ఆరుగురు సిబ్బంది మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో వచ్చి కిస్తీ డబ్బులు మొత్తం చెల్లించాలని పట్టుబట్టారు. ఇంటిలోని సుజాతతో పాటు మనవళ్లను బలవంతంగా బయటకు గెంటేసి సీల్ వేశారు. దీంతో, ఐఐఎఫ్ఎల్ సంస్థ సిబ్బందిపై పంగులూరు పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేశారు.

70 ఇళ్లు తాకట్టులో..

కాలనీలో మొత్తం 100 ఇళ్లు ఉండగా అందులో 70 కుటుంబాల వారు ఐఐఎఫ్ఎల్ ప్రయివేట్ ఫైనాన్స్ దగ్గర రుణాలు తీసుకున్నారు. ఒక్కొక్క ఇంటి వారు రూ.ఐదు నుంచి రూ.ఆరు లక్షల వరకు రుణం తీసుకున్నట్లు సమాచారం.

సంపాదకీయం

సంగీత భానుడి అస్తమయం

తన మహోన్నత ప్రతిభా పాటవాలతో దేశ విదేశాల్లో కోట్లాది మంది మనసుల్ని గెలుచుకున్న సంగీత భానుడు అస్తమించాడు. భారత శాస్త్రీయ వాయిద్య కళను ప్రపంచానికి చేరువ చేసిన మ్యూజిక్ మాస్ట్రో, తబలా వాయిద్య మాంత్రికుడు ఉస్తాద్ జాకీర్ హుస్సేన్ నిష్క్రమణతో తబలా మూగబోయింది. తోడు వాయిద్యంగా ఉన్న తబలాకు ప్రత్యేక గుర్తింపుతెచ్చిన అద్వితీయ ప్రతిభావంతుడు ఇక లేరన్న వార్త ప్రపంచవ్యాప్తంగా ఉన్న సంగీత ప్రియులను శోకసంద్రంలో ముంచింది.

ఆల్‌టైం గ్రేట్ తబలా విద్వాంసుడిగా పేరొందిన ఉస్తాద్ అల్లారఖా ఖాన్ కుమారుడైన జాకిర్ హుస్సేన్ అల్లారఖా ఖురేషికి పసిబిడ్డగా ఉన్నప్పుడే తబలాతో ఏర్పడిన అనుబంధం, అంతకుమించిన అకుంఠిత దీక్ష, అద్వితీయ ప్రతిభ... ఆయనను సంగీత ప్రపంచంలో శిఖరాగ్రాన నిలిపాయి. శాస్త్రీయ వాయిద్య కళాకారులకిచ్చే బిరుదైన 'ఉస్తాద్' అని కాకుండా... జాకీర్ బాయ్ అని పిలవాలని కోరుకోవడం ఆయన వినమ్రతకు, విశ్వమానవ సౌభ్రాతృత్వానికి నిదర్శనం.

ఆసుపత్రి నుంచి ఇంటికి తీసుకొచ్చినప్పుడు ముస్లిం సంప్రదాయం ప్రకారం తండ్రి కొడుకు చెవిలో 'కల్మా' చదివి, పేరు పలికి లోపలికి తీసుకెళ్లాలి. ఉస్తాద్ అల్లా రఖా తన కొడుకు చెవిలో తబలా జతులు వినిపించాడట. ఇదేమిటని భార్య ప్రశ్నిస్తే... 'నా ప్రార్థనలు ఇవే.. నేను ప్రార్థన చేసే విధానం ఇదే' అన్నాడట. తనకు గురువుల నుంచి సంక్రమించిన జ్ఞానాన్ని కొడుకుకు పంచాలన్న ఆయన తపన... తండ్రికి మాట రాకూడదన్న పట్టుదల జాకీర్‌ను జగద్విఖ్యాతం చేశాయి. మూడేళ్లకే తబలాను మీటిన ఆ పసివేళ్లు... ఏడేళ్లకే అకుంఠిత దీక్షతో సాధన చేశాయి. 12 ఏళ్లకే ప్రదర్శనలిచ్చాయి. అన్ని మతాలు, అన్ని ధోరణుల విద్వాంసులతో అతి సులువుగా కలిసిపోయి తన తబలాను వారి సంగీతానికి జత చేయగలగడం జాకీర్ ప్రతిభకు, సర్వమత సారం ఒక్కటేనన్న ఆధ్యాత్మిక భావనకు తార్కాణం. 'నేను స్కూల్‌కు వెళ్లే దారిలో చర్చిలో సంగీతం వినేవాణ్ణి. గుడిలో వినిపించే భక్తి గీతాలు ఆలపించేవాణ్ణి. ప్రపంచంలో ఏ మతమూ ఇంకో మతంపైన జబర్దస్తీ చేయదు. ఏ మతమైనా చెప్పేది నీ పొరుగు వారిని ప్రేమించమనే' అన్న ఆయన మాటలు... మతం పేరుతో విద్వేష విషం చిమ్మే తిరోగమన వాదులకు చెంపపెట్టు. 1989లో ఢిల్లీలో ప్రముఖ నాటక రచయిత సఫ్దర్ హష్మీని కాంగ్రెస్ గూండాలు హత్య చేసినప్పుడు ఆయన సృజనాత్మకంగా నిరసన తెలిపారు. కుల, మతాలకు అతీతంగా అందరినీ ప్రేమించారు. తన స్నేహితుడైన ప్రముఖ సంతూర్ విద్వాంసుడు శివకుమార్ 2022లో మరణించినప్పుడు భౌతికకాయాన్ని భుజాలపై మోసి ప్రేమను చాటుకున్నారు. అందరూ వెళ్లిపోయినా... చితిపక్కన విచారంగా నిలబడి కన్నీళ్లు పెట్టుకున్న ఫొటోలు వైరల్‌గా మారాయి. 'ఇదీ నిజమైన ఇండియా... స్నేహానికి కుల, మత భేదాలు లేవు' అన్న నెటిజన్ల వ్యాఖ్యలు అక్షర సత్యం కదా! అందుకేనేమో... క్రిస్టియన్ అయిన కథక్ నృత్యకారిణి ఆంటోనియా మిన్నెకోలాను వివాహం చేసుకున్నారు.

తండ్రి అల్లారఖాకు అనారోగ్యం కారణంగా 19 ఏళ్ల వయసులో తొలిసారి అమెరికా వెళ్లి పండిట్ రవిశంకర్‌కు సహవాయిద్యం అందించే అవకాశం దక్కింది. ఆయనతోపాటు అలీ అక్బర్ ఖాన్, బీమ్‌సేన్ జోషి, మంగళంపల్లి బాలమురళీకృష్ణ, శివకుమార్ శర్మ వంటి భారతీయ సంగీత ప్రముఖులతోనే కాక అంతర్జాతీయ దిగ్గజాలందరితోనూ చేసిన జుగల్ బందీలు అజరామరంగా నిలిచాయి. పలు సినిమాలకు సౌండ్ ట్రాక్స్ అందించడం, నటించడమే కాకుండా... మిస్టర్ అండ్ మిసెస్ అయ్యర్ వంటి చిత్రాలకు సంగీత దర్శకత్వం వహించారు. 'వాహ్ తాజ్' వంటి ప్రకటనలతో దేశంలో ప్రతి ఇంటికీ చేరువయ్యారు. పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్, సంగీత నాటక అకాడమీ, గ్రామీ వంటి లెక్కలేనన్ని పురస్కారాలను అందుకున్నారు. హిందూ, ముస్లిం శాస్త్రీయ సంగీత భాగస్వామ్యాన్ని స్థిరంగా ప్రచారం చేయడంతోపాటు కొనసాగాలని కోరుకున్న కళా స్రష్ట. గాత్ర సంగీతమైనా, వాయిద్య సంగీతమైనా, జుగల్ బందీ అయినా, వ్యక్తిగత ప్రదర్శన ఇచ్చినా, ఫ్యూజన్ అయినా... తనదైన శైలిలో రక్తికట్టించే ఆయన తబలా వాయిద్యం... గాలిలో ఊగే గుబురు జుత్తు... జనం కళ్లలో ఎప్పుడూ కదలాడుతూనే ఉంటాయి. వచ్చే ఏడాది ముంబైలో వరుసగా సంగీత కచేరిలిచ్చేందుకు సిద్ధమైన ఆ బహుముఖ ప్రజ్ఞాశాలి ఇంతలోనే అస్తమించడం సంగీత ప్రపంచానికి తీరని లోటు. సంగీతానికి భాష అంటూ ఉంటే అది ప్రేమ, ఐక్యత అని చాటిచెప్పిన జాకీర్ భాయ్ ఎన్నటికీ సంగీత ప్రపంచంలో మకుటాయమానంగా వెలుగొందుతూనే ఉంటారు. కొత్త వెలుగులను అన్వేషించే భావి తరాలకు స్ఫూర్తి ప్రదాతగా నిలుస్తారు.

మహనీయుల మాట




ఈ దేశం, సమాజం మగవాళ్ల గుత్త సొత్తుగా భావిస్తున్నారు. అది తప్పు. మగవాళ్లు ఇప్పటి దాకా స్త్రీలకు చెందాల్సినదంతా హరించి వేస్తూనే వచ్చారు.

- ముజఫర్ అహ్మద్,
తొలి తరం కమ్యూనిస్టు

విశ్లేషణ

ప్రజల బియ్యం పక్కదారి

సన్న బియ్యం ఇస్తామని ఒకరు, నాణ్యమైన బియ్యం ఇస్తామని మరొకరు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత తడిసిన ధాన్యం, ముక్కిన బియ్యం, నాసిరకం, నూకల బియ్యం ఇస్తూ బియ్యం అమ్ముకుంటున్నారని ఆ పేదలపై పడి ఏడవడం ఎందుకు? స్టోర్ బియ్యం సక్రమంగా వుంటే అవి అమ్ముకుని ఎక్కువ ధర పెట్టి మార్కెట్‌లో కొనరు కదా. రేషన్ కార్డులకు ఇస్తున్న బియ్యానికి కిలో రూ.43.50 ఖర్చు అవుతుందని ప్రభుత్వం చెబుతున్నది. ఇంత ఖర్చు చేసినా పేదలకు మంచి బియ్యం ఎందుకు ఇవ్వలేకపోతున్నారు? ధాన్యం సేకరణ నుండే పాలకులు, ఉన్నతాధికారులు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారు. రీసైక్లింగ్‌కు పాల్పడుతున్నారు. నివాస ప్రాంతాల్లో స్టోర్ల ద్వారా పంపిణీ కావాల్సిన బియ్యాన్ని నేరుగా ఇతర రాష్ట్రాలకు తరలించి కార్లు, భవనాలను నాయకులు సంపాదించుకుంటున్నారు.





వి. రాంభూపాల్

రాష్ట్రంలో పేదలకు అందాల్సిన సబ్సిడీ బియ్యం టన్నుల కొద్దీ అక్రమంగా విదేశాలకు తరలిస్తున్నారు. ఇందుకు ప్రతిపక్ష వైసిపి కారణమని టిడిపి కూటమి ఆరోపిస్తుంటే, మీరే కారణమని వైసిపి నేతలు టిడిపి, జనసేన నేతలను విమర్శిస్తున్నారు. ఈ పరస్పర విమర్శలు ఆంబోతుల కొట్లాటలో లేగదూడ నలిగిపోయిందన్నట్లు లక్షల టన్నుల బియ్యాన్ని కొన్నేళ్ళుగా యథేచ్ఛగా తరలిస్తున్నా అసలు దోషులు బయట పడకుండా పేదల కడుపులు కాల్చడం కొనసాగేటట్లు ఉంది. ప్రజా పంపిణీ ద్వారా పేదలకు అందుతున్న బియ్యం వారు తినకుండా అమ్ముకుంటున్నారని, ఈ బియ్యం ఆటో, లారీల స్థాయి దాటి ఓడల వరకు చేరిందని అందువల్ల బియ్యం అమ్ముకున్న పేదలే అసలు నేరస్థులని టి.వి చర్చల్లో, పత్రికల్లో సిద్ధాంతీకరిస్తున్నారు. బియ్యం పథకం పంపిణీ కార్యక్రమం కేంద్రానిదని, ప్రతి స్టోర్ దగ్గర మోడీ ఫోటో పెట్టాలని తెలంగాణ, ఆంధ్రలో పెద్ద యాగీ చేసిన కేంద్ర మంత్రులు, బిజెపి పెద్దలు అక్రమ బియ్యం తరలింపు విషయంలో ఎందుకు మౌనంగా ఉన్నారు? అన్ని రకాల సబ్సిడీ పథకాలను రద్దు చేసి నగదు బదిలీ అమలు చేయాలని కేంద్రం చాలా కాలంగా ప్రయత్నిస్తున్నది. ఇప్పటికే కొన్ని పథకాలను అటకెక్కించింది. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కోట్ల మంది ప్రజల ఆహారం, వారి ఓట్లు ముడిపడి వున్నందున ఏకపక్షంగా రద్దు చేయడం సాధ్యం కావడంలేదు. కానీ ఈ పదేళ్లలో ఈ పథకానికి నిధులు తగ్గించి చేయాల్సినంత బలహీన చేసింది. ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటీకరించేటప్పుడు దానిపైన ఎలా దుష్ప్రచారం చేశారో ఈ పథకం మీద అలాంటి ప్రచారాలు అప్పుడప్పుడు జరుగుతున్నాయి. ఇప్పుడు ఆంధ్రలో రేషన్ బియ్యంపై జరుగుతున్న చర్చ తమ పనిని మరింత సులభం చేస్తుందని ఆనందపడుతున్నారేమో! పేదలు రేషన్ బియ్యం ఎందుకు అమ్ముకుంటారు? అమ్మితే ఓడలకు ఎక్కించగలిగినంత బియ్యం అమ్మగలిగే శక్తి వారికి వుంటుందా? ఈ రగడ వెనుక రాజకీయ ప్రయోజనాలతో పాటు, సబ్సిడీ బియ్యం ఎత్తివేసే ఎత్తుగడ వుందా అని అనుమానాలు కలుగుతున్నాయి.

ప్రజా పంపిణీ వ్యవస్థలో తిమింగలాలు

గత ఐదేళ్ళలో 1.31 కోట్ల టన్నుల రేషన్ బియ్యం దేశం దాటి విదేశాలకు వెళ్లిందని టిడిపి కూటమి ప్రభుత్వం విమర్శిస్తున్నది. కాకినాడ ఓడరేవులో సిద్ధంగా వున్న ఓడను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తనిఖీ చేసి సీజ్ చేయమని ఆదేశించారు. విశాఖపట్నం ఓడరేవులో రాష్ట్ర సివిల్ సప్లయ్ శాఖ మంత్రి ఇలాగే ఓ ఓడను తనిఖీ చేసి అందులో వున్న బియ్యం పేదల బియ్యమేనని ప్రకటించారు. ఒకవైపు తిండి లేక పేదలు అల్లాడుతుంటే ఇంత పెద్ద ఎత్తున అక్రమంగా తరలిస్తున్న బియ్యం దొంగలను పట్టుకోవాలి, కఠినంగా శిక్షించాలి. కానీ ఈ పేరుతో రాష్ట్రంలోని 1,48,43,671 రేషన్ కార్డుల ద్వారా రేషన్ పొందుతున్న 4,31,81370 మంది లబ్ధిదారులకు నష్టం చేసేవిధంగా వ్యవహరించరాదు. అధికార పార్టీలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం అనర్హులకు రేషన్ కార్డులు ఇవ్వడంవల్ల, అందులో కొద్దిమంది బియ్యం అమ్ముకునే వారు వుండే అవకాశం ఉంది. కానీ అత్యధిక పేదలు రేషన్ బియ్యంతోనే నెలలో కొద్ది రోజులైనా కడుపు నింపుకుంటున్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నెలకు ఒక మనిషికి ఐదు కిలోల బియ్యం ఇస్తే, అది కొద్ది రోజులకు మాత్రమే సరిపోతుంది. మిగిలిన రోజులకు బయటి మార్కెట్‌లో ఎక్కువ ధర పెట్టి కొని బతుకుతున్నారు. సన్న బియ్యం ఇస్తామని ఒకరు, నాణ్యమైన బియ్యం ఇస్తామని మరొకరు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత తడిసిన ధాన్యం, ముక్కిన బియ్యం, నాసిరకం, నూకల బియ్యం ఇస్తూ బియ్యం అమ్ముకుంటున్నారని ఆ పేదలపై పడి ఏడవడం ఎందుకు? స్టోర్ బియ్యం సక్రమంగా వుంటే అవి అమ్ముకుని ఎక్కువ ధర పెట్టి మార్కెట్‌లో కొనరు కదా. రేషన్ కార్డులకు ఇస్తున్న బియ్యానికి కిలో రూ.43.50 ఖర్చు అవుతుందని ప్రభుత్వం చెబుతున్నది. ఇంత ఖర్చు చేసినా పేదలకు మంచి బియ్యం ఎందుకు ఇవ్వలేకపోతున్నారు? ధాన్యం సేకరణ నుండే పాలకులు, ఉన్నతాధికారులు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారు. రీసైక్లింగ్‌కు పాల్పడుతున్నారు. నివాస ప్రాంతాల్లో స్టోర్ల ద్వారా పంపిణీ కావాల్సిన బియ్యాన్ని నేరుగా ఇతర రాష్ట్రాలకు తరలించి కార్లు, భవనాలను నాయకులు సంపాదించుకుంటున్నారు.

1980వ దశకం నుండి ఇప్పటి వరకు ఆంధ్రా రాజకీయాలు ప్రజా పంపిణీ వ్యవస్థతో బలంగా ముడిపడ్డాయి. ఎన్.టి.రామారావు అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రారంభించిన రేషన్ బియ్యం అప్పట్లో సంచలనం సృష్టించింది. ఈ పథకాన్ని రద్దు చేయాలని ప్రయత్నించిన కాంగ్రెసు తర్వాతి కాలంలో రూపాయికే కిలో బియ్యం హామీ ఇవ్వాల్సి వచ్చింది. ప్రపంచ బ్యాంకు విధానాలకు ప్రయోగశాలగా మార్చిన చంద్రబాబు ఈ బియ్యం పథకాన్ని కుదించడానికి చేసిన ప్రయత్నాలు వికటించాయి. వైసిపి పాలనలో ఇంటి వద్దకే బియ్యం అందించాల్సి వచ్చింది. ఇంత చేసినా రాష్ట్రంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 54 శాతం మందికి మాత్రమే రేషన్ బియ్యం అందుతుంది. 2020 జనాభా ఆధారంగా చూస్తే 50 శాతం మందికి మాత్రమే అందుతుంది. బియ్యంతో పాటు, చక్కెర, కందిపప్పు, ఆయిల్, కిరోసిన్ లాంటి సరుకులు ఇవ్వాల్సి వుండగా బియ్యం మాత్రమే పంపిణీ అవుతుంది. పెరుగుతున్న ధరలు, తగ్గుతున్న ఉపాధితో జనం అల్లాడిపోతుంటే ఎక్కువ మంది పిల్లలను కనమని ఆర్‌ఎస్‌ఎస్ నేతతో పాటు, రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా చెబుతున్నారు.

ప్రజా పంపిణీ వ్యవస్థ లక్ష్యం

స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటీష్ ప్రభుత్వం తమ వ్యాపార, కంపెనీల ప్రయోజనాల కోసం ఆహార పంటల సాగును తగ్గించి, వాణిజ్య పంటలను బలవంతాన అమలు చేయించారు. చరిత్రలో ఎన్నడూ ఎరగని ఆకలి, కరువులతో కోట్ల మంది భారతీయులు చనిపోయారు. స్వాతంత్ర్యానంతరం కేంద్ర ప్రభుత్వం ఆహార పంటల అభివృద్ధికి కొన్ని చర్యలు చేపట్టినా, ప్రజల ఆకలి బాధలను తీర్చలేకపోయాయి. మూలిగే నక్కపై తాటికాయ పడినట్లు 1960వ దశకంలో చైనా, పాకిస్తాన్‌లతో వచ్చిన యుద్ధాలు ఆహారధాన్యాల సమస్యను మరింత తీవ్రం చేశాయి. తిండిగింజల కొరత పెరిగింది. ఈ సమస్య పరిష్కారం కోసం ప్రజా పంపిణీ వ్యవస్థ ఆవిర్భవించింది. 1964లో ఆహారధాన్యాల కమిటీని ఏర్పాటు చేసి ఒకవైపు ఆహారధాన్యాల ధరల పెరుగుదలను, అక్రమ నిల్వలను అరికట్టడం, మరోవైపు పేదలకు తక్కువ ధరకు ఆహారధాన్యాలు అందించడం ప్రారంభించారు. హరిత విప్లవం తర్వాత 1970-80 మధ్య గిరిజన ప్రాంత ప్రజలకు, క్రమంగా గ్రామ, పట్టణ పేదలకు విస్తరించారు. 1992 జూన్ నుండి పునరుద్ధరించబడిన ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కరువు పీడిత ప్రాంతాలు, గిరిజన, ఎడారి ఉన్న 1775 ప్రాంతాల్లో ఈ పథకం ద్వారా బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు అందించారు. 1977 నుండి లక్షిత ప్రజా పంపిణీ వ్యవస్థ (టార్గెటెడ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్) ద్వారా సబ్సిడీ ఆహార ధాన్యాలు అందించారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారికి కుటుంబానికి 20 కిలోల చొప్పున బియ్యం, పేదల్లో మరింత పేదరికంలో వున్న వారికి 2002 నుండి అంత్యోదయ అన్న యోజన పథకం ద్వారా కటుంబానికి 35 కిలోలు ఇచ్చారు. పేదరికం పెరగడంతో రక్తహీనత, తల్లీబిడ్డల మరణాలు పెరిగిపోయాయి. దీంతో జాతీయ ఆహార భద్రత చట్టం ద్వారా గ్రామీణ జనాభాలో 75 శాతం, పట్టణ జనాభాలో 50 శాతం మందికి సబ్సిడీ ధాన్యం అందివ్వాలని కేంద్రం నిర్ణయించింది. కరోనా సమయంలో ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన కింద 2020 జనవరి 1 నుండి ఉచితంగా బియ్యం పంపిణీ చేశారు. ఇంత కాలంగా ఆహార ధాన్యాల సబ్సిడీ అందిస్తున్న పేదరికం, ఆకలి బాధలు తగ్గకపోగా పెరిగాయి. ప్రపంచ ఆకలి సూచికలో 156 దేశాల్లో మన దేశం 110వ స్థానంలో ఉంది. సార్వత్రిక ప్రజా పంపిణీ విధానం అమలు చేయడం దీనికి కీలక పరిష్కారం.

పదేళ్ళ మోడీ పాలనలో ఆహార సబ్సిడీ

ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుస్తామని చెబుతున్న పాలకులు పేదలకు అవసరమైన కనీస నిత్యావసర సరుకులను మాత్రం ప్రజా పంపిణీ ద్వారా అందించడంలేదు. లక్షల టన్నుల ధాన్యం భారత ఆహార సంస్థ (ఎఫ్.సి.ఐ) గిడ్డంగుల్లో మగ్గిపోతున్న పేదలకు ఎందుకు పంచడంలేదని సుప్రీంకోర్టు ప్రశ్నించిన తర్వాత కూడా పాలకుల తీరు మారలేదు. కార్పొరేట్ కంపెనీలకు కోట్ల రాయితీలు ఇస్తున్న మోడీ ప్రభుత్వం పేదలకు ఇస్తున్న ఆహార సబ్సిడీ పథకాన్ని నిలిపివేయాలని శతథా ప్రయత్నిస్తున్నది.


దేశ ఆహార భద్రతలో కీలకంగా వ్యవహరిస్తున్న ఎఫ్‌సిఐ గోడౌన్లను మూసివేయడం లేదా ప్రైవేటీకరించడం ఈ ప్రభుత్వ విధానం. కేంద్ర బడ్జెట్‌లో ఆహార సబ్సిడీకి పెడుతున్న ఖర్చు మోడీ పాలనలో భారీగా తగ్గిపోయింది. 2013-14లో ఆహార సబ్సిడీ కోసం దేశ స్థూల జాతీయోత్పత్తిలో 0.8 శాతం ఖర్చు చేస్తుండగా, 2019-20లో 0.5 శాతానికి తగ్గించివేశారు. కరోనా సమయంలో అనివార్యంగా 2021-22లో 1.2 శాతానికి పెంచి ఆ తర్వాత 2023-24లో 0.7 శాతానికి తగ్గించివేశారు. ఎఫ్.సి.ఐ ద్వారా ఇస్తున్న సబ్సిడీకి 2021-22లో రూ.2,08,929 కోట్లు కేటాయించగా, 2023-24లో రూ. 1,37,207 కోట్లు మాత్రమే కేటాయించింది. దీనివల్ల బియ్యం, గోధుమల సేకరణ తగ్గింది. 2015-16లో 342.18 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సేకరించగా, 2022-23లో 434.83 మెట్రిక్ టన్నులు మాత్రమే సేకరించారు. ఇదే కాలంలో గోధుమల సేకరణ 57 శాతం తగ్గింది. గత 13 సంవత్సరాలుగా జనాభా లెక్కలు సేకరించకుండా 2011 లెక్కల ఆధారంగానే ప్రస్తుత ప్రజా పంపిణీ అమలు చేస్తున్నారు. రాష్ట్రాలకు ఆహార సబ్సిడీ కింద ఇస్తున్న బడ్జెట్‌ను 2021-24 మధ్య 17 శాతం తగ్గించింది. వీటి వల్ల అర్హులకు కొత్త రేషన్ కార్డులు ఇవ్వకపోవడమే గాక, ఏదో పేరుతో పాత కార్డులను కుదిస్తున్నారు. ఒకే దేశం-ఒకే రేషన్ కార్డు అంటూ ఈ పథకాన్ని కుదించడానికి అనేక ప్రయత్నాలు కేంద్రం చేస్తోంది.

ప్రజా పంపిణీలో అక్రమాలను అరికట్టాలి. దోషులు ఎంతటి వారైనాసరే కఠినంగా శిక్షించాలి. అదే సమయంలో నాణ్యమైన బియ్యంతో పాటు ఇతర నిత్యావసర సరుకులను రేషన్ షాపుల ద్వారా అందించాలి. కేంద్ర విధానాలను ఎదిరించాలి. సార్వత్రిక ప్రజా పంపిణీ అమలు కొరకు ఉద్యమించాలి.

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు /

అంతర్జాతీయం

సిరియాలో ఏం జరిగింది? భవిష్యత్తు ఏమిటి!



సిరియాలో అసద్ ప్రభుత్వాన్ని కూలదోయటంలో ఏకీభావంతో ఉన్న శక్తులన్నీ తరువాత అధికారాన్ని అలాగే పంచుకుంటాయని చెప్పలేకపోతున్నారు. లిబియాలో అమెరికాను వ్యతిరేకించిన గడాఫీ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు నాటో కూటమి దేశాలన్నీ తిరుగుబాటు శక్తులను ప్రోత్సహించాయి. తీరా 2011లో గడాఫీ సర్కారు కూలిపోయిన తరువాత ఇప్పటి వరకు అధికారం కోసం కుమ్ములాడుకుంటూనే ఉన్నాయి. అదే స్థితి సిరియాలో తలెత్తవచ్చని పరిశీలకులు చెబుతున్నారు.



ఎం. కోటేశ్వరరావు

ఐదు దశాబ్దాలకు పైగా సాగిన అసద్ కుటుంబ పాలన సిరియాలో ముగిసింది. అరబ్ సోషలిస్టు బాత్ పార్టీ నేత, అధ్యక్షుడు బషర్ అల్ అసద్ పాలన 2000 జులై 17 నుంచి 2024 డిసెంబరు 8 వరకు సాగింది. అంతకు ముందు బషర్ తండ్రి హఫీస్ అల్ అసద్ 1971 మార్చి 14 నుంచి 2000 జూన్ పది (మరణించే) వరకు అధికారంలో ఉన్నాడు. మధ్యప్రాచ్యంలో పాలస్తీనాకు మద్దతుగా ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా పూర్వపు సోవియట్ యూనియన్, తరువాత రష్యా పాలకులు సిరియాకు ప్రధాన మద్దతుదారులుగా ఉన్నారు. నవంబరు చివరి వారం నుంచి హయత్ తహ్రిర్ అల్ షామ్ (హెచ్.టి.ఎస్) సాయుధ సంస్థ, దానికి మద్దతు ఇచ్చిన వారు కలసి అసద్ మిలిటరీపై పెద్ద ఎత్తున దాడులు ప్రారంభించి డిసెంబరు ఎనిమిదవ తేదీన రాజధాని డమాస్కస్‌ను స్వాధీనం చేసుకోవటం, అసద్ కుటుంబం రష్యాకు ప్రవాసం వెళ్లటంతో సిరియాలో నూతన అధ్యాయం మొదలైంది.

గాజాలో ఇజ్రాయిల్ మారణకాండ ప్రారంభమై పద్నాలుగు నెలలు గడిచాయి. పాలస్తీనియన్లకు మద్దతుగా ఉన్న లెబనాన్‌లోని హిజ్బుల్లా సాయుధ సంస్థతో ఇజ్రాయిల్ కాల్పుల విరమణ ఒప్పందం చేసుకున్న తరువాత సిరియా పరిణామాలు జరిగాయి. 2011లో ప్రారంభమైన అంతర్యుద్ధంతో సిరియన్లు అనేక విధాలుగా దెబ్బతిన్నారు, దేశం సర్వనాశనమైంది. కుక్కలు చింపిన విస్తరిలా సాయుధ ముఠాలు కొన్ని ప్రాంతాలను తమ అదుపులో ఉంచుకున్నాయి. ఆరు లక్షల మంది వరకు పౌరులు, సాయుధులు, సైనికులు మరణించినట్లు అంచనా. 70 లక్షల మంది అంతర్గతంగా నెలవులు తప్పగా మరో 70 లక్షల మంది వరకు ఇరుగు పొరుగు దేశాలకు శరణార్థులుగా వెళ్లారు. అంతర్యుద్ధం ముగిసినా సాధారణ జీవన పరిస్థితి ఎంత కాలానికి పునరుద్ధరణ అవుతుందన్నది పెద్ద ప్రశ్న.

ఇప్పుడు సిరియా భవితవ్యం ఏమిటంటే ఎవరూ ఏమీ చెప్పలేని స్థితి. అమెరికా కుట్రలకు వ్యతిరేకంగా దశాబ్దాలపాటు జోక్యం చేసుకున్న రష్యా రానున్న రోజుల్లో ఎలాంటి పాత్ర పోషించేదీ తెలియదు. నూతన పాలకులు టర్కీ కనుసన్నలలో పని చేసే అవకాశం ఉంది. నాటోలో అది అమెరికా అనుయాయి. అదే సమయంలో కొన్ని అంశాలలో దానితో విబేధించి రష్యాతో సంబంధాలు కలిగి ఉంది. సిరియా పరిణామాల్లో రష్యా, అమెరికా రెండూ తమ ప్రభావాన్ని చూపేందుకు ప్రయత్నించాయి. దాన్ని అదుపులోకి తెచ్చుకొనేందుకు అమెరికా పెద్ద ఎత్తున తిరుగుబాటుదార్లను ప్రోత్సహించింది. ఇటీవల జరిగిన పరిణామాలను చూసినపుడు సిరియాలో ఇంక అమెరికా చేసేది ఏముందని కొందరు నిరుత్సాహాన్ని ప్రకటించారు. ప్రచ్ఛన్న యుద్ధం ముగిసిన 1990 దశకం తరువాత "ఆపరేషన్ టింబర్ సైకామోర్" పేరుతో అమెరికా భారీ మొత్తాలను సిరియాలో కుమ్మరించిందని చెబుతున్నారు. ఉదారవాద తిరుగుబాటుదార్ల ముసుగులో 2013 నుంచి 2017 వరకు నాలుగు సంవత్సరాలలో అమెరికా సిఐఎ ద్వారా వివిధ సంస్థలకు వంద కోట్ల డాలర్లకు పైగా అందచేసిందని అంచనా. ఆ తరువాత కూడా తరతమ తేడాలతో ఇదే విధంగా తిరుగుబాటుదార్లకు చేరుస్తున్నది. అసద్ వ్యతిరేకులకు మద్దతుతో పాటు సిరియాలో అమెరికాను కూడా వ్యతిరేకించే శక్తులను దెబ్బతీసేందుకు చూసింది. అమెరికా మిలిటరీ కూడా 50 కోట్ల డాలర్లతో తిరుగుబాటుదార్లకు శిక్షణ, ఆయుధాలను అందచేసింది. ఇవన్నీ ఘోరంగా విఫలమయ్యాయి. టర్కీ మద్దతు ఉన్న తిరుగుబాటుదార్లు డమాస్కస్‌ను పట్టుకుంటారని కూడా అమెరికా ఊహించినట్లు కనపడదు. లేదా నిస్సహాయంగా ఉండిపోయిందని చెప్పవచ్చు. అందుకే ట్రంప్ అందని ద్రాక్ష పుల్లన అన్నట్లుగా మాట్లాడుతున్నాడు.

ఒబామా గనుక కాస్త ముందుగా జాగ్రత్తపడి ఉంటే అసద్ తొలగింపు మరింత వేగిరం, అమెరికా ప్రమేయం కూడా ఉండేదని రణోన్మాదులు కొందరు నిష్టూరాలాడుతున్నారు. అమెరికా మద్దతు ఇచ్చిన మిలిటెంట్ సంస్థలన్నీ అంతర్గత కుమ్ములాటలు, అవినీతి, గూండాయిజాలతో కొట్టుకు చచ్చాయని, ఆల్‌ఖైదాకు ఆయుధాలు అమ్ముకున్నట్లు విమర్శిస్తున్నారు. ఈ శక్తులు అసద్ మీద ఒత్తిడి తెచ్చి అంతర్జాతీయ సమాజంతో చర్చలకు నెడతాయని అమెరికా ఊహించినదానికి భిన్నంగా అసద్ బలమైన శక్తితో అనేక నగరాలను స్వాధీనం చేసుకున్నట్లు సిరియాలో మాజీ అమెరికా రాయబారి రాబర్ట్ ఫోర్డ్ చెప్పాడు. అమెరికా నుంచి నిధులు పొందిన ఫ్రీ సిరియన్ ఆర్మీ వంటి సంస్థలు చివరకు టర్కీ అనుకూల సిరియన్ నేషనల్ ఆర్మీగా మారిపోయాయని, వారు కుర్దులపై అత్యాచారాలు, దోపిడీలకు పాల్పడటంతో అదే అమెరికా చివరికి మానవ హక్కులకు భంగం కలిగించారనే పేరుతో ఆంక్షలు విధించిందని, చివరికి నవంబరు చివరి వారంలో ఈ శక్తులు లూటీలకు పాల్పడుతుండటంతో తాజాగా అధికారానికి వచ్చిన హెచ్.టి.ఎస్ దళాలు వారిని అణచివేసి అరెస్టు చేశాయని ఇలాంటి పనులు చేసిన తరువాత అమెరికాకు సిరియాలో ఇంక చేసేందుకు ఏం మిగిలిందని ప్రశ్నిస్తున్నారు. ఈ విమర్శలన్నీ మరింత గట్టిగా వ్యవహరించలేదని, సిరియాను తమ అదుపులోకి తెచ్చుకోలేదని తప్ప పరాయి దేశంలో జోక్యం తప్పనే కోణం నుంచి కాదు. రాబోయే రోజుల్లో ఏం జరిగినప్పటికీ అమెరికా డ్రైవర్ సీట్లో కూర్చొనే అవకాశం లేదని, చేసిన ఖర్చంతా వృధా అయిందని విమర్శిస్తున్నారు.

సిరియాలో అసద్ ప్రభుత్వాన్ని కూలదోయటంలో ఏకీభావంతో ఉన్న శక్తులన్నీ తరువాత అధికారాన్ని అలాగే పంచుకుంటాయని చెప్పలేకపోతున్నారు. లిబియాలో అమెరికాను వ్యతిరేకించిన గడాఫీ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు నాటో కూటమి దేశాలన్నీ తిరుగుబాటు శక్తులను ప్రోత్సహించాయి. తీరా 2011లో గడాఫీ సర్కారు కూలిపోయిన తరువాత ఇప్పటి వరకు అధికారం కోసం కుమ్ములాడుకుంటూనే ఉన్నాయి. అదే స్థితి సిరియాలో తలెత్తవచ్చని పరిశీలకులు చెబుతున్నారు. ఇప్పటికే హెచ్.టి.ఎస్‌ను ఉగ్రవాద సంస్థగా దాని నేత జొలానీ ఉగ్రవాదిగా వర్ణిస్తున్న అమెరికా రానున్న రోజుల్లో అతని నాయకత్వాన ప్రభుత్వం ఏర్పడితే ఎలా వ్యవహరిస్తుందన్నది ప్రశ్న. అతనికీ అదే పరిస్థితి. ఈ సంస్థ రానున్న రోజుల్లో ఇరాన్‌తో చేతులు కలపవచ్చని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు అనుమానిస్తున్నాడు. అది గనుక తమపై దాడికి దిగితే ప్రతిస్పందన గట్టిగా ఉంటుందని, గత ప్రభుత్వానికి ఏం జరిగిందో దీనికీ అంతే అని హెచ్చరించాడు. నూతన పాలకులతో రష్యా సంబంధాలు పెట్టుకోవచ్చని, ఇరాన్ కూడా అదే చేయవచ్చని కూడా పశ్చిమ దేశాల పరిశీలకులు చెబుతున్నారు. సిరియాలో ఉన్న తమ సైన్యాన్ని వెనక్కు రప్పిస్తానని గతంలో డోనాల్డ్ ట్రంప్ చెప్పాడు. అయితే జనవరి 20న కొలువు తీరనున్న ట్రంప్ సర్కార్‌లో విదేశాంగ మంత్రిగా బాధ్యతలు చేపట్టనున్న మార్కో రుబియో మాత్రం వేరుగా స్పందించాడు. రానున్న రోజుల్లో ఉగ్రవాద ముప్పు తలెత్తితే ఎదుర్కొనేందుకు అక్కడ తమ సైన్యం ఉండటం అవసరమని సెలవిచ్చాడు. సిరియాలో ఇప్పటికైతే పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. ★

జనవాక్యం

వారే ఇలా చేస్తే ఎలా?

నెల్లూరు జిల్లా గొలగమూడి వెంకయ్య స్వామి గుడి కమిటీకి వైస్ చైర్మన్‌గా రిటైర్డ్ హైకోర్టు జడ్జి కె.ఎస్.అప్పరావు నిన్న సోమవరం ప్రమాణం చేశారు. నిన్నటి వరకు తన, మన అనేది లేకుండా న్యాయం అందిస్తానని జడ్జిగా పనిచేసిన ఒక న్యాయమూర్తి ఈ రోజు ఒక గుడికి, ఒక మతానికి చెందిన భావజాలం వెదజల్లే గుడి కమిటీకి వైస్ చైర్మన్‌గా ప్రమాణం చేశారంటే, అంతకు ముందు అయన ఇచ్చిన తీర్పులలో కూడా ఎంత న్యాయం ఉండి వుంటుందో అనుమానమే. మొన్ననే ఉత్తర భారతంలో ఒక హైకోర్టు న్యాయమూర్తి గుడుల మీద వివాదాస్పమైన వ్యాఖ్యలు చేశారు. దానిమీద ఒక పెద్ద చర్చ నడుస్తున్నది. అయోధ్య రామ మందిరం మీద తీర్పులు ఇచ్చినవారిని గురించి కూడా చర్చ జరిగింది. ఇపుడు ఒక హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి ఇలా మతపరమైన గుడికి వైస్ చైర్మన్ ప్రమాణం చేయటం తగని పని. పలు అనుమానాలకు తావు ఇచ్చినట్లుగా అవుతుంది. తక్షణం ఆయన ఆ పదవికి రాజీనామా చేయాలి. గౌరవంగా ఉంటుంది.

- నార్నె వెంకట సుబ్బయ్య

భారీ జరిమానాలతోనే కట్టడి

రాష్ట్రంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టుబడుతున్న వార్తలు నిత్యం పత్రికల్లో వస్తున్నాయి. కేసులు నమోదు చేస్తున్నారు. అయినప్పటికీ అక్రమ తరలింపు ఆగే పరిస్థితి లేదు. అలాగే పట్టుబడిన బియ్యం కాలం గడిచే కొద్దీ పురుగు పట్టి ఎందుకూ పనికి రాకుండా పోయే ప్రమాదం ఉంది. అధికారులు చట్టపరమైన చర్యలను వేగవంతం చేసి, పట్టుబడిన బియ్యాన్ని వేలం వేయాలి. అక్రమాలకు పాల్పడిన వారికి భారీ జరిమానాలు విధించాలి.

- గరిమెళ్ళ రామకృష్ణ,
ఏలూరు, ఏలూరు జిల్లా.

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @ gmail.com

చంద్రబాబు కేసుల విచారణ

ఇతర రాష్ట్రాలకు బదిలీ చేయాలి

● మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన కేసులు మాఫీ చేయించుకునేందుకు తన సొంత మనుషులను ఆయా డిపార్టుమెంట్లలో ఏర్పాటు చేసుకున్నారని, విచారణ రాకుండా వ్యవస్థలను నిర్వీర్యం చేసేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. సిఎంపై ఉన్న కేసులు విచారణ ఏపిలో కాకుండా ఇతర రాష్ట్రాల్లో విచారించేలా చూడాలని ఆయన కోరారు. మంగళవారం సాయంత్రం వైసిపి కేంద్ర కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబుపై స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ కేసులో అప్పటి సిఐడి అధికారులు అన్ని వివరాలూ సేకరించారని తెలిపారు. దీనిపై కక్షపెట్టుకుని సీనియర్ ఐపిఎస్ అధికారులు పిఎస్ఆర్ ఆంజనేయులు, సంజయ్ లాంటి వారిని సస్పెండ్ చేయించారని తెలిపారు. అన్ని డిపార్టుమెంట్లలో సొంత మనుషులను పెట్టుకుని కోర్టులకు కావాల్సిన నివేదికలు ఇవ్వకుండా చేయడం ద్వారా కేసులను నీరుగార్చే పనిచేయిస్తున్నారని అన్నారు. వ్యవస్థలను మేనేజ్ చేయడంలో దిట్టగా చంద్రబాబు పేరుగాంచారని, సిఎం అయిన తరువాత ఇష్టం వచ్చినట్టు చేసుకుపోతున్నారని తెలిపారు. సీమెన్స్ కుంభకోణంలో అన్ని ఆధారాలూ అధికారుల వద్ద ఉన్నాయని, వాటిని నిర్వీర్యం చేసే విధంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కోర్టులను ప్రభావితం చేసే అవకాశం ఉన్న నేపథ్యంలో సిఎంపై ఉన్న కేసులను ఇతర రాష్ట్రాల్లో విచారించేలా చూడాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.



విజయవాడలోని గొల్లపాలెంగట్టు సెంటర్‌లో విద్యుత్ బిల్లులు దహనం చేస్తున్న నేతలు

ట్రూఅప్ ఛార్జీలపై నిరసనలు

పలుచోట్ల విద్యుత్ బిల్లులు దహనం

ప్రజాశక్తి-యంత్రాంగం

రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ సర్దుబాటు ఛార్జీలకు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం పలుచోట్ల విద్యుత్ బిల్లులు దహనం చేసి నిరసన తెలిపారు. విద్యుత్ సర్దుబాటు చార్జీలతో పాటు ఆదానితో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేసుకోవాలని, ట్రూ అప్ ఛార్జీలను ప్రభుత్వమే భరించాలని, ప్రీపెయిడ్ కరెంటు స్మార్ట్ మీటర్లు బిగింపు ఆలోచనను ఉపసంహరించుకోవాలని నినదించారు. విజయనగరంలోని విద్యుత్ భవన్ వద్ద నిరసన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు మాట్లాడుతూ ఆదానికి లాభాలు... ప్రజలపై భారాలా? అని ప్రశ్నించారు. ట్రూ అప్ ఛార్జీలను ఉప సంహరించుకునే వరకు ఉద్యమిస్తామని, ప్రజలంతా ఈ పోరాటంలో పాల్గొనాలని కోరారు. అనంతరం విద్యుత్ బిల్లులను దహనం చేశారు. విద్యుత్ ఛార్జీల పెంపు, స్మార్ట్‌మీటర్ల బిగింపును నిరసిస్తూ విశాఖ జివిఎంసి జోనల్ కార్యాలయం వద్ద, చింతల్లోవ నెప్తూనగరంలోని జంక్షన్ వద్ద, గాజువాకలోని దక్షిణకొండ వద్ద విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ఏలూరు జిల్లా నూజివీడు, ప్రకాశం జిల్లా ఒంగోలులో నిరసనలు తెలిపారు. విజయవాడలోని గొల్లపాలెంగట్టు వాటర్‌ట్యాంక్ రోడ్డులో సిపిఎం పశ్చిమ సిటీ కార్యదర్శి, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు మాట్లాడుతూ.. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలన్నారు. ప్రభుత్వం మోసగిస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు.

ప్రజల అభిప్రాయాలతో భూముల రీ సర్వే

● మంత్రి అనగాని సత్యప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

సంక్షేమమైన ప్రభుత్వాలను సవరిస్తూ ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని భూముల రీ సర్వేను కొనసాగిస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. సోమవారం విశాఖ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉత్తరాంధ్ర కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ఆర్‌డిఒలతో కలిసి రెవెన్యూ ఉత్తరాంధ్ర ప్రాంతీయ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతుల నుంచి అందిన ప్రతి ఫిర్యాదును పరిష్కరించిన తర్వాతే రీ సర్వేపై ముందుకు వెళ్తామన్నారు. భూముల రీసర్వే ఫిర్యాదుల విషయంలో రైతులకు అనుకూలమైన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. రీ సర్వే చేయనున్న గ్రామాల్లో ముందుగానే సమాచారం తెలియపరుస్తామని చెప్పారు. మూడు తేదీలతో కూడిన స్లాట్ ఇస్తామని, ప్రతి ఒక్కరికీ ఎస్ఎంఎస్, ఫోన్ల రూపంలో సమాచారం తెలుపుతూ రీసర్వేను నిర్వహించాలని స్పష్టం చేశారు. విశాఖ ప్రాంతంలో ఫ్రీ హోల్డ్ భూముల విషయంలో ఇన్‌సైడర్ ట్రేడింగ్ ఏమైనా జరిగిందేమోనని పరిశీలించాలని విశాఖ కలెక్టర్‌ను ప్రత్యేకంగా ఆదేశించారు. సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడుతూ..ఇప్పటి వరకూ 6,680 గ్రామాలలో గ్రామ సభలు పెట్టామని, రెండు లక్షలకుపైగా వినతులు వచ్చాయని అన్నారు. 20న కృష్ణా జిల్లాలో నిర్వహించే జోనల్ రెవెన్యూ సదస్సులో సిఎం చంద్రబాబు పాల్గొంటారని చెప్పారు. రెవెన్యూ సదస్సులో పంచ గ్రామాలు, 22ఎ సమస్యలపై సుదీర్ఘంగా చర్చ జరిగిందని, ఫ్రీ హోల్డ్‌పై విచారణ జరిపి అధికారుల తప్పు ఉంటే వారిపై చర్యలు తీసుకుంటామని మంత్రి అన్నారు.

సొంత విద్యుత్ బస్సులనే నడపాలి: ఎస్‌డబ్ల్యుఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్‌టిసి రూట్లలో నిడిపే విద్యుత్ బస్సులన్నీ సంస్థవే అయి ఉండాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. దశలవారీ ప్రభుత్వ విద్యుత్ బస్సులు ప్రవేశపెట్టడానికి ప్రణాళికలు రూపొందించాలని ఫెడరేషన్ గౌరవాధ్యక్షు లు ఎస్‌కె జిలానీ, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్ సుందరయ్య, ఎం అయ్యప్ప రెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. వాతావరణ కాలుష్యం తగ్గించే పేరుతో రాష్ట్రంలో విద్యుత్ బస్సులు ప్రవేశపెట్ట డాన్ని ఫెడరేషన్ స్వాగతిస్తుందన్నారు. 2029 నాటికి ఆర్‌టిసిలో మొత్తం విద్యుత్ బస్సులు ప్రవేశపెట్టడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నారని, ఈ బస్సులను ఆర్‌టిసి ఉద్యోగులతోనే నిర్వహిస్తే ప్రయోజనం ఉంటుందన్నారు. ఈ బస్సుల కొనుగోలులో కేంద్ర ప్రభుత్వం వాహన తయారీ సంస్థలకు ఇచ్చే సబ్సిడీని ఆర్‌టిసికే ఇవ్వాలన్నారు. ఇప్పుడున్న అద్దె బస్సులను కూడా దశల వారీ తగ్గించి ఆర్‌టిసి విద్యుత్ బస్సులను కొనుగోలు చేయాలని, ఈ విషయమై సంస్థ యాజమాన్యం, రవాణాశాఖ మంత్రి.. కార్మిక సంఘాలతో చర్చించాలని కోరారు. ఆర్‌టిసి డ్రైవర్లకు విద్యుత్ బస్సుల నిర్వహణపై ఇప్పటి వరకూ శిక్షణ ఇవ్వలేదన్నారు. విద్యుత్ బస్సుల ముసుగులో ఆర్‌టిసిని ప్రైవేటు వారికి కట్టబెట్టే చర్యలు చేపడితే పోరాటాలకు సిద్ధంగా ఉండాలని కార్మికులకు, ప్రయాణికులకు పిలుపునిచ్చారు.

సమగ్ర పర్యాటక విధానంతో ముందుకు

● పర్యాటక పెట్టుబడిదారుల సదస్సులో మంత్రి దుర్గేష్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పర్యాటక హోదాతో పర్యాటక రంగాన్ని కూటమి ప్రభుత్వం ప్రకటించడంతో ఈ రంగానికి మహర్దశ వచ్చిందని, సమగ్ర పర్యాటక విధానంతో రాబోయే ఐదేళ్లలో రాష్ట్రాన్ని పర్యాటకంగా అగ్రస్థానంలో తీర్చిదిద్దుతున్నామని పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. విజయవాడలోని ఓ హోటల్‌లో మంగళవారం సిఐఐ, ఏపి ఛాంబర్స్ మద్దతుతో పర్యాటక పెట్టుబడిదారుల సదస్సు జరిగింది. ఈ సందర్భంగా నూతన పర్యాటక పాలసీ-2024-29ను మంత్రి ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సదస్సులో మంత్రి మాట్లాడుతూ.. పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చేవారికి ప్రభుత్వ సహకారం పూర్తి స్థాయిలో ఉంటుందన్నారు. పర్యాటక రంగానికి నూతన శోభను తీసుకొస్తున్నామన్నారు. రాష్ట్రంలో 3 ఎకో టూరిజం, 10 టెంపుల్, 2 బుద్దిస్ట్, 5 బీచ్, 4 రివర్, 2 క్రూయిజ్ సర్క్యూట్లు, 7 యాంకర్ హబ్‌లు, 25 థీమాటిక్ అపోర్టేలు ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు. ఆర్థిక వృద్ధి, సరైన నిర్వహణ, పర్యాటకుల భద్రత, బాధ్యతాయుత పర్యాటకం, సుస్థిరాభివృద్ధి, యువతకు ఉపాధి కల్పన వంటి అంశాలకు పాలసీలో పెద్దపీట వేసినట్లు పేర్కొన్నారు. పర్యాటక రంగానికి కొత్త శోభ తీసుకొస్తున్నామని తెలిపారు. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ దిశా నిర్దేశంలో పర్యాటక రంగంలో రూ.2,500 కోట్లు పెట్టుబడులకు ఆస్కారం ఉన్న చాలినే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. రాష్ట్రంలోని హోటల్ గదుల సంఖ్యను 50 వేలకు పెంచేలా కృషి చేస్తున్నామన్నారు. ఎపిటిడిసి ఛైర్మన్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ.. సుస్థిరమైన పర్యాటకాభివృద్ధికి బాటలు వేస్తామన్నారు. ఈ సదస్సులో టూరిజం శాఖ సెక్రటరీ వినయ్ చంద్, ఎమ్‌డి ఆమ్రపాలి మాట్లాడారు. ఎపి ఛాంబర్ ప్రెసిడెంట్ పి భాస్కరరావు, సిఐఐ ప్రెసిడెంట్ డి రామకృష్ణ, హోటల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వీరస్వామి, పలు సంస్థలకు చెందిన ఔత్సాహికులు, పెట్టుబడిదారులు పాల్గొన్నారు.

టెండరు కం వేలం అమ్మకపు నియమాలు మరియు నిబంధనలు :

1) 5 నిమిషాల అపరిమిత పొడిగింపుతో పై పట్టికలో పేర్కొన్న తేదీలలో వెబ్‌సైట్ **https://www.bankeauctions.com** లేదా యాక్షన్ టైగర్ మొబైల్ ఆప్ ద్వారా "ఆన్‌లైన్ ఇ-వేలం" బిడ్డింగ్ ద్వారా వేలం అమ్మకం ఉంటుంది. **2)** ఆసక్తిగల బిడ్డరుదారు లాగిన్ ఐడి మరియు పాస్‌వర్డ్ ద్వారా **https://www.bankeauctions.com** తో **(https://www.bankeauctions.com** తో పేరును రిజిస్టర్‌చేయుటతో ఉచితంగా యూజర్ ఐడి మరియు పాస్‌వర్డ్‌ను పొందవచ్చును) పైన ఉన్న "హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీస్ లిమిటెడ్"కి అనుకూలంగా డ్రా చేయబడిన రిజర్వ్ ధరలో 10% ఇఎమ్‌డి కోసం ఆర్డర్/డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా ఇఎమ్‌డి చెల్లించబడుతుంది. వెబ్ పోర్టల్‌లో బిడ్డర్ నమోదు చేసిన తర్వాత (ఒకసారి), బిడ్ డాక్యుమెంట్‌లను సమర్పించే చివరి తేదీ మరియు సమయానికి ముందు వెబ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలనుకుంటున్న బిడ్డర్/కొనుగోలుదారు కింది పత్రాల కాపీలను పొందవలసి ఉంటుంది. 1) ఎన్ఇఎఫ్‌టి/ఆర్‌టిజిఎస్ చలాన్ లేదా డిమాండ్ డ్రాఫ్ట్ కాపీ; 2) పాన్ కార్డ్ యొక్క కాపీ; 3) గుర్తింపు రుజువు/ చిరునామా రుజువు (కెవైసి) అనగా. ఓటరు ఐడి కార్డ్/ డ్రైవింగ్ లైసెన్స్/ పాస్‌పోర్ట్ మొదలైన వాటి యొక్క స్వీయ-ధృవీకరించబడిన కాపీ; అది లేకుండా బిడ్ తిరస్కరించబడుతుంది. అనుబంధం-2 మరియు 3 యొక్క స్కాన్ చేసిన కాపీని అప్‌లోడ్ చేయడం (వెబ్ పోర్టల్ **www.vehicleduniya.com** నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు: అప్పుడు సరిగ్గా పూరించిన తర్వాత మరియు సంతకం చేయడం కూడా అవసరం. ... **13)** అధీకృత అధికారికి టెండర్‌ను అంగీకరించడానికి లేదా తిరస్కరించడానికి లేదా ఏదైనా లేదా అన్ని ఆఫర్‌లను బిడ్ చేయడానికి మరియు ఏ కారణం చెప్పకుండానే వేలాన్ని మార్చడానికి/వాయిదా వేయడానికి/రద్దు చేయడానికి మరియు ఎటువంటి కారణం చూపకుండా విక్రయానికి సంబంధించిన ఏవైనా నిబంధనలు మరియు షరతులను సవరించడానికి మరియు ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా అమ్మకానికి సంబంధించిన షరతులను సవరించడానికి సంపూర్ణ హక్కు ఉంటుంది.

అవినాష్ పిఎను విచారించిన పోలీసులు

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్.అవినాష్‌రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి రాఘవరెడ్డిని మంగళవారం పులివెందుల పట్టణ పోలీసుస్టేషన్‌లో పోలీసులు విచారించారు. ఈ నెల 9, 10, 11, 13వ తేదీలలో కడప క్రైమ్ బ్రాంచ్ పోలీసు స్టేషన్‌లో పోలీసులు విచారించిన విషయం తెలిసిందే. వర్రా రవీందర్‌రెడ్డి కేసులో రాఘవరెడ్డి నిందితునిగా ఉన్నారు. విచారణ అనంతరం రాఘవరెడ్డి మాట్లాడుతూ.. పోలీసులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం చెప్పానన్నారు. ఈనెల 21న కడప క్రైమ్ బ్రాంచ్ పోలీసుస్టేషన్‌లో విచారణకు హాజరు కావాలని 41ఎ నోటీసులు ఇచ్చారని తెలిపారు.

శికారీలపై 'మత'ముద్ర

- షాపులు కూల్చివేత
- వీధినపడ్డ 500 కుటుంబాలు
- మతోన్మాదుల కుట్ర
- టిటిడి, ఫారెస్టు అధికారుల వేధింపులు

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

శికారీలు సంచార జాతులవారు. రెక్కాడితేగాని డొక్కాడని బతుకులు వీరివి. రెండు తరాలుగా తిరుమల పాపవినాశనాన్నే నమ్ముకుని చిరు వ్యాపారాలు చేసుకుంటూ వీరు బతుకు జీవనం సాగిస్తున్నారు. ఈ పొట్టకూటి కొండని బడా రాజకీయ కన్నువేసింది. వీరికి మతోన్మాదులు తోడయ్యారు. ఎలాగైనా వీరిని ఖాళీ చేయించాలని టిటిడి, ఫారెస్టు అధికారులతో కలిసి కుట్ర పన్నారు. శికారీలపై 'క్రిస్టియన్' అని ముద్ర వేసి గత నవంబర్‌లో షాపులను కూల్చేశారు. దీంతో, 500 కుటుంబాలు వీధినపడ్డాయి. న్యాయం కోసం టిటిడి ఇఒ, కలెక్టరేట్ చుట్టూ బాధితులు తిరుగుతూ తమ పొట్ట కొట్టొద్దంటూ వాపోతున్నారు. ఈ నెల 16న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు మరోసారి తమ గోడు వినిపించుకునేందుకు రాగా, 'ప్రజాశక్తి' వారిని పలకరించింది. వారి గోడు వారి మాటల్లోనే... 1961 నుంచి తిరుమలలోని పాపవినాశనంలో చెట్టు పుట్ట చదును చేసుకుని చిమ్మచీకట్లోనే కుటుంబాలతో గడుపుతూ వచ్చాం. మాకంటూ ఓ గుడి కావాలని గంగమ్మ గుడిని ఏర్పాటు చేసుకున్నాం. తిరుమలకు సందర్శకుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండడంతో ఆ గంగమ్మ సాక్షిగా చిన్న చిన్న వ్యాపారాలను చేసుకుంటూ వచ్చాం. పూసల దండలు, కొయ్య దువ్వెనలు, బొట్టు బిళ్లలు, హ్యాండ్ బ్యాగులు తదితర వస్తువులను సందర్శకులకు అమ్ముతూ పొట్టపోసుకుంటున్నాం. అప్పట్లో 27 షాపులను మాకు కేటాయించారు. పాపవినాశనం డ్యాం వైపు నుంచి స్మగ్లర్లు, చొరబాటుదారులు రాకుండా కొండకు కాపలాగా కూడా ఉంటున్నాం. మేమంతా ఇక్కడే ఉండడంతో 1985లో టిటిడి ప్రభుత్వ హయాంలో అధికారులు తిరుమలలో షాపులు పెట్టుకుని, కుటుంబాలు ఖాళీ చేసి తిరుపతి దామినేడు వద్ద నివాసం ఉండాలని చెప్పారు. మా కోసం అక్కడ ఇళ్లను నిర్మించి ఇచ్చారు. అప్పట్లో 150 కుటుంబాలు మాత్రమే ఉండేవి. మా సంతతి పెరిగి పెద్దవడంతో ప్రస్తుతం 500 కుటుంబాలయ్యాయి. గత 75 ఏళ్లుగా తరతరాలుగా ఆ 27 షాపులనే నమ్ముకుని బతుకుతున్నాం. మా షాపులపైన బడాబాబుల కన్ను పడింది. ఫారెస్టు అధికారులతో కుమ్మక్కై మమ్మల్ని అక్కడి నుంచి తరిమేయాలని కుట్ర పన్నారు. తొలుత గంగమ్మ ఆర్చిని తొలగించారు. టిటిడి ఏర్పాటు చేసిన సూచిక బోర్డులన్నీ రాత్రికి రాత్రే తొలగించి అవన్నీ మేమే చేశామంటూ టిటిడికి తప్పుడు ఫిర్యాదు చేశారు. మా కుటుంబంలో ఒక అబ్బాయి చెన్నయ్‌లో బిటెక్ చదువుతున్నాడు. అక్కడ ఓ క్రిస్టియన్ అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకుని తిరుమలకు వచ్చాడు. ఇవన్నీ సాకు చూపి మాపై క్రిస్టియన్ ముద్ర వేసి మా షాపులను ఫారెస్టు అధికారులు ధ్వంసం చేశారు. కాళ్లు పట్టుకుని బతిమిలాడినా కనికరించలేదు. న్యాయం చేయాల్సిన టిటిడి ఇఒ సైతం మా మొర ఆలకించలేదు. మాపై మతం ముద్ర, మా షాపులను ధ్వంసం చేయడం వెనుక మతోన్మాదుల కుట్ర దాగి ఉంది. గత్యంతరం లేక కలెక్టర్‌కు చెప్పుకుందామని వచ్చాం. అని పేర్కొన్నారు.

26 రోజులుగా అంగళ్లు లేవు



ఫారెస్టు అధికారులు మాపై నింద వేసి దౌర్జన్యంగా మా షాపులను ధ్వంసం చేశారు. అంగడి జరిగితేనే కుటుంబం గడవదు. అలాంటిది గత 26 రోజులుగా అంగళ్లు లేవు. పస్తులు ఉండాల్సి వస్తోంది. టిటిడి అధికారులు స్పందించి మా షాపులను మాకు తిరిగి ఇప్పించాలి. మా చావైనా, బతుకైన శ్రీవారి చెంతనే.

-రమేష్, శికారీ

KVB Karur Vysya Bank Smart way to bank

ది కరూర్ వైశ్యా బ్యాంకు లిమిటెడ్

తిరువూరు బ్రాంచ్

చిరునామా: డి.నెం.7-56, చిత్తలూరి వారి వీధి, నడిమి తిరువూరు, తిరువూరు-521235

బంగారు నగల వేలము ప్రకటన

ఈ క్రింది ఉదహరించిన ఖాతాదారుడు బంగారు నగలపై మా శాఖలో అప్పు తీసుకొని సకాలంలో తమ బకాయిలు చెల్లించని కారణంగా బ్యాంక్ నిబంధనలు ప్రకారం **తేది. 26.12.2024 అనగా గురువారం సాయంత్రం 3.00 గం॥లకు** మా బ్రాంచ్ ఆవరణలో వేలం వేసి బాకీలు వసూలు చేసుకుందామని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

షరతులు నిబంధనలు: 1) వేలంలో పాల్గొనదలచినవారు **రూ.10,000/-లు** ధరావత్తు కట్టి వేలంలో పాల్గొనవలెను. 2) హెచ్చు పాటదారుడు మొత్తం సొమ్ము అదేరోజు చెల్లించి వస్తువులను పొందవలెను. 3) నగలు బరువునకు, నాణ్యతకు బ్యాంకు వారి పూచీ ఏమాత్రం లేదు. 4) ఏ విధమైన కారణం చూపకనే వేలం షరతులు మార్చుకొనుటకు గానీ, వాయిదా వేయుటకు గానీ, వేలం ఆపుటకు గానీ, రద్దు చేయుటకు గానీ బ్యాంకు వారికి పూర్తి అధికారం కలదు. 5) అడ్రస్ నిర్ధారించు ఆధార్ కార్డు కాపీని గాని, పాన్‌కార్డు కాపీని జతచేయవలెను. 6) ఈ ఖాతాదారులలో ఎవరైననూ మరణించిన యెడల వారి వారసులకు ఈ ప్రకటన పూర్వకముగా తెలియపరచినట్లుగా భావించవలెను. 7) అప్పు వసూలు నోటీసు అందనివారు మరియు నోటీసులు తిరస్కరించినవారు ఈ ప్రకటన తుది నోటీసుగా భావించి వేలం తేదీలోగా సొమ్ము చెల్లించవలెను. 8) జి.ఎస్.టి. వర్తించబడును., 9) ఆన్‌లైన్ బిడ్స్ కూడా స్వీకరించబడును.

ఖాతా నెం.	ఋణగ్రస్తుని పేరు మరియు చిరునామా	ఆభరణముల సంఖ్య	బంగారం బరువు గ్రా॥లో
4890953000023906	దార సుధాకర్, 1-77, చాటరాయి, చాటరాయి మండలం, మెయిన్‌రోడ్, చాటరాయి-521214	01	15.9
4890953000023736	గొల్లమందల చంటి, చవటపల్లి, తిరువూరు-521227	02	23.4

తేది : 17.12.2024
ప్రదేశం : తిరువూరు

సం/- అధీకృత అధికారి,
ది కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్

यूनियन बैंक ऑफ इंडिया भारत सरकार का उपक्रम | యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ

యు.ఎం.ఎఫ్.బి ఆటోనగర్ బ్రాంచి
ప్లాట్ నెం.14, బ్లాక్ నెం.86, 100 అడుగుల రోడ్డు, ఆటోనగర్, యు.ఎం.ఎఫ్.బి బ్రాంచి విజయవాడ-520007.

డిమాండ్ నోటీసు

NOTICE UNDER SECTION 13(2) OF ACT 54 OF 2002 FOR ENFORCEMENT OF SECURITY INTEREST

ఋణగ్రహీత(లు) /కో అప్లిగెంట్(లు) / హామీదారు(లు): శ్రీ రాజరాజేశ్వరి ట్రేడర్స్, చిరునామా-1: ప్రొప్రయిటర్ శ్రీమతి బాస లక్ష్మి రజని, పార్ట్ ఎ 54 221, కోటిరెడ్డి రోడ్డు, ఆటోనగర్ విజయవాడ, ఏపి-520007. **చిరునామా-2:** బాస లక్ష్మి రజని, 56 10 14 ఏ, గ్రౌండ్ ఫ్లోర్, పి&టి కాలనీ, 3వ రోడ్డు, పంటకాలువ, విజయవాడ, ఏపి-520007.

నేచర్ ఆఫ్ లిమిట్	ఋణగ్రహీత / హామీదారు పేర్లు	బకాయి మొత్తం (రూ.)
వర్కింగ్ క్యాపిటల్	శ్రీ రాజరాజేశ్వరి ట్రేడర్స్	రూ. 54,33,239.05 పై

దిగువ వివరించిన స్థిరాస్తి తనఖా: ఆంధ్రప్రదేశ్, ఎన్.టి.ఆర్ జిల్లా, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, విజయవాడ తూర్పు (గుణదల), ఫైల్ జిల్లా రిజిస్టర్, కృష్ణాజిల్లా, ప్రసాదంపాడు గ్రామం & పంచాయితీ, ఆర్.ఎస్.నెం.69/11, డి.నెం.6-192, మజ్జి హబిటాట్ పేరుగల అపార్ట్‌మెంట్, ప్లింత్ ఏరియా 906.0 చ.అ.లు, కామన్ ఏరియా 194 చ.అ.లు, కార్ పార్కింగ్ ఏరియా 100 చ.అ.లు, పార్కింగ్, నీటి పారుదల, మార్గాలు మరియు మెట్లు మొదలైన సాధరాణ సౌకర్యాలతో మొదటి అంతస్తులో గల ఫ్లాట్ నెం.ఎఫ్-3.

అమ్మా/ అయ్యా,

విషయం: ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టము ప్రకారము నోటీసు - మీరు మా నుండి పొందిన ఋణ సౌకర్యములకు సంబంధించి-నిరర్ధక ఆస్తులుగా వర్గీకరణ.

అందరికీ సలహాలిచ్చే ప్రధాని నరేంద్ర మోడీ తన బాధ్యతలను మాత్రం విస్మరిస్తున్నారని సిపిఎం రాజ్యసభ ఎంపి జాన్ బ్రిట్టాస్ విమర్శించారు. రాజ్యాంగంపై రాజ్యసభలో మంగళవారం కూడా కొనసాగిన ప్రత్యేక చర్చలో ఆయన మాట్లాడారు. అల్లర్లతో అట్టుడుకుతున్న మణిపూర్‌ను ఏడాదిన్నరగా సందర్శించేందుకు ప్రధాని ఇప్పటికీ సిద్ధపడం లేదని పేర్కొన్నారు. రాజ్యాంగంపై చర్చ వినడానికి కూడా ఆయన ఇష్టపడడం లేదు. అందుకే పార్లమెంటుకు ముఖం చాటేస్తున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యం, సెక్యులరిజం, ఫెడరలిజం భారత రాజ్యాంగానికి మూలస్తంభాలని, బిజెపి అప్రజాస్వామికంగా ఫిరాయింపులను ప్రోత్సహిస్తోందని అన్నారు. మొత్తం 830 మంది ప్రజాప్రతినిధులు బిజెపిలోకి ఫిరాయించారన్నారు. దాంతో వారంతా 'పవిత్రులు' అయ్యారా అని ఎద్దేవా చేశారు. 95 ఏళ్ల విదేశీయుడు జార్జి సోరోస్‌పై బిజెపి వారం రోజులపాటు పార్లమెంట్‌ను అడ్డుకుందని, అయితే సోరోస్ డబ్బు ఎవరికి వస్తుంది? జెపిసి విచారణ జరిపితే ప్రధాని కార్యాలయం గుమ్మం వరకు చేరుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోందని పేర్కొన్నారు. సోరోస్ సంస్థకు భారతదేశం నుండి డబ్బు వెళ్తోందని, దీన్ని బిజెపి ఆపగలదా? ఆపే ఆలోచన బిజెపికి ఉందా? అని సూటిగా ప్రశ్నించారు. ఫెడరలిజాన్ని దెబ్బతీసే విధంగా బిజెపియేతర రాష్ట్ర ప్రభుత్వాలను అస్థిరపరిచేందుకు గవర్నర్‌గిరీని దుర్వినియోగం చేస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి గవర్నర్లు ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. 'ఒకే దేశం, ఒకే ఎన్నికలు' అనేది 'ఒకే దేశం, ఒకే నాయకుడు, ఒకే ఆలోచన'కు పొడిగింపు అని విమర్శించారు. దేశంలో అప్రకటిత అత్యవసర పరిస్థితి ఉందని జాన్ బ్రిట్టాస్ ఎత్తిచూపారు.

62 వేల మందికి లబ్ధి చేకూరడం లేదు

- పిఎం కిసాన్ పాలసీని ఐదేళ్లుగా కేంద్రం అప్ డేట్ చేయలేదు
- నరసరావుపేట ఎంపి లావు శ్రీకృష్ణ దేవరాయలు


ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పిఎం కిసాన్) పథకానికి సంబంధించి రాష్ట్రంలో 62 వేల మంది రైతులకు లబ్ధి చేకూరడం లేదని నరసరావుపేట ఎంపి లావు శ్రీకృష్ణ దేవరాయలు పేర్కొన్నారు. లోక్‌సభలో ఆయన ఈ అంశాన్ని మంగళవారం లేవనెత్తారు. 41.84 వేల మంది రైతులు అర్హులు ఉండగా, ప్రస్తుతం 41.22 వేల మందే లబ్ధి పొందుతున్నారని అన్నారు. దాదాపు 62 వేల మంది రైతులకు లబ్ధి జరగటం లేదని, అందుకు ఈ పాలసీని గత ఐదేళ్లుగా అప్‌డేట్ చేయకపోవటమే ప్రధాన కారణమని అన్నారు. 2018 డిసెంబర్ - 2019 ఏప్రిల్ వరకు భూములు ఎవరి పేరుపై ఉన్నాయో వారినే పిఎం కిసాన్‌లో పరిగణనలోకి తీసుకున్నారని అన్నారు. కానీ ఆ తరువాత చాలా మంది రైతులు గిఫ్ట్ డీడ్, విక్రయాలు, వారి పిల్లలకు ఇచ్చారని తెలిపారు. కేవలం అప్‌డేట్ జరగకపోవడం వల్లే అర్హులైన రైతులకు లబ్ధి జరగలేదని, ఎపిలోనే కాదని, ఇతర రాష్ట్రాల్లో కూడా ఈ పథకం విషయంలోనూ ఇదే పరిస్థితి ఉందని అన్నారు. ఈ డేటాను ఎప్పుడు అప్ డేట్ చేస్తారు? మిగతా రైతులకు ఎప్పుడు లబ్ధి చేకూరుస్తారు? అని ఆయన ప్రశ్నించారు.

కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ.. వికసిత్ భారత్ లక్ష్యంలో భాగంగా దేశ వ్యాప్తంగా కోటి మంది రైతులకు లబ్ధి చేకూరుస్తూ.. పిఎం కిసాన్ పాలసీని ప్రారంభించామని తెలిపారు. ఆ తరువాత మరో 25 లక్షలు మందిని ఈ పథకంలో చేర్చామని, భవిష్యత్‌లో అర్హులైన వారిని చేర్చే ప్రణాళికతో ఉన్నామని అన్నారు. ఈ పథకానికి సంబంధించిన కొన్ని వివరాలు రాష్ట్రాల నుండి అందలేదని, అవి రాగానే అప్ డేట్ చేస్తామని వివరణ ఇచ్చారు.

తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దర్యా నాయక్ మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



తెలంగాణ రాష్ట్రం జనగామ జిల్లా దేవరపుల మండలం ధర్మపురం గ్రామంలో దర్యా నాయక్ (107) మంగళవారం వయోభారంతో మృతి చెందారు. ఆయన భౌతికకాయంపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. దర్యా నాయక్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన సంతాపసభలో తమ్మినేని మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఫిరంగులై దేశ్‌ముఖ్ రాపాక రామచంద్రారెడ్డిని ఉరికించిన గొప్ప యోధుడు దర్యానాయక్ అని కొనియాడారు. దర్యా అన్న ఠానునాయక్ కూడా సాయుధ పోరాటంలోనే అమరుడయ్యాడని గుర్తుచేశారు. ఆ త్యాగాల కుటుంబంలో జన్మించిన గొప్ప వీరుడు దర్యా నాయక్ అని, అలాగే ఆయన పెద్ద కోడలు పూలమ్మతో పాటు సోదరులందరూ యుద్ధ వీరులై కదంతొక్కి రామచంద్రారెడ్డిని గడగడలాడించిన ఘనత ఈ కుటుంబానికే దక్కిందని తెలిపారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి అబ్బాస్, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు ధర్మానాయక్ పాల్గొన్నారు.

6 శాతం కేసుల్లోనే ఛార్జిషీట్

- నత్తనడకన మణిపూర్ హింసాకాండ కేసుల విచారణ

న్యూఢిల్లీ : మణిపూర్ హింసాకాండకు సంబంధించిన కేసుల విచారణ నత్తనడకన సాగుతోంది. ఈ కేసుల దర్యాప్తు కోసం సుప్రీంకోర్టు నియమించిన 42 ప్రత్యేక విచారణ బృందాలు (సిట్) కేవలం 6 శాతం కేసుల్లోనే ఛార్జిషీట్ దాఖలు చేశాయి. హత్య, అత్యాచారం, మహిళలపై లైంగిక నేరాలు, దగ్ధం, దోపిడీ, ఇతర హేయమైన చర్యలతో మొత్తం 3,023 కేసులు నమోదు కాగా, వీటిలో 192 కేసుల్లోనే ఇప్పటి వరకూ ఛార్జిషీట్లు దాఖలు కావడం ఆందోళన కలిగిస్తోంది. కేసుల విచారణ ప్రారంభమైందా? లేదా? అనే విషయం కూడా స్పష్టంగా తెలియడం లేదు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఇద్దరు కుకీ జో మహిళలపై లైంగిక వేధింపులు, నగ్నంగా ఊరేగించిన కేసు విచారణ ఇంకా ప్రారంభం కాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. 2023 మే 4న ఈ ఘటన జరిగితే వీడియో వైరల్‌గా మారిన రెండు నెలల తరువాత రాష్ట్ర పోలీసులు కేసు నమోదు చేశారు. తరువాత సిబిఐకి అప్పగించారు. ఈ కేసులో ఒక బాలుడుసహా ఆరుగురు నిందితులపై ఛార్జిషీట్ నమోదు చేసి గౌహతిలోని కోర్టులో గత ఏడాది జులైలో సిబిఐ దాఖలు చేసింది.



అయినా ఇంకా విచారణ ప్రారంభం కాలేదు.

గత ఏడాది ఆగస్టులో దేశవ్యాప్తంగా ఉన్న పోలీసు అధికారులను రప్పించి ఈ సిట్లను ఏర్పాటు చేశారు. ఈ ఏడాది నవంబర్ 20 వరకూ 574 నిందితులపై ఛార్జిషీటు దాఖలు చేశాయి. 384 మందిని అరెస్టు చేశాయి. భద్రతా దళాల నుంచి దోచుకున్న 501 ఆయుధాలను, 13,464 మందుగుండు సామాగ్రిని సిట్‌లు స్వాధీనం చేసుకున్నాయి. ఈ సిట్లను సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఆరు గ్రూపులుగా విభజించారు. హత్యలు, తీవ్రమైన నేరాల కేసుల విచారణకు సంబంధించి ఒక గ్రూపును, మహిళలపై అత్యాచారాలు, వేధింపుల కేసుల విచారణకు ఒక గ్రూపును ఏర్పాటు చేశారు. ఆస్తుల దగ్ధం, లూటీలు, ఇతర నేరాలకు మరో నాలుగు గ్రూపులను ఏర్పాటు చేశారు.

రాజ్యాంగ సవరణ అంత తేలికేమీ కాదు

- మూడింట రెండొంతుల మెజార్టీ అసాధ్యం
- జమిలి ఎన్నికల బిల్లు ఓటింగ్‌పై శశిథరూర్

న్యూఢిల్లీ : జమిలి ఎన్నికలపై లోక్‌సభలో బిల్లులను ప్రవేశపెట్టడంపై జరిగిన ఓటింగ్‌ను చూసినట్టైతే బిజెపికి రాజ్యాంగ సవరణ ఆమోదానికి అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ అధికార పక్షానికి లేదని స్పష్టమవుతోందని కాంగ్రెస్ ఎంపి శశి థరూర్ వ్యాఖ్యానించారు. పార్లమెంట్ ఆవరణలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కాంగ్రెస్ మాత్రమే ఈ బిల్లులను వ్యతిరేకించడం లేదని, మెజారిటీ ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్నాయని చెప్పారు. దీనికి కారణాలు కూడా చాలా వున్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కూలిపోతే రాష్ట్రప్రభుత్వం కూడా ఎందుకు కూలిపోవాలి? అని ఆయన ప్రశ్నించారు. ప్రజా తీర్పు పూర్తిగా వున్న వ్యక్తి పదవీ కాలం మరొకరి టైమ్ టేబుల్ వల్ల ఎందుకు కుదించబడాలని ఆయన ప్రశ్నించారు. ఇందులో అర్థం లేదన్నారు. పార్లమెంటరీ వ్యవస్థలో మీకు ఎలాంటి నిర్దేశిత పదవీ కాలాలు వుండవన్నారు. 'మన దేశంలో పార్లమెంటరీ వ్యవస్థ వుంది. భిన్నమైన సభలు వున్నాయి. భిన్నమైన మెజారిటీలు వున్నాయి. వేర్వేరు సంకీర్ణాలు వున్నాయి. ఇవన్నీ కూడా వివిధ కాలాల్లో పడిపోవచ్చు, లేవచ్చు. ఇది వాస్తవం. 1969లో నిర్దిష్ట పదవీకాలాలు ముగియడానికి ఇదే కారణమని' ఆయన అన్నారు. తన దృష్టిలో ఇదంతా అర్థం లేనిపని అని అన్నారు.

బహుళ ధ్రువ ప్రపంచమే లక్ష్యంగా

20ఏళ్ళ అల్బా-టిసిపి ప్రస్థానం



కారకాస్ : బహుళ ధ్రువ ప్రపంచ నిర్మాణమే లక్ష్యంగా అల్బా-టిసిపి (బొలివేరియన్ అలయన్స్ ఫర్ ది పీపుల్స్ ఆఫ్ అవర్ అమెరికా-పీపుల్స్ ట్రేడ్ ట్రియటీ) ఏర్పడింది. ఇది ప్రజల కోసం వారి ప్రయోజనాల కోసం ఏర్పడిన కూటమి మాత్రమే, అంతేకానీ ఆధిపత్య రాజకీయ, ఆర్థిక సంపన్నుల కోసం ఏర్పడింది కాదని అల్బా-టిసిపి కార్యదర్శి జార్జి అరెజా వ్యాఖ్యానించారు. మరే అంతర్జాతీయ సంస్థ మాదిరిగా కాకుండా ఈ సంస్థ నిర్దిష్ట కార్యాచరణ ద్వారా తన ప్రధాన లక్ష్యాలను నెరవేరుస్తోంది, విజయాలను సాధిస్తోంది. ప్రజలు, వారి సంక్షేమం ఈ సంస్థ కీలక లక్ష్యంగా వుంది. ప్రపంచంలో మరే కూటమి ఈ రీతిన లేదు. పెట్టుబడిదారీవాదానికి, నయా ఉదారవాదానికి కచ్చితమైన ప్రత్యామ్నాయ ప్రతిపాదనే ఈ కూటమి అని వెనిజులా అధ్యక్షుడు చావెజ్ చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాల్సి వుంది.

ఈ ప్రాంతీయ సమగ్ర యంత్రాంగం ఏర్పడి ఇప్పటికి 20ఏళ్లు పూర్తయ్యాయి. "మనందరం సమైక్యంగా వుండాలన్న భావనను అర్థం చేసుకోలేకపోతే ఏ దేశాలైనా అవి ఎంత పెద్దవైనా సరే స్వతంత్రంగా, సంపద్వంతంగా వుండలేవు. బహుళ ధ్రువ ప్రపంచానికి ఇది చాలా అవశ్యం. లాటిన్ అమెరికా, కరేబియన్ దేశాలు కలిపితే అత్యంత శక్తివంతమైన ధ్రువాల్లో ఒకటిగా వుంటాయి." అని అరెజా వ్యాఖ్యానించారు. అప్పటి క్యూబా అధ్యక్షుడు ఫైడెల్ కాస్ట్రో, వెనిజులా అధ్యక్షుడు హ్యూగో చావెజ్‌లు సంయుక్త డిక్లరేషన్‌పై సంతకాలు చేయడం ద్వారా 2004 డిసెంబరు 14న అల్బా-టిసిపిని క్యూబా రాజధాని హవానాలో ఏర్పాటైంది. పది సభ్య దేశాలు కాగా, నాలుగు దేశాలు ప్రత్యేక అతిథి దేశాలుగా వున్నాయి. ఈ సందర్భంగా అరెజా ఒక సందేశం విడుదల చేశారు. ఈ 20ఏళ్ల కాలంలో ఈ కూటమిలోని సభ్య దేశాలైన వెనిజులా, బొలీవియా, ఈక్వెడార్, హోండూరస్, నికరాగ్వా, క్యూబాలు సామ్రాజ్యవాద శక్తుల కుట్రలు, కుతంత్రాలకు బలయ్యాయి. సామ్రాజ్యవాద దేశాల ఆంక్షలు, జోక్యందారీ విధానాలతో ఈనాటికీ అనేక ఇక్కట్లు పడుతున్నాయని ఆ సందేశం పేర్కొంది. అల్బా-టిసిపి 20వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక టెలివిజన్ కార్యక్రమంలో అరెజా మాట్లాడారు. బహుళ ధృవ ప్రపంచాన్ని మరింత సంఘటితం చేసేందుకు ప్రజలకు ఈ సంస్థ మార్గాన్ని సుగమం చేసిందన్నారు.

మరింత మెరుగైన పంథాను మానవాళి ఎంపిక చేసుకోగలదని అల్బా-టిసిపి దృఢంగా విశ్వసిస్తుందని చెప్పారు. మన ప్రజలకు అంతిమ లక్ష్యం బహుళ ధ్రువ ప్రపంచ ఏర్పాటేనని స్పష్టం చేస్తోందన్నారు. ప్రజల సుఖ సంతోషాల కోసం అవసరమైన రాజకీయ, ఆర్థిక శక్తి సామర్థ్యాలను మనం సముపార్జించుకోవాల్సి వుందన్నారు. గాజాలో, లెబనాన్‌లో ఇజ్రాయిల్ మారణహోమాన్ని, ఊచకోతను వెంటనే ఖండించిన అంతర్జాతీయ సంస్థ అల్బా-టిసిపినే అని అరెజా చెప్పారు.

శాశ్వత అతిథిగా పాలస్తీనా

20ఏళ్ల ప్రస్థానానికి గుర్తుగా సామాజిక ఉద్యమాలు, రాజకీయ పార్టీలు, దేశాధినేతలందరూ కారకస్‌లో ఈ నెల 14న సమావేశమయ్యారు. వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురో సారథ్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రత్యామ్నాయ అభివృద్ధి పంథాలను కోరుకుంటున్న దేశాల మధ్య సంఘీభావం ప్రాముఖ్యతను ఈ సమావేశం నొక్కి చెప్పింది. సామ్రాజ్యవాద దాడులకు వ్యతిరేకంగా పోరాడే ప్రజల మధ్య ఎలాంటి హద్దులు లేని సమైక్యత, సంఘీభవం అవశ్యమని స్పష్టం చేసింది. పాలస్తీనాను కూడా సోదర దేశంగా తమలో చేర్చుకున్నట్లు ప్రస్తుత సమావేశంలో ప్రకటించారు. శాశ్వత అతిథిగా చేర్చారు. ఈ మేరకు ఒక తీర్మానం ఆమోదించారు. పాలస్తీనియన్ల ఊచకోతను వారు తీవ్రంగా ఖండించారు. అక్రమంగా భూభాగాలను ఇజ్రాయిల్ ఆక్రమించుకోవడాన్ని తీవ్రంగా నిరసించారు. ఈ సందర్భంగా పాలస్తీనా వ్యవహారాల సలహాదారు రియాద్ అల్ మల్కి మాట్లాడుతూ, న్యాయం పక్షాన నిలుచున్న వారిని చరిత్ర ఎన్నటికీ గుర్తుంచుకుంటుందని వ్యాఖ్యానించారు.

చివరగా మరింత సమాన అవకాశాలు కల ప్రపంచం కోసం జరిపే పోరాటంలో అల్బా-టిసిపి చారిత్రక ప్రాధాన్యతను ప్రముఖంగా తెలియజేస్తూ సభ్య దేశాలు సంయుక్త డిక్లరేషన్‌పై సంతకాలు చేశాయి. సమగ్ర అభివృద్ధి, సామాజిక సమానత్వానికి హామీ కల్పించడం, నాణ్యత గల జీవితాన్ని అందించడం, స్వాతంత్ర్యం, స్వయం నిర్ణయాధికారం, ప్రజల గుర్తింపునకు హామీ కల్పించేందుకు దోహదపడడం అల్బా-టిసిపి వ్యవస్థాపక లక్ష్యాలని ఆ సంస్థ అధికార వెబ్‌సైట్ పేర్కొంది.

అక్రమ డిప్యుటేషన్లు రద్దు చేయాల్సిందే

- ఐటిడిఎ వద్ద ఉపాధ్యాయుల నిరసన

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో అక్రమ డిప్యుటేషన్లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు మంగళవారం పార్వతీపురంలోని ఐటిడిఎ ప్రాజెక్టు కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్‌రావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోట రమేష్, కె.భాస్కరరావు మాట్లాడుతూ గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల పోస్టులను డిఎస్‌సి నుంచి మినహాయించాలని డిమాండ్ చేశారు. ఐటిడిఎ పరిధిలో సుమారు 66 మంది ఉపాధ్యాయులను గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల నుంచి సుదూర ప్రాంతాలకు డిప్యుటేషన్లు వేశారని, ఇది చాలా అన్యాయమని పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో ఇలాంటి నిర్ణయాలు ఇక్కడ విద్యార్థుల చదువుకు నష్టం కలిగే అవకాశం ఉందని తెలిపారు. ఇతర జిల్లాలకు వేసిన డిప్యుటేషన్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల్లో పనిచేస్తున్న సిఆర్‌టిలను డిఎస్‌సిలో చూపడం సరికాదన్నారు. తమ న్యాయమైన కోర్కెలు అమలు చేయకుంటే భవిష్యత్తులో గిరిజన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం డిప్యూటీ డిఇఒ చిన మోహన్ రాయుడుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సిఐటియు పట్టణ నాయకులు బంకురు సూరిబాబు, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు, ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ నాయకులు సంఘీభావం తెలిపారు.

ఆమె మేజర్ ... ఆమె ఇష్టం!

- లెస్బియన్ సంబంధంపై హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

'ఆమె మేజర్. అందువల్ల తన అభీష్టానికి అనుగుణంగా తాను వ్యవహరించవచ్చు' అని లెస్బియన్ సంబంధంపై దాఖలైన ఒక పిటిషన్‌లో హైకోర్టు పేర్కొంది. తనతో సహజీవనం చేస్తున్న స్నేహితురాలిని ఆమె తండ్రి నిర్బంధించారంటూ ఎన్‌టిఆర్ జిల్లాకు చెందిన ఒక మహిళ దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌ను జస్టిస్ రావు రఘునందన్‌రావు, జస్టిస్ కుంచం మహేశ్వరరావుతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం విచారణ జరిపింది. ధర్మాసనం ఆదేశాలతో అపహరణకు గురైన మహిళను పోలీసులు మంగళవారం హైకోర్టులో హాజరుపర్చారు. న్యాయమూర్తులు తమ ఛాంబర్‌లమా మహిళతో విడిగా మాట్లాడారు. అనంతరం ఆమె మేజర్ కాబట్టి ఆమె అభీష్టానికి అనుగుణంగా వ్యవహరించే స్వేచ్ఛ ఆమెకు ఉందని తేల్చారు. అంతకుముందు పిటిషనర్ తరపు జడా శ్రవణ్ కుమార్ వాదిస్తూ, లెస్బియన్ సంబంధం చట్టబద్ధమని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన విషయాన్ని ధర్మాసనం ముందుకు తీసుకువచ్చారు. అందువల్ల ఆమెను నిర్బంధించడం చెల్లదని వాదించారు.

న్యూయార్క్ కోర్టులో ట్రంప్‌నకు ఎదురు దెబ్బ

న్యూయార్క్ : తనపై నమోదైన హుష్ మనీ కేసును కొట్టివేయాల్సిందిగా అధ్యక్షుడిగా ఎన్నికైన ట్రంప్ చేసిన విజ్ఞప్తిని మన్‌హటన్ న్యాయమూర్తి జువాన్ మర్చన్ తిరస్కరించారు. అధ్యక్షుడికి రక్షణ కల్పిస్తూ జులైలో అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన రూలింగ్‌ను దృష్టిలో పెట్టుకుని తనపై అభియోగాలను కొట్టేయాలని ట్రంప్ కోరారు. అధికారిక చర్యలకు సంబంధించే ఈ రక్షణ వుంటుంది తప్ప అనధికార వ్యవహార శైలికి సంబంధించిన అంశాల్లో ఎలాంటి రక్షణ వుండదని న్యాయమూర్తి స్పష్టం చేశారు. పోర్న్ స్టార్‌కు డబ్బులు ఇవ్వడం(దీనినే హుష్ మనీ) కేసులో ట్రంప్ దోషి అని ఇప్పటికే కోర్టు తేల్చింది. ఆయనకు విధించాల్సిన శిక్షను ఖరారు చేయాల్సి వుంది. ఒకవేళ ఇదే గనుక జరిగితే శిక్ష అభియోగాలను ఎదుర్కొంటూ అధ్యక్షుడిగా శ్వేత సౌధంలో అడుగుపెట్టే తొలి అధ్యక్షుడు ట్రంప్ కానున్నారు. ఇదిలావుండగా, న్యాయమూర్తి మర్చన్ నిర్ణయాన్ని ట్రంప్ కమ్యూనికేషన్ డైరెక్టర్ స్టీవెన్ చెంగ్ విమర్శించారు. ఇది సుప్రీంకోర్టు నిర్ణయాన్ని ఉల్లంఘించడమే కాగలదని తప్పుబట్టారు. ఈ కేసును తక్షణమే కొట్టేయాల్సి వుందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మాస్కోలో పేలుడు

- రష్యా ఉన్నత స్థాయి సైనిక జనరల్ సహా ఇద్దరు మృతి

మాస్కో : రష్యా రాజధాని మాస్కోలో మంగళవారం జరిగిన బాంబు దాడిలో అత్యంత సీనియర్ మిలటరీ నేత, రష్యా ఆర్మీకి చెందిన రసాయన ఆయుధాల విభాగాధిపతి ఇగర్ కిరిలోవ్ మరణించారు. ఈ బాంబు దాడి జరిపింది తామేనని ఉక్రెయిన్ ప్రకటించింది. ఆగ్నేయ మాస్కోలో ఒక అపార్ట్‌మెంట్ భవనం వెలుపల నిలిపి వుంచిన స్కూటర్‌లో పేలుడు పదార్థం పెట్టారు. దాన్ని పేల్చివేయడంతో ఇగర్ కిరిలోవ్ ఆయన అసిస్టెంట్ చనిపోయారని అధికారులు తెలిపారు. ఉక్రెయిన్‌లో రష్యా బలగాలు విజయం సాధించాయని అధ్యక్షుడు పుతిన్ చెప్పుకున్న మరుసటి రోజే రాజధానిలోని నివాస ప్రాంతంలో ఈ దాడి జరగడం గమనార్హం. రష్యా సైన్యంలో రసాయన, జీవ, రేడియోలాజికల్ ఆయుధాల విభాగానికి కిరిలోవ్ (54) నేతృత్వం వహిస్తున్నారు. కిరిలోవ్‌ను యుద్ధ నేరస్తుడిగా ప్రకటిస్తూ స్పెషల్ ఆపరేషన్‌లో భాగంగానే ఈ పేలుడు జరిపినట్లు ఉక్రెయిన్‌కి చెందిన ఎస్‌బియు సెక్యూరిటీ సర్వీస్ వర్గాలు తెలిపాయి. పేలుడు ధాటికి ఆ భవనంలోని పలు కిటికీల అద్దాలు పగిలిపోయాయి. ముందు తలుపు దారుణంగా దెబ్బతింది. ఈ దాడిని తీవ్రవాద చర్యగా రష్యా అధికారులు పేర్కొన్నారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నామన్నారు. యుద్ధ రంగంలో నిషేధించిన రసాయన ఆయుధాలను ఉక్రెయిన్‌పై వినియోగించారని, ఆ రకంగా కిరిలోవ్ యుద్ధ నేరస్తుడని ఉక్రెయిన్ చెబుతోంది. యుద్ధ నేరాలకు ప్రతీకారం తప్పదని ఆ వర్గాలు హెచ్చరించాయి.

జమిలిపై ఫైర్

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. మనీష్ తివారీ, గౌరవ్ గొగొయ్ (కాంగ్రెస్), అమ్రారామ్ (సిపిఎం), ధర్మేంద్ర యాదవ్ (ఎస్‌పి), టిఆర్ బాలు (డిఎంకె), కల్యాణ్ బెనర్జీ (టిఎంసి), సుప్రియా సూలే (ఎన్‌సిపి), అనిల్ దేశాయ్ (శివసేన ఠాక్రే), మహ్మద్ బషీర్ (ఐయుఎంఎల్), అసదుద్దీన్ ఒవైసీ (ఎంఐఎం), ఎన్‌కె ప్రేమ్‌చంద్రన్ (ఆర్‌ఎస్‌పి) వంటి ప్రతిపక్ష ఎంపిలు తీవ్రంగా వ్యతిరేకించారు. టిడిపి, శివసేన షిండే వర్గం బిల్లుకు మద్దతు పలికాయి. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు, పెమ్మసాని చంద్రశేఖర్ (టిడిపి), శ్రీకాంత్ ఏక్‌నాథ్ షిండే (శివసేన షిండే) బిల్లుకు మద్దతు తెలుపుతూ మాట్లాడారు. ఎన్‌డిఎ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న జెడియు నుంచి ఎవరూ బిల్లుకు మద్దతుగా మాట్లాడలేదు.

ఫెడరలిజానికి వ్యతిరేకం

'ఒకే దేశం, ఒకే ఎన్నికలు' అనే భావన రాజ్యాంగంలోని ఫెడరలిజంతో సహా ప్రాథమిక సూత్రాలకు విరుద్ధమని ప్రతిపక్ష సభ్యులు విమర్శించారు. 'బిల్లులోని నిబంధనలు శాసన వ్యవస్థ అధికార పరిధిని ఉల్లంఘించేవిగా ఉన్నాయన్నారు. లోక్‌సభ పదవీకాలం ప్రకారం శాసన సభల పదవీకాలం నిర్ణయించబడదు. చట్టసభలు విడివిడిగా ఉంటాయి. ఈ బిల్లుతో అధిక కేంద్రీకరణ అమలులోకి వస్తుంది. సభల కాలవ్యవధి, ఎన్నికలు ఎప్పుడు నిర్వహించాలనే అధికారాలను ఎన్నికల కమిషన్‌కే వదిలేస్తున్నారు. అలా అయితే ఒక వ్యక్తి కోరిక నెరవేర్చడం కోసమే ఈ బిల్లులను పెట్టినట్లు ఉంటుంది' అని ప్రతిపక్ష ఎంపీలు విమర్శించారు. సమగ్ర అధ్యయనం, విస్తృత చర్చల తర్వాతే బిల్లు తీసుకొచ్చామని మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ తెలిపారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ప్రభుత్వం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసిందని చెప్పారు. కమిటీ రాజకీయ పార్టీల అభిప్రాయాలను కూడా కోరిందని, 31 పార్టీలు అనుకూలంగా నిలిచాయని, 15 పార్టీలు వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. బిల్లులు కేబినెట్ పరిశీలనకు వచ్చినప్పుడే దీనిని జెపిసి పరిశీలనకు వదిలేయాలని ప్రధాని చెప్పారని హోం మంత్రి అమిత్ షా సెలవిచ్చారు.

రాష్ట్రాల హక్కులను ఎలా లాక్కొంటారు? అమ్రారామ్, సిపిఎం

సిపిఎం ఎంపి అమ్రారామ్ మాట్లాడుతూ ఈ బిల్లును తమ పార్టీ వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. ఈ బిల్లుతో దేశ గణతంత్ర రాజ్యాన్ని ఖూనీ చేస్తున్నారని విమర్శించారు. గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్, మున్సిపాలిటీ... రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించినవని, కానీ ఈ బిల్లుతో ఇవన్నీ కేంద్ర ప్రభుత్వ పెత్తనం కిందికి వెళ్లిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో ఒక్కో రాష్ట్రం ఒక్కో రకమైన భాష, తమదైన అధికార వికేంద్రీకరణ కలిగి ఉన్నాయని, వాటిపై రాష్ట్రాలకు గల హక్కును కేంద్రం ఎలా లాక్కొంటుందని విమర్శించారు. కేవలం పాసిస్ట్ అజెండాలో భాగంగానే ఈ బిల్లును తీసుకొస్తున్నారని విమర్శించారు.

బిల్లుకు మద్దతు ఇస్తున్నాం : పెమ్మసాని చంద్రశేఖర్, టిడిపి

కేంద్ర మంత్రి ఎంపి పెమ్మసాని చంద్రశేఖర్ (టిడిపి) మాట్లాడుతూ, తమ పార్టీ నేత చంద్రబాబు నాయుడు ట్రాన్స్‌ఫార్మింగ్ ఆలోచనలకు ఛాంపియన్ అని, మంచి విజన్ కలిగిన నాయకుడని, ఆయన మార్గదర్శకత్వంలో ఈ బిల్లుకు మద్దతు ఇస్తామని చెప్పారు. జమిలి ఎన్నికల వల్ల ఎన్నికల వ్యయం తగ్గుతుందని, ఎన్నికలకు రాజకీయ పార్టీలు లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాయని పేర్కొన్నారు. ఆయన మాట్లాడినంత సేపు ప్రతిపక్ష ఎంపీలు తమ స్థానాల్లో లేచి ఆందోళన వ్యక్తం చేశారు.

దక్షిణ కొరియా అధ్యక్షుడికి రెండోసారి సమన్లు

- హాజరు కాకపోతే ఇక అరెస్టే!

సియోల్ : ఈ నెల ఆరంభంలో దేశంలో సైనిక పాలన విధించడంపై జరుగుతున్న విచారణలో సాక్ష్యమిచ్చేందుకు రావాల్సిందిగా దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌కు ఆ దేశ ప్రాసిక్యూషన్ సర్వీస్ రెండోసారి సమన్లు జారీ చేసింది. ఈనెల 21లోగా హాజరు కాని పక్షంలో అరెస్టు వారెంటు జారీ చేసే అంశాన్ని పరిశీలించాల్సి ఉంటుందని హెచ్చరించింది. డిసెంబరు 3న చోటు చేసుకున్న సంఘటనలపై ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ జరుపుతోంది.

ఈ బృందం సోమవారం అధ్యక్షుడికి సమన్లు జారీ చేసింది. గత ఆదివారం అధ్యక్షుడిని విచారించాల్సి వుంది, కానీ ఆయన హాజరు కాకపోవడంతో రెండోసారి సమన్లు పంపింది. యూన్ ఈ విచారణకు హాజరైనట్టైతే, అధికారంలో వుంటుండగా దర్యాప్తునకు సిద్ధమైన మొదటి దక్షిణ కొరియా అధ్యక్షుడవుతారు. ఒకవేళ అరెస్టు వారెంటు జారీ చేయాలని ప్రాసిక్యూషన్ నిర్ణయిస్తే, అరెస్టు కాబోయే ఆసియా దేశపు మొదటి సిట్టింగ్ అధ్యక్షుడవుతారు. యూన్‌ను శనివారం పార్లమెంట్ అభిశంసించింది. పాలక కన్జర్వేటివ్ పీపుల్ పవర్ పార్టీ (పిపిపి)కి చెందిన 12మంది డిప్యూటీలు అనుకూలంగా ఓటు వేశారు. ప్రధాని హన్ డక్ సూ ప్రస్తుతం తాత్కాలిక అధ్యక్షుడిగా వున్నారు. రాజ్యాంగ కోర్టు నిర్ణయంపైనే ఆయన భవితవ్యం ఆధారపడి వుంది. దేశంలో మార్షల్ లా విధించడం ద్వారా అధ్యక్షుడు రాజ్యాంగాన్ని ఉల్లంఘించారా? లేదా? అని నిర్ణయించడానికి కోర్టుకు ఆరు మాసాల గడువు వుంది.

గ్రామీణ ప్రాంతాల్లో సేవలందించండి

(మొదటి పేజీ తరువాయి)

అవసరాల కోసం మరో 10 ఎకరాలు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. రూ.1,618 కోట్ల వ్యయంతో 960 బెడ్లతో నిర్మించడం జరిగిందని, అప్రోచ్ రోడ్లు, విద్యుత్, నీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాలు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి ప్రతాప్‌రావు జావేద్ మాట్లాడుతూ వైద్య సేవలు, సదుపాయాలలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువస్తున్నట్లు చెప్పారు. మారుమూల గ్రామాల్లోని ప్రజలకు వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, రాష్ట్ర మానవవనరుల శాఖ మంత్రి నారా లోకేష్ వేదికపై ఉన్నారు. అంతకుముందు వైద్య విద్యను పూర్తి చేసిన విద్యార్థులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పతకాలు, ధృవీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, సిఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్, వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



మీకోసం

కర్పూరాన్ని నువ్వులనూనెలో కరిగించి దాన్ని తల, ఛాతీ, పాదాలకు మర్దన చేస్తే జలుబు, దగ్గు నుంచి ఉపశమనం కలుగుతుంది.

జీవన సౌరభం

ఏ పొరపాటూ చేయట్లేదంటే ... కొత్తగా ఏదీ ప్రయత్నించట్లేదన్న మాట.

JEEVANA జీవన the family

చిక్ బుక్ రైలు



చిక్ బుక్ రైలు వచ్చింది
స్టేషన్లో ఆగింది
చక చక కొందరు దిగారు
టక టక మరెందరో ఎక్కారు

చిన్ని కూడా ఎక్కింది
కిటికీ సీట్లో కూర్చుంది
కూత పెట్టి రైలు బయలుదేరింది
చిన్ని టాటా చెప్పింది

రైలు పరుగులు పెట్టింది
చిన్ని కేరింతలు కొట్టింది
కదిలే చెట్టు, పుట్టను చూసింది
ఆశ్చర్యంగా నాన్నను అడిగింది

రైలు ముందుకు వెళుతుంటే
చెట్టు పుట్ట కదలక పోయినా
మన కళ్ళకు మనతో వొస్తున్నట్లె
అనిపిస్తాయని
చిన్నికి నాన్న చెప్పారు

భలే భలే అంటూ నవ్వింది
మరలా కిటికీకి
అతుక్కుపోయింది
వాగు వంక కొండ కోన చూసింది
చక్కని యాత్రను చేసింది!

– మొర్రి గోపి,
88978 82202.

విశ్వ సంగీత మానవుడు ...

జాకీర్ హుస్సేన్.. ప్రపంచ ప్రసిద్ధ తబలా విద్వాంసుడు మాత్రమే కాదు; గొప్ప మానవతావాది కూడా! సంగీతానికి సరిహద్దులు, కులమత బేధాలూ ఉండరాదని చాటిన జాకీర్ భారత్‌లో పుట్టి, దేశ ఖ్యాతిని ప్రపంచ నలుదిశలా వ్యాపింపజేశాడు. అతడు ఎక్కడ ఉంటే అక్కడ ఆహ్లాదకర వాతావరణం ఉండేది. మతమంటే ఒకరిపై జబర్దస్తీ చేసేది కాదు. సాటి మనుషులను ప్రేమించడమని చెప్పిన గొప్ప మానవతావాది ఆయన. విశ్వఖ్యాతి గడించిన తండ్రిని మించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు సాధించుకున్న గొప్ప కొడుకు, నిరంతర సాధకుడు. స్నేహితుని మరణవార్తతో మనసంతా వికలమై, చితిమంటల్లో కాలిపోతున్న మిత్రుడి భౌతికకాయాన్ని చూసి మౌనంగా రోదించిన ప్రాణ స్నేహితుడు. ప్రేమించి పెళ్లి చేసుకున్న జీవిత సహచరిని జీవితాంతం అమితంగా ఆరాధించిన ప్రేమికుడు.



జాకీర్ 1951లో ముంబయిలో పుట్టాడు. ప్రముఖ తబలా విద్వాంసుడు ఉస్తాద్ అల్లా రఖా పెద్ద కొడుకు. అందుకే జాకీర్‌కి సంగీతం ఎప్పటి నుంచి తెలుసంటే.. పుట్టినప్పటి నుంచీ అని చెప్పాలి. విద్వాంసుడి కొడుకైన జాకీర్ ఓనమాలు దిద్దకుండానే తబలాపై సాధన చేశాడు. తండ్రికి కొడుకుని గొప్ప విద్వాంసుడిగా చూడాలని కోరిక. తల్లి మాత్రం ఇంజినీర్‌గా, డాక్టరుగా చూడాలని అనుకునేది. జాకీర్‌కేమో రాక్‌స్టార్‌గా ఎదగాలని ఆశ. అప్పట్లో జాకీర్ రాక్ మ్యూజిక్ వింటూ, జీన్స్ ప్యాంట్లు వేసుకునేవాడని చాలా తక్కువమందికే తెలుసు. ఇంత వైవిధ్యంగా సాగిన జాకీర్ బాల్యం నుంచే అన్ని మతములు సమానమని నమ్మేవాడు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండడం నేర్చుకున్నాడు. 'అద్దంలో నన్ను నేను చూసుకుంటే అన్నీ తెలుసన్న గర్వం ఉండకూడదనిపించేది. ఎప్పుడూ విద్యార్థిగా ఉండాలని అనుకునేవాణ్ణి' అని ఓ సందర్భంలో ఆయన చెప్పారు.

న్యూస్‌పేపర్లపై పడుకునేవాడు..

'ప్రపంచ సంగీతం'గా అభివర్ణించేంత ఎత్తుకు ఎదిగిన జాకీర్, సాంప్రదాయ శాస్త్రీయ సంగీత కచేరీల్లో తన పేరును చిరస్మరణీయం చేసుకున్నారు. కొత్త శబ్దాలు కనుగొనాలనే అతని తపన తబలాని భారతదేశ గొప్ప సాంస్కృతిక ఎగుమతుల్లో ఒకటిగా చేసిందంటే అతిశయోక్తికాదు. కచేరీల్లో పాల్గొనే తొలినాళ్లల్లో రైలు ప్రయాణాలు చేసేవాడు. సీటు దొరక్కపోతే, న్యూస్‌పేపర్లు కింద పర్చుకుని వాటిపై పడుకునేవాడు. తబలాని మాత్రం ఎప్పుడూ తన ఒడిలోనే పెట్టుకునేవాడు. వాయిద్యాన్ని అంతలా ప్రేమించాడు.

మొదటి సంపాదన రూ.5

12 ఏళ్లప్పుడు తండ్రితో కలసి జాకీర్ ఓ కచేరీలో పాల్గొన్నాడు. సంగీత విద్వాంసులు రవిశంకర్, ఉస్తాద్ అలీ అక్బర్ ఖాన్, బిస్మిల్లా ఖాన్, పండిట్ శాంతా ప్రసాద్, పండిట్ కిషన్ మహారాజ్ వంటి అతిరథమహారథులు ఆ కచేరీలో ఉన్నారు. వారి మధ్య చిన్నారి జాకీర్ చేసిన ప్రదర్శనకి గాను తండ్రి అతనికి రూ.5 పారితోషికం ఇచ్చాడు. 'నా జీవితంలో నేను ఎంతో సంపాదించాను. కానీ నా మొదటి ఐదు రూపాయలు చాలా విలువైనవి' అని ఆయన ఓ సందర్భంలో చెప్పారు.

జాకీర్, ఆంటోనియాని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఈ పెళ్లి ఆయన తల్లికి ఇష్టం లేదు. 'ఇది మాలో మొదటి మిశ్రమ వివాహం. మా పెళ్లికి తండ్రి అంగీకరించినా తల్లికి మాత్రం చాలా కష్టమైంద'ని ఆయన ఓ సందర్భంలో గుర్తుచేసుకున్నారు. తల్లిని ఒప్పించే బాధ్యతని తండ్రి తీసుకున్నారని కూడా వెల్లడించారు. ఆంటోనియాతో తల్లి పరిచయం పెరిగినకొద్దీ మతం కంటే వ్యక్తులతో పెనవేసుకున్న బంధం గొప్పదని ఆమె అంగీకరించినట్లు ఆయన చెప్పారు.

ప్రకృతిలో సంగీత స్వరం!

సంగీతమే ప్రపంచంగా చాలామంది జీవిస్తారు. జాకీర్ జీవితం అందుకు ఓ ఉదాహరణ. జాకీర్ చివరిసారి సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లో పోస్టు చేసిన ఓ వీడియో చూస్తే అది నిజమనిపిస్తుంది. హోరుగాలికి ఊగులాడుతున్న ఓ ఎర్రని పూలచెట్టు, దానిపక్కనే పచ్చని చెట్లు అటూఇటూ కదులుతూ ఉంటాయి. వాటి నుండి వచ్చే శబ్దంలో సంగీతం వినమని చెబుతారు జాకీర్. ఆయన చుట్టూ జరుగుతున్న ప్రతి విషయంలో సంగీతాన్ని చూసే గొప్ప సంగీత ప్రేమికుడు ఆయన. జాకీర్ ప్రయాణంలో ఎన్నో అవార్డులు, ప్రశంసలు.. వేటికవే ప్రత్యేకమైనవి. ప్రముఖమైనవి. వాటిన్నిటికీ మించి మానవత్వంతో, సౌభ్రాతృత్వంతో పరిమళించిన గొప్ప సంగీత మానవుడు జాకీర్ హుస్సేన్.



ఎప్పటినుండో పరిచయంలా ...

ఆంటోనియాతో జాకీర్ పరిచయం చాలా విచిత్రంగా జరిగింది. 'నాకు భారతీయ శాస్త్రీయ సంగీతం గురించి పెద్దగా తెలియదు. అధ్యయనం చేసేందుకు అలీ అక్బర్ ఖాన్‌ని కలవాలని వెళ్లాను. అక్కడే జాకీర్‌ని చూశాను. చూడగానే చాలా మృదుస్వభావిలా అనిపించాడు. అప్పుడే చూస్తున్నా, ఎప్పటి నుండో తెలిసినవాడిలా అనిపించాడు' అని తమ మొదటి పరిచయాన్ని ఆంటోనియా ఒక సందర్భంలో వివరిస్తారు. ఆంటోనియా ఇటాలియన్, అమెరికన్ సంతతికి చెందినవారు. కథక్ డ్యాన్సర్. ఏడేళ్లు సహజీవనం చేసిన తరువాత జాకీర్, ఆంటోనియని పెళ్లిచేసుకున్నారు. జాకీర్, ఆంటోనియాకి అనిసా ఖురేషి, ఇసాబెల్లా ఖురేషి అనే ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

స్నేహమంటే ఇదేరా..

జాకీర్ గురించి చెప్పుకునేటప్పుడు అతనిలోని గొప్ప స్నేహితుణ్ణి కచ్చితంగా గుర్తు చేసుకోవాలి. 2022 మే 10న పండిట్ శివశంకర్ శర్మ చనిపోయారు. ఆయన అంత్యక్రియలకు జాకీర్ హాజరయ్యారు. పండిట్ కుటుంబసభ్యులు, స్నేహితులు, అధికారులు ఎంతో గౌరవంగా ఆయనకి నివాళులు అర్పించి వెనుదిరిగారు. జాకీర్ మాత్రం అంత్యక్రియలు అయ్యేంత వరకూ అక్కడే ఉన్నాడు. స్నేహితుని చితి వంక తదేకంగా చూస్తూ అక్కడే నిల్చుండిపోయాడు. అప్పటికే జాకీర్ మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్నాడు. తన అనారోగ్యాన్ని లెక్కచేయకుండా అంత్యక్రియలు చివరివరకు పాల్గొనడమే కాక, ఆఖరివరకూ మిత్రుడిని ఒంటరిగా వదిలి రాలేకపోయిన స్నేహశీలి ఆయన. ఈ సందర్భంగా విడుదలైన ఫొటోపై ఆయన అభిమాని ఒకరు ఇలా స్పందించాడు : 'ఉస్తాద్ జాకీర్, పండిట్ శివశంకర్ అనేక దశాబ్దాలుగా ఒకే వేదికపై సంగీతంలో ఎన్నో మ్యాజిక్‌లు సృష్టించారు. ఇప్పుడు వాళ్ల స్నేహాన్ని గురించి చెప్పడానికి ఈ ఫొటోని మించింది లేదు' అంటూ రాశారు.

రంగవల్లులకు స్వాగతం!

సంక్రాంతి పండుగ హడావిడిలో ముగ్గులది ప్రత్యేక స్థానం. మరి ఇంకెందుకు ఆలస్యం? చకచకా ముగ్గులు వేసేయండి. 'జీవన' పాఠకులతో పంచుకోండి. తెల్ల కాగితంపై పెన్సిల్ లేదా బాల్‌పాయింట్ పెన్నుతో వేసిన ముగ్గులకు రంగులు నింపి పంపండి. అందరికీ అర్థమయ్యేలా నిలువు, అడ్డం చుక్కల వివరాలు కూడా పేర్కొనండి. మీ పేరు, చిరునామా, ఫొటో, ఫోన్ నెంబరు కచ్చితంగా పంపాలి. మెయిల్ ద్వారా పంపేవారు పూర్తి చిరునామా పంపాలి.

మా చిరునామా

రంగవల్లి
ప్రజాశక్తి దినపత్రిక
ప్రజాశక్తి భవనం, అరవింద హై స్కూలు దగ్గర,
అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి – 522501, గుంటూరు జిల్లా.
మెయిల్ ఐడి :
jeevanapageps@gmail.com
వాట్సాప్ : 83329 25496

చాలా బీట్స్ నేర్చుకున్నాను ...



హాయ్ ఫ్రెండ్స్,


నేను మా స్కూల్లో చదువుతోపాటు కాంగో డ్రమ్స్ కూడా నేర్చుకుంటున్నాను. చాలా త్వరగా చాలా బీట్స్ నేర్చుకున్నాను. దీనిలో నాకు నా స్నేహితుడు సహాయం చేసాడు. నేను ఈ సంవత్సరం కొత్తగా ఈ క్లాస్‌లో చేరాను, నా స్నేహితుడు రెండు సంవత్సరాల నుంచి నేర్చుకుంటున్నాడు. నేను నేర్చుకున్న కొన్ని బీట్స్ 1234 – 12234 – 122344 – 112113 – 1231212.

మా కాంగో డ్రమ్స్ సార్ చాలా చక్కగా మాకు అర్థమయ్యే విధంగా నేర్పిస్తారు. సీనియర్ అన్నయ్యలు కూడా మాకు కాంగో డ్రమ్స్ బీట్స్‌లో చక్కగా సహాయం చేస్తారు. మా ఈసీఏలో చాలా తక్కువ మంది ఉంటారు కనుక ప్రతి ఒక్కరికి కూడా కాంగో డ్రమ్స్ బీట్స్ నేర్చుకునే అవకాశం ఉంటుంది. వచ్చే సంవత్సరం కూడా నేను నా ఈసీఏలో ఈ కాంగో డ్రమ్స్‌ని తీసుకుంటాను. ఎక్కువ బీట్స్ నేర్చుకొని నా నైపుణ్యాన్ని పెంచుకుంటాను.



– ఎ.ఆర్నవ్ యిరాజ్,
5వ తరగతి,
అరవింద హైస్కూలు,
కుంచనపల్లి.

నేను గీసిన బొమ్మ





– ఎం.సిశాంతచారి,
7వ తరగతి, శ్లోక కాన్సెప్ట్ స్కూల్, కుకునూరు,
ఏలూరు.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

చిరంజీవితో అనిల్ రావిపూడి సినిమా



సీనియర్ నటుడు చిరంజీవితో హిట్ చిత్రాల దర్శకుడు అనిల్ రావిపూడి ఓ సినిమా తెరకెక్కించబోతున్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే అనిల్ రావిపూడి ప్రకటించారు. ఇప్పటివరకూ ఆయన దర్శకత్వంలో వచ్చిన పటాస్, రాజా ది గ్రేట్, ఎఫ్ 2, సరిలేరు నీకెవ్వరు, భగవంత్ కేసరి వంటి సినిమాలు ప్రేక్షకులను బాగా అలరించాయి. ప్రస్తుతం వశిష్ఠ దర్శకత్వంలో 'విశ్వంభర' సినిమాలో చిరంజీవి నటిస్తున్నారు. ఈ చిత్రం వచ్చే ఏడాది విడుదల కానుంది. ఇప్పటికే షూటింగ్ పూర్తయ్యింది. విడుదల తేదీని మాత్రమే ప్రకటించాల్సివుంది. ఈ సినిమా తర్వాత చిరంజీవితో కొత్త ప్రాజెక్టు చేయబోతున్నారు. ఈ భారీ ప్రాజెక్టును షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహూ గారపాటి నిర్మించనున్నారు. అనిల్ రావిపూడి ప్రస్తుతం 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా నిర్మాణానంతర కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు. జనవరి 14న ఈ సినిమా విడుదల కానుంది. ప్రమోషన్ కార్యక్రమంలో అనిల్ రావిపూడి మాట్లాడుతూ 'నేను చిన్నతనం నుంచి చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేష్ చిత్రాలను చూస్తూ పెరిగాను. ఇప్పటికే బాలకృష్ణ, వెంకటేష్‌తో కలిసి సినిమా చేశా. ఇప్పుడు చిరంజీవితో కలిసి పనిచేసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నా' అని పేర్కొన్నారు. చిరంజీవితో అనిల్ రావిపూడి కొత్త సినిమా ఏప్రిల్‌లో సెట్స్‌పైకి రానుందని చర్చ జరుగుతోంది.

27న 'ఓ తండ్రి తీర్పు' విడుదల



వివరెడ్డి నటిస్తున్న కొత్త చిత్రం 'ఓ తండ్రి తీర్పు'. రాజేంద్రరాజు కాంచనపల్లి రచన, దర్శకత్వ పర్యవేక్షణలో ప్రతాప్ భీమవరపు ఈ ప్రాజెక్టు చేపట్టారు. ఎవికె ఫిలింస్ బ్యానర్‌పై లయన్ ఆరిగపూడి విజయ్‌కుమార్ సమర్పణలో లయన్ శ్రీరామ్ దత్తి నిర్మిస్తున్నారు. డాక్టర్ కెవి రమణాచారి ఆశీస్సులతో ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోందని మేకర్లు ప్రకటించారు. ఆస్తులపై ఉన్న ప్రేమ తల్లిదండ్రులపై లేకపోవటం ఎంతటి మానసిక క్షోభకు గురిచేస్తుందో అనే ఇతివృత్తంగా ఈ సినిమా సాగుతుంది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తయ్యాయి. వివ రెడ్డి చేస్తున్న పాత్ర చాలామంది కొడుకులకు కనువిప్పు కలిగించేదిగా ఉంటుందనీ, ఒక మంచి కుటుంబ కథా చిత్రాన్ని నిర్మిస్తున్నందుకు గర్వంగా ఉందని నిర్మాత శ్రీరామ్ దత్తి అన్నారు.

'బరోజ్' ట్రైలర్ విడుదల



మోహన్‌లాల్ స్వీయ దర్శకత్వంలో నటిస్తూ తెరకెక్కిస్తున్న చిత్రం 'బరోజ్'. ఫ్యాంటసీ కథతో తెరకెక్కుతున్న ఈ చిత్రం నుంచి తెలుగు ట్రైలర్‌ను మేకర్లు విడుదల చేశారు. ఈ సినిమా విడుదల హక్కులను మైత్రీ మూవీ మేకర్స్ సొంతం చేసుకున్నారు. ఈనెల 25న పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా విడుదల కానుంది. బరోజ్ కథ నచ్చడంతో తొలిసారిగా మోహన్‌లాల్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో ఆయన పాత్ర కూడా చాలా ఆసక్తికరంగా ఉంది. వాస్కోడిగామా నిధిని కాపాడే జినీగా మోహన్‌లాల్ నటిస్తున్నారు. డ్రీమ్ ప్రాజెక్టుగా 'బరోజ్' చిత్రాన్ని తన సొంత నిర్మాణ సంస్థ ఆశీర్వాద్ ఫిల్మ్స్ బ్యానర్‌పై నిర్మించారు. ఆంటోనీ పెరుంబావూర్ నిర్మాత.



సరికొత్త కథతో 'యుఐ'

'యుఐ' సినిమా రెగ్యులర్ ఫిలిం కాదు. షాకింగ్‌గా ఉంటుంది. ఆడియన్స్‌పై నమ్మకంతో తీశాను. ఒక న్యూ ఇమేజినరీ వరల్డ్‌ని ఎక్స్‌పీరియన్స్ చేస్తారు. తెలుగు ఇండస్ట్రీ ప్రపంచాన్నే షేక్ చేస్తుంది. రూ.1000 నుంచి రూ.2000 కోట్లు సినిమాలతో బ్లాక్ బస్టర్ హిట్లు కొడుతున్నారు. అయినప్పటికీ ఒక చిన్న టాలెంట్‌ని చూసి కూడా గొప్పగా ఆదరిస్తున్నారు. దానికి నేనే నిదర్శనం. మీ ప్రేమను చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది' అని నటుడు ఉపేంద్ర అన్నారు. లహరి ఫిల్మ్స్, జి.మనోహరన్, వీనస్ ఎంటర్‌టైనర్స్ కెపి శ్రీకాంత్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నవీన్ మనోహరన్ సహ నిర్మాత. గీతా ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్స్ ఈ చిత్రాన్ని తెలుగులో ఈనెల 20న విడుదల చేయనున్నారు. దర్శకత్వం బుచ్చిబాబు సాన, నిర్మాత ఎస్‌కెఎన్. ప్రీ రిలీజ్ ఈవెంట్‌తో చిత్ర యూనిట్ సభ్యులంతా పాల్గొన్నారు.

'రాబిన్‌హుడ్' రాక వాయిదా

క్రిస్మస్ రేసు నుంచి 'రాబిన్‌హుడ్' సినిమా తప్పుకుంది. ఈ మేరకు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటన విడుదల చేసింది. 'భీష్మ' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత నటుడు నితిన్, దర్శకుడు వెంకీ కుడుముల కాంబినేషన్‌లో రూపొందుతున్న ఈ చిత్రాన్ని ఈనెల 25న విడుదల చేస్తామని మైత్రీ మూవీ మేకర్స్ ప్రకటించారు. అయితే తాజాగా ఆ సంస్థ మరో ప్రకటన చేసింది. అనుకున్న తేదీలో చిత్రాన్ని విడుదల చేయటం లేదంటూ తెలిపింది. కొత్త రిలీజ్ డేట్‌ను త్వరలో ప్రకటిస్తామని పేర్కొంది. మైత్రీ మూవీస్ నుంచి తెరకెక్కిన 'పుష్ప 2' ఇంకా థియేటర్లలో రన్ అవుతూనే ఉంది. మరోవైపు మోహన్‌లాల్ 'బరోజ్' తెలుగు వెర్షన్‌ను ఇదే సంస్థ 25న విడుదల చేస్తుంది. క్రిస్మస్ రేసులో 10కిపైగా చిత్రాలు ఉన్నాయి. దీంతో థియేటర్లలో కొరత ఏర్పడే ఛాన్స్ ఉందని రాబిన్‌హుడ్‌ను వాయిదా వేశారు. ఈ సినిమాలో నితిన్ సరసన శ్రీలీల నటించారు. వెంకీ కుడుముల దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మించారు.



ఫాలో ఆన్ గండం గట్టెక్కింది

- కెఎల్ రాహుల్, జడేజా అర్ధసెంచరీలు
- ఇండియా 252/9
- నాల్గోరోజు ఆటకూ వర్షం అడ్డంకి



బ్రిస్బేన్: టీమిండియా ఓపెనర్ కెఎల్ రాహుల్, ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా అర్ధసెంచరీలకి తోడు బుమ్రా, ఆకాశ్‌దీప్ రాణించడంతో టీమిండియాను ఫాలో ఆన్ గండం గట్టెక్కింది. నాల్గోరోజు ఆటకు పలుమార్లు వర్షం ఆటకు అంతరాయం కలిగినా.. ఆట ముగిసే సమయానికి ఇండియా 9 వికెట్ల నష్టానికి 252 పరుగులు చేసింది. పదో వికెట్‌కు బుమ్రా, ఆకాశ్‌లు కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. వీరిద్దరూ అజేయంగా 39 పరుగులు జోడించారు. బుమ్రా 10, ఆకాశ్ దీప్ 27 పరుగులతో క్రీజ్‌లో నిలిచి టీమిండియాను ఆదుకొని ఫాలో ఆన్ గండం గట్టెక్కించారు. మరో 193 పరుగులు వెనుకబడి ఉన్న భారత్... ఐదో రోజు ఆట ఇరుజట్లకు కీలకం కానుంది. ఓవర్‌నైట్ స్కోర్ 4వికెట్ల నష్టానికి 51పరుగులతో మంగళవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్‌ను కెఎల్ రాహుల్ ఆదుకున్నాడు. ఓపెనర్ కేఎల్ రాహుల్ నిలకడగా ఆడినా.. కెప్టెన్ రోహిత్ శర్మ ఎక్కువ సేపు క్రీజులో నిలువలేకపోయాడు. 27బంతుల్లో 10పరుగులు చేసి ఇన్నింగ్స్ 23.3వ ఓవర్‌లో కమిన్స్ బౌలింగ్‌లో క్యారీకి క్యాచ్ ఇచ్చి వెనుతిరిగాడు. జట్టు స్కోరు 200 కూడా దాటడం కష్టమైన తరుణంలో రాహుల్‌తో జతకట్టిన జడేజా ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. అయితే నిలకడగా ఆడుతున్న ఓపెనర్ రాహుల్‌ను(84) స్పిన్నర్ లియాన్ బౌలింగ్‌లో స్టీవ్ స్మిత్ పట్టిన ఓ అద్భుత క్యాచ్‌కు ఔటయ్యాడు. ఆ తర్వాత సీనియర్ ఆల్‌రౌండర్ 82 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే వర్షం పదే పదే కురవడంతో మ్యాచ్‌ను అంపైర్లు నిలిపివేశారు. నితీశ్ 61 బాల్స్‌లో 16 పరుగులు చేసి ఔటయ్యాడు. ఆ దశలో జడేజా ధాటిగా ఆడాడు. 123బంతుల్లో 7ఫోర్లు, ఓ సిక్సర్ సాయంతో 77పరుగులు చేశాడు.

హేజిల్‌వుడ్‌కు గాయం

ఆస్ట్రేలియా పేస్ బౌలర్ జోష్ హేజిల్‌వుడ్ మళ్లీ గాయపడ్డాడు. కుడికాలు పిక్క కండరాల్లో నొప్పితో మైదానాన్ని వీడాడు. దీంతో అతడు తర్వాతి రెండు టెస్టులకు దూరమయ్యే అవకాశముంది. ఈ విషయాన్ని క్రికెట్ ఆస్ట్రేలియా(సిఎ) ఓ ప్రకటనలో వెల్లడించింది. వార్మప్ సమయంలో హేజిల్‌వుడ్ కండరాలకు గాయమైంది. నాలుగవ రోజు కేవలం ఒక్క ఓవర్ మాత్రమే వేశాడు. ఆస్ట్రేలియా బౌలర్లు కమిన్స్‌కు నాలుగు, స్టార్క్‌కు మూడు, హేజిల్‌వుడ్, లియాన్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.

స్కోర్‌బోర్డు...

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 445ఆలౌట్

ఇండియా తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి)మిచెల్ మార్ష్ (బి)స్టార్క్ 4, కెఎల్ రాహుల్ (బ్యాటింగ్) 33, గిల్ (సి)మిఛెల్ మార్ష్ (బి)స్టార్క్ 1, కోహ్లి (సి)క్యారీ (బి)హేజిల్‌వుడ్ 3, పంత్ (సి)క్యారీ (బి)కమిన్స్ 9, రోహిత్ శర్మ (సి)క్యారీ (బి)కమిన్స్ 9, జడేజా (సి)మిఛెల్ మార్ష్ (బి)కమిన్స్ 77, నితీశ్‌కుమార్ రెడ్డి (బి)కమిన్స్ 16, సిరాజ్ (సి)క్యారీ (బి)స్టార్క్ 1, బుమ్రా (బ్యాటింగ్) 10, ఆకాశ్‌దీప్ (బ్యాటింగ్) 27, అదనం 10, (74.5 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి) 252పరుగులు. **వికెట్ల పతనం:** 1/4, 2/6, 3/22, 4/44, 5/75, 6/141, 7/194, 8/201, 9/213 **బౌలింగ్:** స్టార్క్ 24-3-83-3, హేజిల్‌వుడ్ 6-2-22-1, కమిన్స్ 20.5-2-80-4, లియాన్ 21-0-54-1, హెడ్ 1-0-1-0, మార్ష్ 2-0-6-0.

మంధాన మెరిసినా..


- రెండో టి20 వెస్టిండీస్ మహిళలతో చేతిలో 9వికెట్ల తేడాతో టీమిండియా ఓటమి
- మాథ్యూస్ కెప్టెన్సీ ఇన్నింగ్స్



ముంబయి: రెండో టి20లో టీమిండియా కెప్టెన్, ఓపెనర్ స్మృతి మంధాన అర్ధసెంచరీతో మెరిసినా.. వెస్టిండీస్ కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడి ఆ జట్టును గెలిపించింది. తొలుత మంధాన(62)కి తోడు వికెట్ కీపర్ రీచా ఘోష్(32) రాణించడంతో బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 159పరుగులు చేసింది. ఆ లక్ష్యాన్ని వెస్టిండీస్ మహిళలు 15.4 ఓవర్లలో జోసెఫ్(38) వికెట్ చేజార్చుకొని లక్ష్యాన్ని ఛేదించింది. మాథ్యూస్(85నాటౌట్), క్యాంప్‌బెల్(29) మ్యాచ్‌ను ముగించారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా.. మంధాన (62; 41 బంతుల్లో 9 ఫోర్లు, సిక్సర్) మరోసారి అర్ధ శతకంతో మెరిసింది. రెగ్యులర్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ గాయపడడంతో స్మృతి మంధాన కెప్టెన్‌గా వ్యవహరించింది. దీంతో ఈ మ్యాచ్‌కు కౌర్ దూరం కాగా.. బీసీసీఐ వైద్య బందం ఆమె పురోగతిని పర్యవేక్షిస్తోంది.చివర్లో రిచా ఘోష్ (32; 17 బంతుల్లో 6 ఫోర్లు) దూకుడుగా ఆడింది. జెమీమా రోడ్రిగ్స్ (13), దీప్తి శర్మ (17) పరుగులు చేశారు. ఉమా ఛెత్రి (4), రాఘవి బిస్త్ (5), సజీవన్ సజన (2) సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితమయ్యారు. విండీస్ బౌలర్లలో హేలీ మాథ్యూస్, అఫీ ఫ్లెచర్, డియాంద్రా డాటిన్, హెన్రీ తలో రెండు వికెట్లు పడగొట్టారు. ఛేదనలో వెస్టిండీస్ ఓపెనర్లు జోసెఫ్–మాథ్యూస్ తొలి వికెట్‌కు 6.4ఓవర్లలో 66పరుగులు చేసి భారీ పునాది వేశారు. జోసెఫ్(38; 22బంతుల్లో 6ఫోర్లు, 2సిక్సర్లు) ధనా ధన్ ఇన్నింగ్‌కు తోడు కెప్టెన్ మాథ్యూస్(85నాటౌట్; 47బంతుల్లో 17ఫోర్లు) మ్యాచ్‌ను ముగించారు. ఆ తర్వాత క్యాంప్‌బెల్(29నాటౌట్; 26బంతుల్లో 4ఫోర్లు) రాణించారు. టీమిండియా బౌలర్ సైమాకు ఒక వికెట్ దక్కింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ మాథ్యూస్‌కు లభించగా.. మూడు టి20ల సిరీస్‌ల ఇరుజట్లు 1-1తో సమంగా ఉన్నాయి. నిర్ణయాత్మక మూడో, చివరి టి20 గురువారం జరగనుంది. **స్కోర్‌బోర్డు(సంక్షిప్తంగా): టీమిండియా మహిళలు:** 152/9 20ఓవర్లలో (మంధాన 62, రీచా ఘోష్ 32 ; ఫ్లేచర్(2/28), మాథ్యూస్ (2/36) **వెస్టిండీస్ మహిళలు :** 160/1 (15.4ఓవర్లలో; మాథ్యూస్(నాటౌట్) 85, క్యాంప్‌బెల్ (నాటౌట్) 29; సైమా 1/38)

యుపి యోథాస్ గెలుపు

ప్రొ కబడ్డీ సీజన్-11



పూణే: ప్రొ కబడ్డీ సీజన్-11లో యుపి యోథాస్ ప్లే-ఆఫ్‌కు చేరువైంది. మంగళవారం జరిగిన గ్రూప్ లీగ్ పోటీలో యుపి యోథాస్ 31-24పాయింట్ల తేడాతో హర్యానా స్టీలర్స్‌ను చిత్తుచేసింది. యుపి జట్టులో భవానీ రాజ్‌పుట్(11) రైడ్స్‌లో రాణించగా.. భరత్, సుమిత్ ట్యాకిల్స్‌లో మెరిసారు. ఇక హర్యానా జట్టులో వినయ్(6), విశాల్(6) మాత్రమే రైడ్స్‌లో రాణించారు. మరో మ్యాచ్‌లో జైపూర్ పింక్ ప్యాంథర్స్ 35-26పాయింట్ల తేడాతో బెంగళూరు బుల్స్‌ను చిత్తుచేసింది. ఈ విజయాలతో 20మ్యాచ్‌లు ముగిసేసరికి యుపి జట్టు 3వ, జైపూర్ జట్టు 5వ స్థానానికి ఎగబాకాయి.

ప్రొ కబడ్డీలో నేడు...

గుజరాత్ × యుపి(రాత్రి 8.00గం॥లకు)
ముంబయి × పట్నా(రాత్రి 9.00గం॥లకు)

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68